# జనశక్తి

వెబ్‌సైట్ :
www.janasakthionline.com

ఈ-మెయిల్ :
janasakthi@gmail.com

సంపుటి : 51 | సంచిక : 2, 3 | విజయవాడ | 5-3-2018 | పేజీలు : 24 | వెల : రు. 10/-


# ప్రజల మౌలిక సమస్యలతో సంబంధంలేని 'ప్రత్యేకహోదా'ను మరోసారి ఎజెండా చేస్తోన్న పాలకులు

**కాలచక్రం** ఎన్నికలకు దగ్గరవుతూంటే, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పాలకపార్టీలు అధికారంకోసం అర్రులు చాస్తూ, ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకుంటూ, రాష్ట్ర రాజకీయ వాతావరణాన్ని మరింత దిగజారుస్తున్నాయి. ప్రజల మౌలిక సమస్యలను ప్రక్కకు మళ్ళిస్తూ, సాధ్యమైనంత ఎక్కువకాలం వాయిదావేస్తూ రావటంలో ఈ పార్టీలన్నిటి నడుమ ఏకీభావం వుంది.

ఆంధ్రప్రదేశ్ విభజనచట్టం - 2014లోని అంశాలన్నింటినీ సాధిస్తామని, ప్రత్యేకహోదా తెస్తామనీ రాష్ట్రంలోని తెలుగుదేశం పాలకులూ, ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేకహోదా కల్పిస్తామని బిజెపి నాయకులూ ఊదరగొట్టారు. పార్లమెంటులో విభజన చట్టంపై చర్చ సందర్భంగా ఏ.పి.కి ఐదు సం॥లు ప్రత్యేకహోదా కల్పిస్తామని నాటి ప్రధాని హామీ ఇస్తే, 'కాదు.... పది సం॥లు ప్రత్యేకహోదా కావాల్సిందేన'ని బిజెపి నేతలు డిమాండ్ చేశారు. వారి ఎన్నికల ప్రణాళికలో హామీగా ఆ అంశాన్ని పేర్కొన్నారు. ప్రత్యేక హోదా అంటే ఏమిటో విడమర్చి వివరించకుండా, దానినొక 'బ్రహ్మపదార్థం'గా చేసి, భావోద్వేగాల అంశంగా మార్చారు.

కొన్ని వెనుకబడిన ప్రాంతాలను త్వరితంగా అభివృద్ధిచేసే లక్ష్యంతో - జనాభా, తలసరి ఆదాయం, ఆయా రాష్ట్రాల ప్రత్యేక సమస్యలను పరిగణలోకి తీసుకొని కేంద్ర ప్రణాళికా సంఘం ప్రత్యేకహోదా కల్పించే రాష్ట్రాలను నిర్ణయించేది. నాల్గవ పంచవర్ష ప్రణాళిక కాలంలో అస్సాం, నాగాలాండ్, జమ్ము-కాశ్మీర్ రాష్ట్రాలకు ప్రత్యేకహోదా కల్పించారు. ఐదవ పంచవర్ష ప్రణాళికా కాలంనాటికి ఈశాన్య భారతంలోని ఏడు రాష్ట్రాలకు, సిక్కిం, హిమాచలప్రదేశ్‌లకు ప్రత్యేకహోదానిచ్చారు.

పంచవర్ష ప్రణాళికద్వారా మొత్తంగా రాష్ట్రాలకు కేటాయించే నిధులలో ప్రత్యేకహోదా పొందిన రాష్ట్రాలకు 30 శాతం నిధులు లభిస్తాయి. ప్రణాళికా సంఘం ఇచ్చే ఈ నిధులలో 30 శాతం (తిరిగి చెల్లించనవసరంలేని) గ్రాంటుగానూ, 70 శాతం రుణంగానూ వుంటుంది. కాగా, 2001 నుండీ పదేళ్ళపాటు ఆదాయపన్ను, కేంద్ర ఎక్సైజు పన్నులను ప్రత్యేకహోదా రాష్ట్రాలకు కేంద్రప్రభుత్వం వందశాతం మినహాయింపునిచ్చింది. ఇది - ప్రత్యేహోదాతో ఆటోమాటిక్‌గా వచ్చేదికాదు; కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయమే!

బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్ర ప్రణాళికాసంఘాన్ని రద్దుచేసి, దాని స్థానంలో 'నీతి ఆయోగ్'ను ఏర్పరిచింది. కనుక, ప్రత్యేక హోదా పొందిన రాష్ట్రాలకు ఇక ప్రణాళికా సంఘం నిధులు కేటాయించటమనేది వుండదు; దాని స్థానంలో ఏర్పాటైన నీతి ఆయోగ్ విధి విధానాలు ఎలా వున్నాయో స్పష్టతలేదు. అయితే నీతి ఆయోగ్ రాష్ట్ర ప్రణాళికలకు నిధులు కేటాయించే పనిచేయదనేది స్పష్టం. కేంద్రం నూతనంగా ప్రవేశపెట్టిన నూతన పన్నుల విధానం జిఎస్‌టితో రాష్ట్రాల ఆదాయంలో అధికభాగం కేంద్రం వద్దే పోగుపడుతుంది. ఏమైనా 14వ ఆర్థిక సంఘం కేంద్ర నిధుల నుండి రాష్ట్రాలకు పంపకం చేయాల్సిన భాగాన్ని 32 నుండి 42 శాతానికి పెంచింది. ఇకపై ఏ రాష్ట్రానికీ ప్రత్యేకహోదా ఇవ్వవద్దని 14వ ఆర్థిక సంఘం సిఫార్స్ చేసినట్లుగా బూటకపు ప్రచారాన్ని బిజెపి, టిడిపిలు చేశాయి. ప్రత్యేక ప్యాకేజీతో 'ప్రత్యేకహోదా'కు మించిన లబ్ధిని రాష్ట్రానికి చేకూరుస్తామని ప్రజలను నమ్మింపజూశాయి.

బిజెపితో చెలిమిలో వున్న రాష్ట్రంలోని తెలుగుదేశం ప్రభుత్వం విభజన చట్టంలోని పథకాలను, బిజెపి ఎన్నికల హామీలను కేంద్రం మెడలు వంచి అమలు చేయించే ప్రయత్నం చేయలేదు. తానుగా ప్రజా రాజధాని నిర్మాణం పేరిట ముక్కారు పంటలు పండే 33 వేల ఎకరాల మంగళగిరి ప్రాంత రైతుల భూములను అదిరింపులు, బెదిరింపులతో గుంజుకుంది. ప్రపంచస్థాయి రాజధాని అంటూ గ్రాఫిక్స్ మాయాజాలంతో ప్రజలను వంచనకు గురిచేస్తోంది. రాజధాని నిర్మాణం కోసమేగాక పోర్టులు, విమానాశ్రయాలు, పార్కులు, భారీ రహదారులు, ప్రాజెక్టులు తదితర నిర్మాణాలపేరిట రాష్ట్రవ్యాపితంగా ప్రజలనుండి బలవంతంగా పెద్దఎత్తున భూములను సేకరించటం వల్ల ప్రజలు తీవ్ర ఆగ్రహంతో నున్నారు. రైతాంగ రుణమాఫీని 50 వేల రూ॥కు పరిమితం చేసి, అదికూడా ఈనాటికీ పూర్తిగా మాఫీచేయకపోవటం రైతులలో తీవ్ర

# జనశక్తి

సంపాదకుడు

**పి. జస్వంతరావు**

సంపుటి : 51 సంచిక : 2, 3

5-3-2018


## లోపలి పేజీల్లో....


ప్రపంచ పరిణామాలు :

| | |
|---|---|
| యూరప్ | 3 |
| పాకిస్థాన్ | 5 |
| ఉత్తర కొరియా | 7 |
| ఇరాన్ | 9 |
| యెమన్ | 10 |

రాజకీయార్థికం :

| | |
|---|---|
| అసోమ్‌లో పౌరసత్వ మతతత్వీకరణ | 11 |
| కస్‌గంజ్‌లో మతతత్వదాడులు | 17 |
| కోరేగావ్‌లో దళితుల పోరాటం | 18 |
| అసోమ్‌లో బలవంతపు తొలగింపుకు వ్యతిరేకత | 20 |
| ఊంఛాహార్ ప్రేలుళ్ళు | 22 |
| వెదురు వృక్షజాతి కాదు | 23 |

వ్యాసం :

| | |
|---|---|
| భారత బడా బూర్జువావర్గ విస్తరణవాద కాంక్షలు - ఆర్థిక మూలాలు | 12 |



**వెల :** విడిప్రతి....................రూ.10/-
సంవత్సర చందా....రూ. 100/-

చిరునామా :

**పి. జస్వంతరావు,** సంపాదకుడు
**32-13-26/1, బి.ఎం.ఆర్. రోడ్,**
**ఎం.ఆర్.పురం, విజయవాడ-10.**


అసంతృప్తిని కలిగించింది. ఒకవైపు అప్పు రద్దుకాక, మరోవైపు అప్పు చెల్లించలేదనే కారణంతో బ్యాంకులు అందించే కనీసపాటి రుణసౌకర్యానికి కూడా అనర్హులై, రైతాంగం తీవ్ర అవస్థలనెదుర్కొన్నారు. ఇక చేనేత, డ్వాక్రా రుణాల రద్దు తతంగం కూడా ఈ కోవలోకే చేరింది. కాంట్రాక్టు కార్మికులు, అధ్యాపకులు, అంగన్‌వాడీలు, మొదలుకొని వివిధ సెక్షన్ల ఉద్యోగులకు, కార్మికుల కిచ్చిన ఏ హామీని అమలుచేయకుండా బిజెపికి వలెనే తెలుగుదేశం ప్రభుత్వం కూడా దాట వేసింది. వీనికి తోడు కరవు, గిట్టుబాటుధరలు, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, ఉపాధి కొరత వంటి సమస్యలతో అన్ని సెక్షన్ల ప్రజానీకం వివిధ రూపాల్లో తమ నిరసనను, అసంతృప్తిని వ్యక్తం చేస్తూ వస్తున్నారు.

ప్రతి సోమవారాన్ని 'పోల'వారంగా, పోలవరంపై ప్రత్యేక శ్రద్ధతో 2018నాటికే నిర్మాణం పూర్తిచేస్తామని చెబుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను, రైతాంగాన్ని మోసం చేస్తోంది. కేంద్ర ప్రభుత్వ బాధ్యతగా విభజన చట్టంలో పేర్కొన్న పోలవరం ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తీసుకొంది. కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టు కోసం ఏదో మేరకు కోటాయించిన నిధులను పట్టిసీమ తదితర ప్రాజెక్టులకు మళ్ళించి (పోలవరం పూర్తికాదని ఎటూ తెలుసు కనుక!) గోదావరిని కృష్ణానదితో అనుసంధానం చేసిన అపర భగీరధుడిగా ముఖ్యమంత్రి తెలుగుదేశం శ్రేణుల నుండి స్తోత్ర పాఠాలందుకున్నాడు. పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం కేటాయించిన నిధులు, వాటి ఖర్చులకు సంబంధించిన సరైన సమాచారాన్ని ఇరువైపుల నుండీ పారదర్శకంగా వెల్లడి చేయకుండా ప్రజలను గందరగోళ పరుస్తున్నారు. నానాటికీ పెరుగుతున్న నిర్మాణ వ్యయంతో ప్రాజెక్టు నిర్మాణ ఖర్చును పెంచి చూపటంతోపాటు వాటిలో వాటాకోసం వెంపర్లాడు తున్నారు. బడా పారిశ్రామిక అవసరాలకోసం, ఆ పరిశ్రమలకు అవసరమైన విద్యుదుత్పాదన కోసం, జలరవాణా సౌకర్యాలకోసం ఉద్దేశించిన పోలవరం ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్ ప్రజల పాలిట కల్పతరువుగా చిత్రించారు. ప్రాజెక్టు నిర్మాణంలో ముఖ్యమైన భూసేకరణ అంశంలో ముంపుకు గురయ్యే వేలాది గిరిజన గ్రామాలకు సమగ్ర, శాస్త్రీయ పునరావాసం అమలుచేయకుండా అదిరింపు, బెదిరింపులతో, బలప్రయోగంతో ఖాళీ చేయించటంపట్ల వారంతా తీవ్ర వ్యతిరేకతతోనున్నారు.

పైన పేర్కొన్న వివిధ కారణాలుగా ప్రజలలో గూడుకట్టుకుంటున్న ఈ అసంతృప్తి, ఆగ్రహాలను ప్రక్కకు మళ్ళించటం ద్వారా, రాబోయే ఎన్నికలలో రాజకీయంగా తాను లబ్ధిపొందగలుగుతానని తెలుగుదేశం పార్టీ భావిస్తోంది. గత నాలుగేండ్లుగా కేంద్రంతో సర్దుకుపోవాలంటూ, ప్రత్యేకహోదా 'సంజీవని' కాదని, అంతకుమించిన ప్యాకేజీని సాధించుకున్నామంటూ ఊదరగొట్టిన తెలుగుదేశం పార్టీ, ఒక్కసారిగా స్వరం మార్చింది. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి కేటాయింపులలో అన్యాయం జరిగిందని బాహాటంగా ప్రకటించటంతోపాటుగా, ప్రత్యేకహోదా కల్పించకుండా కేంద్రం 'తెలుగు ప్రజల'ను మోసగించిందని భావోద్వేగాలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోంది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తమ రాజకీయ ప్రాబల్యాన్ని పెంచుకోవాలని వ్యూహరచన చేస్తున్న బిజెపి నాయకులు గత నాలుగేళ్ళుగా మిన్నకుండి, నేడే కనుగొన్నట్లుగా తెలుగుదేశం ప్రభుత్వ వైఫల్యాలపై గొంతెత్తారు. విభజన జరిగి ఇబ్బందులలో వున్న రాష్ట్రానికి ప్రపంచస్థాయి రాజధాని నిర్మాణం అవసరమా అని ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిన నిధులను సక్రమంగా వినియోగించలేదని రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారు. కేంద్ర పథకాలన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వ పథకాలుగా చెప్పుకోవటంతోపాటు, కేంద్రం విడుదలచేసిన నిధులకు లెక్కలు కూడా చూపలేదని పేర్కొంటూ, ఎదురు ఆరోపణలు చేస్తున్నారు. పది సం॥ల కాలం హైదరాబాద్ రాజధానిగా పరిపాలన సాగించగలిగీ, రాజధాని నిర్మాణానికి ఎందుకు తొందరపడ్డారని నిలదీస్తున్నారు. ఇంత దుమ్మెత్తిపోసుకుంటూ కేంద్రంలో, రాష్ట్రంలో రెండు పార్టీలూ ఇంకా మిత్రకూటమిగానే కొనసాగుతున్నామని ప్రజలను నమ్మమంటున్నారు. తెలుగుదేశం ప్రభుత్వం తన స్వీయ వైఫల్యాలన్నింటినీ కేంద్రప్రభుత్వం పైకి తోసివేయజూస్తోందని, బిజెపి మాత్రం విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఉదారంగా ఎంతో ప్రయోజనం చేకూర్చిందని నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. తద్వారా రాష్ట్రంలో తమ రాజకీయ పరపతి పెంపుకు ప్రయాస పడుతున్నారు.


**(తరువాయి 19వ పేజీలో)**


**మార్చి 5 - స్టాలిన్ 65వ వర్ధంతి**

**మార్క్సిస్టు మహోపాధ్యాయుడు కా. స్టాలిన్‌కు జోహార్లు**

# యూరప్ కాలరాయబడుతున్న శ్రామికవర్గ హక్కులు




**19వ** శతాబ్దపు ద్వితీయార్ధం మరియు 20వ శతాబ్దంలో యూరప్‌లోని కార్మికవర్గం, పెట్టుబడిదారీ విధానపు శ్రమశక్తి దోపిడీపైనా, ప్రధానంగా అసాధారణ పనిగంటల రూపంలో సాగుతున్న దోపిడీపైనా తీవ్రమైన పోరాటాలు చేసింది. ఈ పోరాటాలలో కార్మిక వర్గం ఎన్నో త్యాగాలు చేసింది. అంతిమంగా అనేక ప్రజాస్వామిక హక్కులతోబాటు ఎనిమిది గంటల పనిదినాన్ని సాధించింది.

కానీ పెట్టుబడిదారీ విధానపు నయా ఉదారవాద ఆర్థిక విధానాలు ప్రపంచమంతా అమలులోకి వచ్చిన తర్వాత, కార్మికవర్గం సాధించుకున్న హక్కులను తొలగించడానికి అన్ని ప్రయత్నాలూ జరుగుతున్నాయి. సంస్కరణలు, వికాసము, అభివృద్ధి, పోటీ వ్యాపారనుకూల వాతావరణం లాంటి ఆకర్షణీయమైన దళారీ నినాదాలతో కార్మిక హక్కులను కాలరాచే కార్యక్రమం సాగుతుంది.

ఈ విధానాల దుష్ప్రభావాల వల్ల నిరంతరం పెరుగుతున్న అసమానతలు, నిరుద్యోగం, సామాజిక అశాంతి, సంఘర్షణలను రూపు మాపడంలో ప్రజలందరికీ సంపదలు అందించడంలో, తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి పెట్టుబడిదారీ విధానం కొత్త సామాజిక ఎజెండాను చేపట్టింది. అది ప్రజల మధ్య వైషమ్యాలను పెంచి, విభజించే మోసపూరితమైన ఎజెండా. తీవ్రవాదానికి వ్యతిరేకంగా పోరాటం అనే సాకుతో జాతి వాదాలను రెచ్చగొట్టడం ద్వారా, వలస వ్యతిరేక వాదాలకు ఆజ్యం పోయడం ద్వారా, వివిధ వర్గాల ప్రజలు తమలో తామే కలహించుకునే విధంగా, ఈ విధానాలను వ్యతిరేకిస్తున్న ప్రజల కోపోద్రేకాలను తెలివిగా దారి మళ్ళిస్తోంది. ఆ విధమైన మోసపూరితమైన చర్యలతో పెట్టుబడిదారీ విధాన దోపిడీ నుండి ప్రజల ధ్యాసను మళ్ళిస్తూ ప్రపంచంలో పెట్టుబడిదారీ విధానమే తిరుగు లేని పరిపాలనా విధానమని తనకు తానే ప్రకటించుకుటోంది.

'మహా మాంద్యం' సమయంలో ఇలాంటి కుట్రలు, కుతంత్రాలనే పెట్టుబడిదారీ నయా ఆర్థిక విధానం అనుసరించింది. తిరిగి ఈనాడు యూరప్‌లో యివే కుతంత్రాలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. పాలకవర్గాలు, వాటి ప్రభుత్వాలు తీసుకుంటున్న ప్రతి చర్య, కార్మికవర్గాన్ని చీకటి యుగంలో చేసిన విధంగా శాశ్వతంగా బానిసలుగా చెయ్యడానికి ఉద్దేశించినవే.

సామ్రాజ్యవాద ఆర్థిక సంస్థలైన అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచబ్యాంకు షరతులు, ఆదేశాలతో యూరప్ దేశాల ప్రభుత్వాలు కార్మికవర్గంపై కొత్త దాడుల దొంతరను ప్రారంభించాయి.

రిపబ్లిక్ ఆన్ మార్చ్ పార్టీ (ఎల్ఆర్ఎమ్)కి చెందిన ఫ్రాన్స్ అధ్యక్షుడు మాకరాన్, కార్మికవర్గ హక్కులకు విఘాతం కలిగించే అనేక కార్మిక చట్టాలు చేశాడు. మూకుమ్మడిగా కార్మికులను తొలగించేందుకు, తరతరాల కార్మిక పోరాటాల ఫలితంగా సాధించుకున్న సామాజిక హక్కులను సమూలంగా నాశనం చేయడానికి ఈ చట్టాలు వీలు కల్పిస్తున్నాయి.

కార్మిక సంఘాలను పెట్టుబడిదారీ ప్రభుత్వ విభాగాలుగా మార్చడానికి మాకరాన్ చట్టాలు అధికారిక ముద్ర వేస్తున్నాయి. ఈ కార్మిక సంఘాలకు ఆర్థికపరమైన సబ్సిడీలు యిస్తూ యజమానుల నియంత్రణలో వుంచుకుంటున్నారు. ఈ కార్మికసంఘాలు సామూహిక మూసివేతలకు పథక రచనలో, చట్టబద్ధత కల్పించడంలో యాజమాన్యాలకు సహాయపడుతున్నాయి. కర్మాగారాలు మూసివేయకుండా నిర్వహించడానికి కార్మికుల జీతాలలో కోత విధించి కర్మాగారాన్ని కొనసాగించాలా? లేక మూసి వేయాలా అనే అంశంపై, స్వంత సంఘ సభ్యులపై జరిగిన దాడులపై రిఫరెండం నిర్వహించి యాజమాన్యాలకు అనుకూల నిర్ణయాలు తీసుకోవడానికి ఈ కార్మిక సంఘాలు దోహద పడ్తున్నాయి.

యూరపులో రెండవ అతిపెద్ద ఆటో తయారీ కంపెనీ (పిఎస్ఎ) పీజియట్ – సిట్రోన్ మాకరాన్ చట్టాల ఆసరాతో క్రమబద్ధీకరించని కార్మికుల సామూహిక తొలగింపులకు సిద్ధమవుతున్నట్లు ప్రకటించింది.

2008 ఆర్థిక సంక్షోభ కాలంలో ఫ్రెంచి ప్రభుత్వం పిఎస్ఎకి అనేక బిలియన్ల యూరోలను బెయిల్ అవుట్ విధానం క్రింద చెల్లించింది.

మార్చి 23
కా॥ కానూసన్యాల్
8వ వర్ధంతి

**నగ్జల్బరీ రైతాంగ ఉద్యమ నిర్మాత**
**కామ్రేడ్ కానూసన్యాల్‌కు అరుణారుణ జోహార్లు**

ఇప్పుడు పిఎస్ఎ కార్మికవర్గం సృష్టించిన అనేక బిలియన్ల యూరోలను కార్మికులను తొలగించి తన జేబుల్లో వేసుకోవడానికి సిద్ధపడుతోంది. ఐరోపా వ్యాప్తంగా వేలకొలది పిఎస్ఎ ఉద్యోగాలు ప్రమాదంలో పడ్డాయి. బెయిల్అవుట్ తర్వాత కొత్తగా నియమించుకున్న కార్మికుల వేతనాలు సగానికి సగం తగ్గించబడ్డాయి. ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేయడమే ప్రస్తుత లక్ష్యం. అందుకుగాను పనిగంటలు పెంచేందుకు అవకాశం కల్పించటం, మొత్తం కార్మికులలో అత్యధిక శాతం తాత్కాలిక కార్మికులు వుండేట్లు, అదీ వారికి గంటకు తొమ్మిది యూరోలు మాత్రమే చెల్లించేవిధంగా మార్పులను వేగిర పరచాలనుకుంటోంది.

మాకరాన్ చట్టం ప్రకారం మూకుమ్మడి తొలగింపులకు కార్మికసంఘ ఆమోదం కూడా అవసరంకాగా, అధికారిక కార్మిక సంఘంతో పిఎస్ఎ చర్చలు ప్రారంభించింది.

క్రమబద్ధీకరించని కార్మికుల మూకుమ్మడి తొలగింపు చట్టం ప్రకారం, కంపెనీలు మంచి లాభాలతో నడుస్తున్నప్పటికీ తన కార్మికులను తీసివేసే అధికారం, ఆ కంపెనీకి వుంది. అలాగే తొలగింపబడిన కార్మికులకు శిక్షణాకాలంలో లాభాలు యివ్వాల్సిన అవసరంగానీ, ఆర్థిక పరిస్థితులు మెరుగుపడింతర్వాత తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవాల్సిన అవసరంగానీ, కంపెనీకి లేదు. ప్రస్తుతం పిఎస్ఎ కార్మికులను తొలగించడానికి ఈ నిబంధనలను ఉపయోగించు కుంటోంది.

2012లోనే పిఎస్ఎ యాజమాన్యం ఉత్తర ఫ్రాన్స్‌లోని సెవెల్‌నార్డ్, పిఎస్ఎ ప్లాంట్‌లోని అధికారిక కార్మిక సంఘం నుండి మూకుమ్మడి రాయితీ ఒప్పందం పొందింది. 2013లో అలనాయ్‌లో వున్న తన పరిశ్రమను పిఎస్ఎ మూసివేసింది. ఈ ప్లాంట్ మూసివేతను పర్యవేక్షించిన కార్మికసంఘ నాయకునితో జనరల్ కన్ఫెడరేషన్ ఆఫ్ లేబర్ (సిజిటి) తరఫున పిఎస్ఎ యాజమాన్యం క్రమబద్ధీకరించని కార్మికుల మూకుమ్మడి తొలగింపులకు రూప కల్పన చేసే అంశంపై చర్చలు జరుపుతోంది.

ప్రపంచవ్యాప్తంగా వివిధ ప్రదేశాల్లో, వివిధ స్థాయిల్లో జరిగే ఉత్పత్తి ప్రక్రియ ద్వారా వస్తువులు తయారవుతున్నాయి. ఇలాంటి ఉత్పత్తి పరిస్థితులలో ఇప్పటికే ఆటో కార్మికులు తక్కువ వేతనాలతో మంచి జీవితాలను గడపలేక పోతున్నారు. ఒకవేళ క్రమబద్ధీకరించని కార్మికుల మూకుమ్మడి తొలగింపులకు సిజిటి నుండి పిఎస్ఎ ఆమోదాన్ని పొందగలిగితే యూరపు లోని ఆటో పరిశ్రమ కార్మికులు మరింత దారుణ పరిస్థితుల్లోకి నెట్టబడతారు.

కానీ అదే సందర్భంలో యూరప్‌లోని కార్మికులు, యాజమాన్యాలు తమపై చేస్తున్న దాడులను మర్యాదస్థుల్లాగా చూస్తూ ఆమోదించ దంలేదు. సెర్బియా, రుమేనియాలలో ఆటో పరిశ్రమ కార్మికుల నిరసనలు, సమ్మెలు పెల్లుబికాయి. జర్మనీలోని సీమెన్ కార్మికులు తమ హక్కులపైనా, సదుపాయాలపైనా జరుగుతున్న దాడికి వ్యతిరేకంగా పోరాటాలు చేస్తున్నారు.

ఫ్రాన్స్‌లో కార్మికవర్గంపై దాడులు ఆవిధంగా కొనసాగుతుంటే ఆస్ట్రియాలోని పాలకులు, ప్రభుత్వం మరో రూపంలో కార్మికవర్గంపై దాడులు ప్రారంభించాయి. ఇవి పనిగంటలను 8 నుండి 12కు పెంచడానికి ప్రయత్నాలు ప్రారంభించాయి.

ఇటీవల ఆస్ట్రియాలో తీవ్ర మితవాద పార్టీయైన ఫ్రీడం పార్టీ (ఎఫ్‌పిఒ), సనాతన పార్టీయైన పీపుల్స్ పార్టీ (ఒవిపి)లు కలిసి ఒవిపికి చెందిన సెబాస్టియన్ కుర్జ్ నాయకత్వాన సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేశాయి. ఈ ప్రభుత్వం రోజుకు పనిగంటలను 8 నుండి 12 గంటలకు గరిష్టంగా పెంచడానికి పథక రచన చేస్తున్నది. కార్పొరేట్ల దీర్ఘకాలిక డిమాండ్‌ను తీర్చి వారిని సంతృప్తిపరచడానికే ఈ పనిగంటల పెంపును ఈ ప్రభుత్వం చేపడ్తోంది.

ప్రవాసులు దేశంలోని ఉద్యోగాలన్నీ కొల్లగొట్టుకుపోతున్నారని, ఆ పరిస్థితిని మార్చి కార్మికవర్గ ప్రయోజనాలను కాపాడతాననే నినాదంతో ఈ ఎన్నికలలో ఎఫ్‌పిఒ ప్రచారం చేసింది. ఫలితంగా అనేకమంది కార్మికులు ఓటువేసి చేసి అధికారంలోకి తెచ్చారు. ఇప్పుడు ఆస్ట్రియా ప్రభుత్వంలో ఎఫ్‌పిఒ పోలీసు, సైన్యం మరియు గూఢచారి సంస్థలకు ఆధిపత్యం వహిస్తుంది.

ఈ సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు మార్కెట్ అనుకూల విధానాలను విమర్శించింది. కాని తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత, ఆ మార్కెట్ అనుకూల విధానాలనే అమలుచేస్తున్నది. 'కార్యనిర్వాహక పాత్రను తగ్గిస్తాం, ఆచరణ యోగ్యమైన పనిగంటలుండాలి, కార్పొరేషన్ల పనిలో ప్రభుత్వ జోక్యం వుండరాదు' లాంటి నయా ఉదారవాద నినాదాలనే పాడుతుంది. శ్రమ అందుబాటును పెంచడం పేర పనిగంటలను పెంచడానికి ప్రభుత్వం పథకం రూపొందిస్తోంది.

ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ పథకం వల్ల దిగువశ్రేణి కార్మికవర్గం దారుణంగా దెబ్బ తింటుంది. కార్మిక రక్షకులమని స్వంత దబ్బా కొట్టుకునేవారు ఈ విధంగా కార్మికుల నాశనాన్నే లక్ష్యంగా చేసుకున్నారు.

ఇలాంటి కుటిల ప్రణాళికలపట్ల కోపోద్రిక్తులైన ఆస్ట్రియా కార్మికవర్గం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు చేపడ్తోంది. మేము ఇప్పుడు జరుగు తున్నది చూడ్డానికో, బానిసలుగా మారడానికో ఎఫ్‌పిఒకి ఓటు యివ్వలేదని కార్మికవర్గం ప్రకటిస్తున్నది.

స్కాండినేవియా దేశమైన స్వీడన్ ఆరు గంటల పనిదినాన్ని ప్రవేశపెట్టింది. కొన్ని ఐరోపా దేశాలు కూడా వారానికి 40 నుండి 30కు పనిగంటలను తగ్గించాలని అను కుంటున్నాయి. కానీ అదే సందర్భంలో రోజుకు 12 గంటలు చొప్పున వారంలోని ఐదు పని దినాలకు పనిగంటలను 60కి పెంచాలని ఆస్ట్రియా చూస్తుంది. ఇదంతా కార్పొరేట్ కంపెనీలు మరింతగా శ్రమశక్తిని దోపిడీ చేయడానికి అవకాశం యివ్వడానికి మాత్రమే.

ఇప్పటివరకు ఆస్ట్రియాలో ఓవర్‌టైంకు చెల్లింపులను కనీస వేతనంతో పరిమితం చేయడం జరిగింది. ఈ చెల్లింపు విధానాన్ని కూడా సంయుక్త ఒప్పందాల ద్వారా నిర్ణయం చేస్తారు. కాని ప్రస్తుత ప్రభుత్వం ఈ అంశాన్ని కంపెనీ ఇష్టాయిష్టాలకే వదిలివేయాలని ప్రతిపాదిస్తోంది. తద్వారా పరిహార చెల్లింపు పద్ధతి ఏకపక్షంగా నిర్ణయించబడే కనీస విధానం ద్వారా తొలగించబడుతుంది.

పనిగంటలలో వెసులుబాటు విధానం పేర నయా ఉదారవాద పెట్టుబడిదారీ విధానం పనిగంటలను పెంచడానికి ప్రయత్నిస్తోంది. ఈ విధానం మేడే స్ఫూర్తికి, దాని ఆకాంక్షలకు, అది సాధించిన విజయాలకు గొడ్డలిపెట్టు అవుతుంది. కార్మికవర్గం సృష్టించిన "అదనపు శ్రమ"ను పెట్టుబడిదారులు దోపిడీ చేస్తారనే కార్ల్‌మార్క్స్ ప్రవచించిన సిద్ధాంతాన్ని ఖచ్చితంగా ధృవ పరుస్తోంది. కార్మికవర్గం తమ వర్గపోరాటం ద్వారా పెట్టుబడిదారీ విధానాన్ని కూలదోసి, శ్రామికవర్గ నియంతృత్వం క్రింద శ్రమజీవుల స్వంత పాలనా విధానాన్ని ఏర్పాటుచేసి ఆర్థిక, సాంఘిక అసమానతలను, దోపిడీని శాశ్వతంగా అంతంచేసే చారిత్రక బాధ్యతను చేపట్టాలని మార్క్స్ సిద్ధాంతం మరోసారి కార్మిక లోకాన్ని హెచ్చరిస్తోంది.

# అమెరికా లొంగుబాటు సంబంధాలకు పాకిస్థాన్ ముగింపు పలకాలి




**గత** కొంతకాలంగా పాకిస్థాన్ పట్ల అమెరికా అంతసంతృప్తిగా లేదు. ఇటీవల పాకిస్థాన్‌పై అమెరికా ఒక ఆరోపణ చేసింది: "గత 15 సంవత్సరాలలో అమెరికా పాకిస్థాన్‌కు 3,300 కోట్ల డాలర్లకు పైగా సహాయాన్ని కళ్ళు మూసుకొని మరీ అందిస్తే, తిరిగి అబద్ధాలు, మోసాలు, తప్ప వారు మాకే మిచ్చారు? పాకిస్థాన్ మా నాయకులను అవివేకులుగా భావిస్తోంది. ఆఫ్ఘనిస్తాన్‌లో మేము తీవ్రవాదులను వేటాడుతుంటే కనీస సహాయం చేయకపోగా ఆ తీవ్రవాదులకు స్థావరాలను ఏర్పాటు చేస్తుంది." ఈ ఆరోపణ ద్వారా పాకిస్థాన్ పట్ల అమెరికాకున్న అసంతృప్తిని తెలుసుకోవచ్చు. 2018 జనవరి మొదటివారంలో ఆఫ్ఘన్ తాలిబాన్ల పట్ల, హక్కాని నెట్‌వర్క్ తదితర తీవ్రవాద సంస్థలపట్ల నిర్ణయాత్మకమైన చర్యలు చేపట్టే వరకు పాకిస్థాన్‌కు భద్రతాపరమైన సహాయాన్ని భారీగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది.

ఈ మార్పును అర్థం చేసుకోవాలంటే అమెరికా – పాకిస్థాన్ సంబంధాలను లోతుగా అవగాహన చేసుకోవాల్సిన అవసరముంది.

గత ఏడు దశాబ్దాలుగా పాకిస్థాన్‌లో అనేక ప్రభుత్వాలు ఏర్పాటయ్యాయి; అధికారం కోల్పోయాయి. కాని పాకిస్థాన్ పాలకులందరూ ఎప్పుడూ సామ్రాజ్య వాదులకు, మరీ ముఖ్యంగా అమెరికాకు లొంగే వున్నారు. పాకిస్థాన్ అమెరికాకు నాటో యేతర ప్రధానమైన భాగస్వామిగా నిలిచింది. ఈ ప్రాంతంలో అమెరికా ఆధిపత్య విధానాల అమలులో పాకిస్థాన్ పూర్తి సేవలను అందించింది. ఇస్లామిక్ తీవ్రవాద ముఠాలను ఏర్పరచి వాటిని అమెరికా ప్రయోజనాలకు అనుగుణంగా పని చేయించడంలో పాకిస్థాన్, అమెరికా సామ్రాజ్య వాదానికి ఎంతో దోహదపడింది. కాబూల్‌లోని సోవియట్ అనుకూల ప్రభుత్వాన్ని పడగొట్టడానికి ఆఫ్ఘనిస్తాన్‌లోని ముజాహిద్దీన్‌లను సంఘటిత పరచి ఉసిగొల్పడంలో అమెరికా సామ్రాజ్య వాదానికి పాకిస్థాన్ పాలకులు ప్రధాన సాధనంగా పనిచేశారు. ఈ విషయం ప్రపంచానికంతటికీ తెలుసు. అంతేకాదు. అమెరికా 2001లో ఆఫ్ఘనిస్తాన్‌పై దురాక్రమణ యుద్ధానికి పాల్పడి నపుడు పాకిస్థాన్ తన సేవలనందించడంలో ఏమాత్రం సంకోచించలేదు. పదహారేళ్ళ ఆఫ్ఘన్ యుద్ధంలో వేలాది అమాయక ఆఫ్ఘన్ ప్రజలు తమ ప్రాణాలు కోల్పోయారు. లక్షలాదిమంది తమ ఇళ్ళను వదిలి వెళ్ళిపోవాల్సి వచ్చింది. ఆఫ్ఘనిస్థాన్‌పై జరిగిన ఈ దురాక్రమణ యుద్ధంలో అమెరికాకు సహాయమందించడంలో పాకిస్థాన్ నిస్సిగ్గుగా వ్యవహరించింది. పాకిస్థాన్ పాలకులు తమ ప్రాంతాలను వాడుకోడానికి, రవాణా వ్యవస్థలను, వనరులను ఉపయోగించు కోడానికి అమెరికాకు పూర్తి అనుమతినిచ్చారు. తాలిబాన్లను తుదముట్టించడానికి వారి సురక్షిత స్థావరాలను నాశనం చేయడానికనే సాకుతో పాకిస్థాన్ భూభాగాలపై అమెరికా బాంబులు జారవిడిచినా, డ్రోన్ దాడులను నిర్వహించినా పాకిస్థాన్ కిమ్మనలేదు. ఈ విధమైన పాత్రను పోషిస్తూ అమెరికాకు తొత్తుగా వ్యవహరించడంలో పాకిస్థాన్ తనకుతానే సాటిగా నిలిచింది.

ఇది మొత్తం కథకు ఒక పార్శ్వం మాత్రమే. ఆసియా – పసిఫిక్ ప్రాంతమంతటా అమెరికా తన ఆధిపత్యాన్ని నిలుపుకోవాలనే సుదూర లక్ష్యాన్ని ఎత్తుగడను సాకారం చేసుకోవడమనేది రెండో పార్శ్వం. ఈ లక్ష్య సాధనా మార్గంలో చైనాను ఒక బలమైన ఆటంకంగా అమెరికా పరిగణిస్తోంది. అందుకు చైనాను ఒంటరి చేసి, దాన్ని దిగ్బంధం చేయాలనేదే ఈ ఎత్తుగడలోని ప్రధానమైన అంశం. అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాల సైనిక భాగస్వామ్య ఒప్పందాలకు ఒక రూపం యివ్వడానికి అమెరికా వరుస చర్యలను చేపట్టింది. భారత పాలకులను కూడా ఈ మైత్రీ ఒప్పందంలోకి లాగింది. అమెరికా తన ఆధిపత్య రాజకీయాల ద్వారా భారత దేశానికున్న సువిశాల ప్రాంతాలను, వనరులను వాడుకోవాలనే ఉద్దేశ్యంతోనే ఇదంతా చేసింది. దాని ఎత్తుగడలలో భాగంగా భారతదేశానికి ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చింది. భారత పాలకులు తమవంతుగా అమెరికా యుద్ధ విమానాలు, యుద్ధ నౌకలు దిగడానికి వీలుగా భారత ఓడ రేవులను, సైనిక స్థావరాలను అనుమతించారు. హిందూ మహాసముద్రంలో చైనా యుద్ధ నౌకలు, జలాంతర్గాముల కదలికలను గమనించడానికి పెంటగన్‌తోబాటు రహస్య సమాచారాన్ని పంచుకోవడానికి అంగీకరించారు. దక్షిణ చైనా సముద్ర వివాదంపై, అలాగే ఉత్తర కొరియాపైనా గానీ అమెరికా వైఖరులను భారతదేశం చిలుక పలుకుల్లాగా వల్లిస్తోంది.

ట్రంప్ కాలంలో భారత్ అమెరికా సంబంధాలు కొత్త స్థాయికి చేరాయి. 2017 అక్టోబర్‌లో అమెరికా స్టేట్ సెక్రటరీ రెక్స్ టిల్లర్సన్ ఇలా అన్నాడు: "భారత దేశంతో మా సంబంధం.... భద్రతా ప్రాముఖ్యం కలది. అది కేవలం ఈ ప్రాంతానికే పరిమితమైంది కాదు. జపాన్ నుండి భారతదేశం వరకు విస్తరించివున్న ప్రాంతాన్ని స్వేచ్ఛాయుత హిందూ–పసిఫిక్ ప్రాంతంగా చేయడానికి ఉద్దేశించబడినది. ఆసియా పసిఫిక్

ప్రాంతంలో అమెరికా తన ఆధిపత్య రాజకీయాలను అమలు చేయడానికి ఒక సాధనంగా వుపయోగపడేటట్లు తన నాయకత్వాన అమెరికా - జపాన్ - ఆస్ట్రేలియాలతో కీలక సైనిక భాగస్వామ్య కూటమినేర్పాటు చేసింది. దీనిని 'క్వాడ్' అంటారు. ఈ క్వాడ్‌లోకి భారత్‌ను లాగడానికి అమెరికా ప్రాధాన్యత నిచ్చింది. అతి త్వరితంగా అభివృద్ధి చెందుతున్న అమెరికా భారత్ కీలక సంబంధాలను పాకిస్థాన్ పాలకులు గమనిస్తున్నారు.

ఆసియా పసిఫిక్ ప్రాంతంలో ఒక ప్రధానమైన, బలమైన శక్తిగా ఎదిగిన చైనాతో తమ సంబంధాలను మరింత పెంచుకోడానికి పాకిస్థాన్ పాలకులు మొగ్గు చూపారు. చైనా, పాకిస్థాన్‌ల మధ్య రవాణా మౌలిక వసతులను ఏర్పాటు చేయడానికి ఉద్దేశించబడిన 5,700 కోట్ల డాలర్ల చైనా పాకిస్థాన్ ఎకనమిక్ కారిడార్ (CPEC)లో పాకిస్థాన్ పాలకులు భాగస్వాములయ్యారు. ఈ పథకం చైనాను గ్వాదార్‌లోని అరేబియా ఓడరేవుతో అనుసంధానిస్తుంది. ఐరోపా, మధ్యఆసియా మరియు ఆఫ్రికా దేశాలతో చైనా తన ఆర్థిక సంబంధాలను విస్తృతపరచుకోడానికి రూపొందించిన వన్ బెల్ట్, వన్ రోడ్ (OBOR) అనబడే సమగ్ర పథకంలో ఈ సిపిఇసి ఒక భాగం.

సహజంగానే ఈ పరిణామం అమెరికాకు ఆమోదయోగ్యంగా లేదు. ఎందుకంటే ఇది తన ప్రత్యర్థియైన చైనాను బలోపేతం చేస్తుంది. అంతేకాదు చైనాతో పాకిస్థాన్ స్నేహ సంబంధాలను దృఢపరుస్తుంది. అందువల్ల ఇప్పుడు పాకిస్థాన్ పాలకుల ఈ దిశను ఎలా మళ్ళించాలి?, దృఢమవుతున్న చైనా, పాకిస్థాన్ సంబంధాల వల్ల వచ్చే పరిణామాలను ఎలా ఎదుర్కోవాలనే అంశాలు అమెరికాకు తీవ్ర ఆందోళనకరంగా మారాయి.

అంతేకాదు, ఆఫ్ఘనిస్తాన్‌పై చేసిన దురాక్రమణ యుద్ధం ద్వారా అమెరికా తాను ఆశించిన లాభాలను పొందలేదనేది కూడా మరో పరిణామం.

ఆఫ్ఘనిస్తాన్ నుండి అమెరికా తన సైన్యాలను ఉపసంహరించుకుంటున్నట్లు, ఒబామా ప్రకటించి నప్పుడు ఆఫ్ఘనిస్తాన్‌లో ఒక ప్రభుత్వం వున్నప్పటికీ అది ప్రజల మన్ననలను ఏమాత్రం పొందినది కాదు. అధిక ప్రాంతం తాలిబన్ల నియంత్రణలోనే వుంది. అమెరికా నుండి తిరిగి వెనక్కి వచ్చిన మిలటరీ అధికారులు మార్గదర్శకత్వాన్ని, సహాయాన్ని అందించినప్పటికీ ఆఫ్ఘన్ సైన్యం తాలిబన్ల దాడుల్లో అనేక ఓటములను, నష్టాలను చవిచూసింది. తాలిబన్లలో మంచి తాలిబన్లు, చెడ్డ తాలిబన్లు అనే వర్గీకరణతో అమెరికా చేపట్టిన దౌత్య నీతి కూడా దారుణంగా విఫలమైంది. ఆవిధంగా ట్రంప్ అమెరికా అధ్యక్ష పదవిని చేపట్టేనాటికి అమెరికా ఆఫ్ఘనిస్తాన్ విధానం సంక్షోభ స్థితిలో వుంది. మరోవైపు అమెరికా ఆఫ్ఘనిస్తాన్‌లో ఎదుర్కొంటున్న ప్రతికూల పరిస్థితులను ఆసరా చేసుకొని చైనాతో సహా ఇతర శక్తులు, ఆఫ్ఘనిస్తాన్‌లో ఆర్థికంగా, రాజకీయంగా తమ ప్రాబల్యాన్ని పెంచుకోడానికి తమ ప్రయత్నాలను ముమ్మరం చేశాయి.

ఈ వెలుగులోనే 2017 ఆగస్టులో ఆఫ్ఘనిస్తాన్ పట్ల ట్రంప్ కొత్త సైనిక విధానం వచ్చింది. ఈ విధానం ఆఫ్ఘనిస్తాన్‌ను శాశ్వతంగా తన ఆక్రమణలో వుంచుకోవడానికి, సైనిక చర్యలను తీవ్రతరం చేయడానికి ఉద్దేశించబడింది. దీనికి అనుగుణంగానే ఆఫ్ఘనిస్తాన్‌పై 'మదర్ ఆఫ్ బాంబ్స్' ను ప్రయోగించింది. ఆఫ్ఘనిస్తాన్‌లో అమెరికా సైన్యాన్ని మరింతగా మోహరించడం, ఆఫ్ఘనిస్తాన్‌లో భారత్ పాత్రను పెంచటం, తాలిబన్‌లకు వ్యతిరేకంగా పాకిస్థాన్ పటిష్టమైన చర్యలను చేపట్టడంలేదనే ఆరోపణలు చెయ్యడం, యివన్నీ ఈ కొత్త విధాన నేపథ్యం నుండి వచ్చినవే.

పాకిస్థాన్ పాలకులు తమ అనుభవాల ద్వారా ఒక విషయాన్ని స్పష్టంగా చూడగలిగారు. అమెరికా తమకిచ్చే గుర్తింపు, ప్రాధాన్యతా స్థానం అమెరికా ఆధిపత్య రాజకీయాలకు తాము చేసే సేవను బట్టే వుంటుందని పాకిస్థాన్ పాలకులు గమనించారు. అందుకే అమెరికాతో తమ సంబంధాలను కొనసాగిస్తూనే చైనాను విశ్వసనీయ శక్తిగా పరిగణించి దానితో సంబంధాలను అభివృద్ధి చేసుకున్నారు.

పాకిస్థాన్‌పై తన విమర్శను ఆఫ్ఘనిస్తాన్ అంశానికే అమెరికా పరిమితం చేసినప్పటికీ, అమెరికా, పాకిస్థాన్ పాలకుల మధ్య పెరుగుతున్న అగాధానికి పైన పేర్కొన్న పరిణామాలు కూడా వాటి ప్రభావాన్ని అవి చూపాయి.

అమెరికా సూటిగా, ఖచ్చితంగా ఇలా ప్రశ్నిస్తోంది: 'ఆఫ్ఘన్ తాలిబాన్లకు, హక్కాని నెట్‌వర్క్ లాంటి తీవ్రవాద సంస్థలను నిర్వీర్యం చేయడానికి మేము మీకు డబ్బులిచ్చాం. కాని మీరు ఆ పనిని ప్రభావవంతంగా చేయడంలేదు. అలాంటప్పుడు మేము మీకు డబ్బులెందుకివ్వాలి?' ఇదీ అమెరికా ప్రశ్న.

దీనికి బదులుగా పాకిస్థాన్ నాయకులు ఇలా అంటున్నారు: 'ఆఫ్ఘనిస్థాన్‌లో సమిష్టి వైఫల్యానికి అమెరికా పాకిస్థాన్‌ను నిందిస్తోంది. పాకిస్థాన్ చేసిన అనేక త్యాగాలను ఊహాజనితంగా డబ్బు రూపంలో విలువకట్టి వాటి ప్రాధాన్యతను తగ్గిస్తున్నారు. తీవ్రవాదానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ద్వైపాక్షిక సహకారం, అమెరికా జాతీయ భద్రతా ప్రయోజనాలకేగాక అంతర్జాతీయ సమాజ విశాల ప్రయోజనాలకు కూడా దోహద పడింది. శాంతి స్థాపనకు పనిచేసే క్రమంలో పరస్పర గౌరవం, పరస్పర విశ్వాసం, ఓర్పు, పట్టువదలకుండా పనిచేయడం అవసరం' అని పాకిస్థాన్ పాలకులు అంటున్నారు. పాకిస్థాన్ ప్రతిపక్ష నాయకుడు అమెరికాకు వ్యతిరేకంగా తీవ్రంగా ప్రతిస్పందించాడు. అమెరికా సామ్రాజ్యవాదుల వైఖరికి వ్యతిరేకంగా నిరసనలు తెల్పడానికి పాకిస్థాన్ ప్రజలు కూడా విస్తృతంగా వీధుల్లోకి వచ్చారు.

పాకిస్థాన్ పాలకులు అమెరికా సామ్రాజ్యవాదులతో తమ సంబంధాలను పునఃసమీక్షించుకోవడానికి, పునర్నిర్మించుకోవడానికి ఇది సరైన సమయం. దక్షిణాసియాపై అమెరికా తన ఆధిపత్యాన్ని రుద్దడానికి అనుసరించిన ఎత్తుగడల్లో, అమెరికా సామ్రాజ్యవాదులకు పాకిస్థాన్ ఒక సాధనంగా పనిచేసిందనేది వాస్తవం. ఆఫ్ఘనిస్తాన్‌లో కూడా ఆఫ్ఘన్ ప్రజల హక్కులను క్రూరంగా కాలరాయడానికి అమెరికా సామ్రాజ్యవాదులకు వీరు సహాయపడ్డారు. ఈ క్రమంలో అణచివేతదారులకు వీరు కిరాయికి పనిచేసేవారుగా తమను తాము కుదించుకున్నారు. అణచబడిన దేశమైన పాకిస్థాన్-ఆఫ్ఘనిస్థాన్ లాంటి మరొక అణచబడ్డ దేశాన్ని అణగద్రొక్కుతున్న సామ్రాజ్యవాద దురాక్రమణదారునికి సహాయం చేయడమనేది చాలా సిగ్గుపడాల్సిన అంశం. కాబట్టి సామ్రాజ్యవాదుల సేవలో తరిస్తూ తమ త్యాగాలకు గుర్తింపు కొరకు దేబిరించడం మానేసి, లజ్జాకరమైన గతం నుండి శాశ్వతంగా విడిపోయి కొత్తపుంతలు తొక్కాలని పాకిస్థాన్ ప్రజలు, ప్రపంచ ప్రజలు పాకిస్థాన్ నుండి ఆశిస్తున్నారు.

అమెరికా, పాకిస్థాన్‌ల మధ్య పెరుగుతున్న దూరాన్ని చూసి భారత పాలకులు సంతోషిస్తున్నట్లు కన్పిస్తుంది. కాని భారత పాలకులు అమెరికాతో ఏర్పరుచుకుంటున్న సంబంధాలు, మౌలికంగా పాకిస్థాన్ అమెరికా సంబంధాలకు భిన్నంగా లేవు. ఈ సంబంధాలు అసమానత్వ ప్రాతిపదికపై లొంగుబాటు విధానంతో వున్నాయి. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో అమెరికా ఆధిపత్యం రుద్దడానికి ఉద్దేశించబడినవిగానే వున్నాయి. ఈ పాత్రను పోషించడానికి అంగీకరించడమంటే భారతదేశానికి, భారత ప్రజలకు ఒక దరిద్రపు భవిష్యత్తును ఆహ్వానించడమే అవుతుంది. భారత ప్రజలు ఈ రకమైన భారత-అమెరికా సంబంధాలను పూర్తిగా వ్యతిరేకిస్తారు. ఇప్పటికే ఈ సంబంధాలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమిస్తున్నారు.

# అమెరికా సామ్రాజ్యవాదమా, కొరియా ద్వీపకల్పం వీడి వెళ్ళిపో




**అమెరికా** మరియు ఇతర సామ్రాజ్యవాదులు, తమ నియంత్రణలోనున్న ప్రచార మాధ్యమాలు కలగలిసి, ప్రపంచానికి ఓ గొప్ప విపత్తు కలిగించేందుకు అణ్వాయుధాలతో సంసిద్ధమైన భయంకరమైన రాక్షసునిగా కొరియాను చిత్రిస్తూ పకడ్బందీగా ప్రచారం చేస్తున్నారు. ప్రపంచంలోని అనేకమంది ఈ ప్రచారంతో గందరగోళానికి గురవుతుండగా, మరి అనేకమంది ప్రభావితులవుతున్నారు. ఈ ప్రచారానికి అమెరికా సామ్రాజ్యవాదులు నాయకత్వం వహిస్తున్నారని ప్రత్యేకించి పేర్కొనాల్సిన అవసరం లేదు.

అణ్వాయుధాలు శాంతికి తీవ్రవిఘాతం కల్గిస్తాయనేది నిజం. అయితే, ఈ ప్రపంచాన్ని పలుమార్లు ధ్వంసం చేయగలిగిన మోతాదులో ఈ ఆయుధాలను కలిగివుండటాన్ని తమ హక్కుగా అమెరికా మరియు ఇతర బడా సామ్రాజ్యవాద శక్తులు ఎందుకు భావిస్తున్నాయి? తమ వద్దనున్న ఆయుధాలతోసహా అణ్వాయుధాలన్నింటిపై సంపూర్ణ నిషేధం విధింపుకు వారెందుకు అంగీకరించలేకున్నారు? చిన్న దేశాలు తమ స్వీయరక్షణకోసం కొన్ని ఆయుధాలను కలిగివుండటంపై నిషేధం విధిస్తూ, అణ్వాయుధాలపై సామ్రాజ్యవాద దేశాలు తమ గుత్తాధిపత్యాన్ని సమర్ధించుకోవటం, చిన్న దేశాలపై సామ్రాజ్యవాదశక్తులు ఆధిపత్య ధోరణులతో వ్యవహరించటం కాదా?! ప్రపంచంలోని ఏ చిన్న దేశం కూడా తమ స్వీయరక్షణ కోసమే అయినప్పటికీ, అణ్వాయుధాలను లేదా ఏ వినాశకర ఆయుధాలను ప్రయోగించినట్లు ఒక్క ఉదాహరణనైనా చూపగలుగుతారా? కానీ, సామ్రాజ్యవాద శక్తులు ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదులు తమ అపార ఆయుధశక్తిని ప్రదర్శిస్తూ, వారి ఆయుధాల భారాన్ని చిన్న దేశాలపై మోపి, వారిని నలిపివేసి, తమ స్వీయ ఆధిపత్యాన్ని వారిపై రుద్దుతూ వచ్చాయనే దానికి మనవద్ద అసంఖ్యాక ఉదాహరణలున్నాయి.

కనుక, అమెరికా మరియు ఇతర బడా సామ్రాజ్యవాద అణ్వాయుధశక్తుల వద్దనున్న ఆయుధాలను మొదట ధ్వంసం చేయమని అడిగే హక్కు న్యాయమైనది; పూర్తిగా ఆమోద యోగ్యమైనది.

## అమెరికా, ఉత్తరకొరియాలమధ్యనున్న వివాదము లేదా విభేధమేమిటి?

1945 సం॥లో రెండవ ప్రపంచయుద్ధం ముగింపువరకూ, జపాన్ దురాక్రమణకు వ్యతిరేకంగా కొరియా ప్రజలు జాతీయ విముక్తి యుద్ధాన్ని సాగిస్తూ వచ్చారు. రెండవ ప్రపంచ యుద్ధంలో ఫాశిస్టుకూటమి ఎప్పుడైతే ఓటమి చవిచూసిందో, దానితో జపాన్ సామ్రాజ్య వాదులు రంగంనుండి తప్పుకున్నారు. అయితే, వారు వదిలిన చెప్పులలో కాళ్ళు దూర్చిన అమెరికా సామ్రాజ్యవాదులు, 1950 జూన్ 25న కొరియాను దురాక్రమించారు. కొరియా ప్రజానీకం చైనా వలంటీర్లతో కూడి అమెరికా దురాక్రమణకు వ్యతిరేకంగా పోరాటాన్ని కొనసాగించి వారికి ఓటమి తర్వాత ఓటమిని చవిచూపారు. అంతిమంగా 1953 జులై 27న అమెరికా సామ్రాజ్యవాదులు కొరియాతో ఆర్మిస్టైస్ ఒప్పందం చేసుకున్నారు. ఉత్తరకొరియాగా పిలవబడే కొరియా ఉత్తరభాగం కొరియన్ వర్కర్స్ పార్టీ నాయకత్వంలో 'డెమోక్రటిక్ పీపుల్స్ రిపబ్లిక్'గా అవతరించగా, దక్షిణకొరియాగా పిలవబడే కొరియా దక్షిణభాగం అమెరికా ఉపగ్రహదేశంగా వాస్తవికంగా కుదించబడింది. ఉత్తరకొరియా యుద్ధంచేసే అవకాశం వుందంటూ, ఆ యుద్ధాన్నుండి దక్షిణకొరియాను రక్షించే పేరిట అమెరికా 28,500 మంది సైనికులతో దక్షిణకొరియాలో బలమైన సైనిక స్థావరాన్ని ఏర్పరచుకుంది. కొరియాలో రెండువైపులనుండీ ఏకీకరణ కోర్కె బలంగా వుండగా, అమెరికా సామ్రాజ్యవాదులు దానికి పెద్ద అవరోధంగా నిలిచారు. దక్షిణకొరియాలో వారు నిరంకుశ ప్రభుత్వాలను పెంచి పోషించారు. వారు దక్షిణ కొరియాను సాయుధం చేసుకుంటూ వెళ్ళటంతో పాటు, రెండు ప్రాంతాల ప్రజల నడుమ ఉద్రిక్తతలను, శత్రుత్వాలను పెంచటంద్వారా దక్షిణకొరియాలో తమ స్థావరాన్ని శాశ్వతం చేసుకునే ప్రయత్నం, యుద్ధం లేదా ఇతర పద్ధతుల్లో ఉత్తరకొరియాను లోబరుచుకునే ప్రయత్నం చేస్తున్నారు.

ఆసియా పసిఫిక్ ప్రాంతంపైన, సముద్రంపైన తమ ఆధిపత్యాన్ని ఏర్పరచుకోవాలనే అమెరికా వ్యూహం, అమెరికా నాయకత్వంలో అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా, భారతదేశాల వ్యూహాత్మక కూటమి ఆవిర్భావం-అమెరికా యొక్క 'కొరియా విధానానికి' నూతన పార్శ్వాలను జోడించింది. దక్షిణకొరియాపై తన పట్టును కలిగివుంటూ, సంఘటిత పరచుకుంటూనే, రెండు కొరియాల నడుమ ఉద్రిక్తతలను, విభజనలను పెంపొందిస్తూ ఉత్తరకొరియాకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని మలచటం వారి ఈ విధానంలో అత్యావశ్యక భాగంగా ముందుకొచ్చింది.

అమెరికా విధానాన్ని ప్రతిఘటించటం, ఉత్తరకొరియా మనుగడకు అత్యావశ్యకమైంది. ఉత్తరకొరియా రెండు పార్శ్వాలున్న విధానాన్ని అనుసరిస్తున్నట్లుగా కనబడ్తోంది.

1. తాను చర్చలకు, హేతుబద్ధమైన ఒప్పందానికి సంసిద్ధంగా వున్నానని, అయితే తనను బెదిరించి లొంగదీసుకోవటం సాధ్యం కాదని అమెరికా సామ్రాజ్యవాదులకు తగిన విధంగా స్పష్టంచేయటం. ఆయుధ సంపత్తిలో అమెరికా ఆధిపత్యం, ఉత్తరకొరియాను భయపెట్టలేకపోతోంది. ఉత్తరకొరియా కూడా అణ్వాయుధాలతో సహా ఆయుధాలన్నింటినీ ఉత్పత్తి చేయగలగటంతోపాటుగా, అమెరికా ఆ రూపంలో ముందుకొస్తే అదే రూపంలోనే సమాధానం చెప్పటానికి సిద్ధంగా వుంది. థాడ్ (టిహెచ్ఏఏడి) వ్యవస్థను దక్షిణకొరియాలో ఏర్పరచటాన్ని ఉత్తరకొరియా తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ నేపథ్యంలోనే అమెరికా, ఉత్తరకొరియా నాయకుల నడుమ ఎత్తులు, పైఎత్తులు, బెదిరింపులు, ప్రతిహెచ్చరికలు కొనసాగాయి. ఉత్తరకొరియాను తుడిచిపెడ్తామని ట్రంప్ గర్జించాడు. దీనికి జవాబుగా ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్ ఇలా హెచ్చరించాడు: "అమెరికా భూభాగమంతా మా అణ్వాయుధ దాడి పరిధిలో వుంది. దానికి సంబంధించిన మీట నా కార్యాలయంలోని

టేబుల్‌పైనే వుంది. ఇది వాస్తవం; బెదిరింపు కాదు". ట్రంప్ ఇలా బదులిచ్చాడు: "నా వద్ద కూడా ఓ అణ్వాయుధ మీట వుంది. కానీ అది కిమ్ మీట కంటే చాలా పెద్దది; మరియు శక్తివంతమైందిగా పనిచేస్తుంది". ఇదంతా మాటల యుద్ధం. తన మాటలకు కార్యాచరణ రూపమిచ్చే ముందు అమెరికా కూడా అనేక అంశాలను పరిగణలోకి తీసుకోవల్సి వుంటుంది.

2. శాంతి మరియు కొరియా ఏకీకరణ లనేవి ఉత్తరకొరియా విధానపు మరో పార్శ్వంగా వుంది. దక్షిణకొరియాతో చర్చల కొరకు ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్‌జాంగ్ ఉన్ 2018 జనవరి 1న ఇచ్చిన పిలుపు ఈ నేపథ్యంలోనిదే. ఉత్తర, దక్షిణకొరియాలు రెండూ కొరియా ద్వీపకల్పంలో శాంతియుత వాతావరణం కల్పించేందుకు సైనిక ఉద్రిక్తతలను తప్పనిసరిగా తగ్గించుకోవాలని జిమ్ ప్రతిపాదించాడు. 2018 ఫిబ్రవరిలో దక్షిణకొరియాలో పియాంగ్ ఛాంగ్ నగరంలో జరిగే ఒలంపిక్ క్రీడలలో పాల్గొనేందుకు ఉత్తరకొరియా సంసిద్ధంగా వుందని కూడా అతను సూచించాడు.

ఈ పిలుపు మొత్తంగా కొరియా ప్రజల మధ్య ఐక్యత, ఏకీభావం అనే మృదువైన, లోతైన భావాలను స్పృశించాయి. వారంతా ఈ పిలుపును సాదరంగా ఆహ్వానించారు. రెండు ప్రభుత్వాలూ వేగంగా కదిలాయి. చర్చలు జరిపాయి. ఒలంపిక్ క్రీడలలో ఉత్తరకొరియా క్రీడా బృంద ప్రాతినిధ్యానికి వీలుగా అనేక ఇతర చర్యలు తీసుకున్నాయి. చర్చలు, సైనిక చర్చలు సాగించటం ద్వారా సమస్యలను పరిష్కరించుకొని, ఆకస్మిక విభేధాలను తొలగించుకోవాలని రెండు ప్రభుత్వాలూ అంగీకరించాయి. క్రీడాకారులు, ఉన్నతస్థాయి అధికారులు, ప్రోత్సాహక బృందాలు, కళాప్రదర్శకులతోపాటుగా విలేకరులు, వీక్షకులతో కూడిన ఒక పెద్ద ప్రాతినిధ్య బృందాన్ని క్రీడలలో పాల్గొనేందుకు పంపాలని ఉత్తరకొరియా నిర్ణయించుకుంది. ఒలంపిక్ క్రీడల సందర్భంగా జరిగే ప్రారంభ వేడుకలోనూ అలాగే ఇతర సంయుక్త కార్యకలాపాలలోనూ రెండు దేశాలకు చెందిన క్రీడాకారులంతా ఒకే జెండా క్రింద కవాతులో పాల్గొనటానికి రెండు ప్రభుత్వాలూ అంగీకరించాయి. కనీసం తాత్కాలికంగానే అయినా, ఉద్రిక్తతలు, అభద్రత, శత్రుత్వభావనలు తొలగినట్లుగా రెండువైపులా వున్న కొరియా ప్రజానీకం భావించారు. రెట్టించిన ఉత్సాహంతో క్రీడలను వీక్షించటానికి వారు సిద్ధమయ్యారు.

ఇది ఒక ఆహ్వానించదగిన పరిణామం. అయితే సమస్య మూలకారణం అలానే వుంది. అది ఉత్తరకొరియాతో ముడిపడి లేదు; అమెరికా సామ్రాజ్యవాదులతో ముడిపడి వుంది. కొరియా ద్వీపకల్పం మీద, ఆసియా-పసిఫిక్ ప్రాంతం మీద తమ ఆధిపత్యాన్ని నెలకొల్పేందుకు అమెరికా సామ్రాజ్యవాదులు అనుసరించే జోక్యందారీ విధానం, రాజకీయాలు-ఈ సమస్యకు మూల కారణంగా వున్నాయి. కొరియా ద్వీపకల్పంలో శాంతి పునరుద్ధరణను కోరుకునే వారెవరైనా, దీనికి వ్యతిరేకంగా గళం విప్పాల్సిందే.

---

**(9వ పేజీ నుండి)**

నాలుగు దశాబ్దాల క్రితం, 1979లో అమెరికా దన్నుతోనున్న నిరంకుశ షా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెల్లుబికిన ప్రజాఉద్యమం, షాను అధికారంనుండి కూలదోసింది. అయతుల్లా ఖొమైనీ నాయకత్వంలో ఇరాన్ బూర్జువావర్గం అధికారంలోకి వచ్చింది. ప్రజల తిరుగుబాటులో షియా తెగవారు నాయకత్వంలో న్నారు. కార్మికులకు, శ్రమజీవులకు అనేక రాయితీలు ఇచ్చారు.

ఇరాన్ బూర్జువావర్గం యొక్క ప్రతీఘాతుక స్వభావం, 8 సం॥ల కాలంపాటు సాగిన ఇరాన్ - ఇరాక్ యుద్ధం సందర్భంగా వెల్లడైంది. ఇరాన్‌పై అమెరికా సామ్రాజ్యవాదుల మద్దతుతో ఇరాక్ దాడికి పాల్పడగా, అమెరికా మద్దతుతోనే షా ప్రభుత్వం ఇరాక్‌పై ఫత్తల్ అరబ్ పరిష్కారాన్ని రుద్దింది. అంతర్గతంగా రాజకీయ వ్యతిరేకతను అణచివేయటాన్ని, ప్రజావెల్లువను నీరుగార్చటాన్ని, 'జాతీయ ఐక్యత' పేరిట దానికి లోబరచటాన్ని సమర్థించుకోవటానికి పాలక వర్గానికి యుద్ధం దోహదపడింది. ఇరాన్ కులీన పాలకవర్గం-ఆఫ్ఘనిస్తాన్‌పై అమెరికా దురాక్రమణను, 2003లో ఇరాక్‌పై అమెరికా దురాక్రమణను సమర్థించింది.

అయినప్పటికీ, అమెరికా సామ్రాజ్య వాదులు ఆర్థిక ఆంక్షలను, సైనిక వత్తిడిని కొనసాగించారు. 2014 ఎన్నికల్లో అయితుల్లా ఖొమైనీ, అమెరికాతో దీర్ఘకాల సన్నిహిత బాంధవ్యాలున్న హాషేమీ రఫ్‌సాంజానీల మద్దతుతో రహానీ ఇరాన్ అధ్యక్షునిగా ఎన్నికయ్యాడు. గడిచిన మూడున్నర సం॥లుగా ఐఎమ్ఎఫ్ యొక్క మార్కెట్ అనుకూల ఆదేశాలకనుగుణంగా రహానీ ప్రభుత్వం ప్రైవేటీకరణ, సరళీకరణ విధానాలను అమలుచేసింది. చమురు దిగ్గజ కంపెనీల ద్రవ్యపెట్టుబడిని ఆకర్షించేందుకు పెట్రోలియం వెలికితీత చట్టాలను సవరించింది. ఐఎంఎఫ్ ఆదేశాలకనుగుణంగా శ్రమజీవులకు సామాజిక సౌకర్యాలలో కోత విధించింది.

ఫలితంగా అమెరికా మరియు యూరోపియన్ యూనియన్ విధించిన ఆంక్షలను 2016లో తాత్కాలికంగా ఎత్తివేశారు. తన పౌర అణ్వాయుధ కార్యక్రమాన్ని రద్దుచేసుకోవటానికి ఇరాన్ అంగీకారం తెలిపింది. ఆంక్షల తొలగింపు, ఇరాన్ ఆర్థికవ్యవస్థకు ఉత్తేజమిచ్చింది. అయితే ఈ లబ్ధినంతటినీ ఉన్నత వర్గాలు అనుభవించగా, పేదవర్గాలన్నీ దానికోసం పణమొడ్డాల్సిన స్థితి వచ్చింది.

సామ్రాజ్యవాద దేశాలు ఇరాన్‌పై విధించిన ఆర్థిక ఆంక్షల భారమంతా ఇరాన్ కార్మికులు, రైతులు, ఇతర శ్రామిక ప్రజానీకంపై పడుతుండగా, ఉన్నత వర్గాలు ఈ కాలంలో మరింత సంపన్నులయ్యారు. ఇరాన్‌లో ప్రజా నిరసనలు పెరగటానికి ఇదే కారణం.

ఇరాన్ ప్రజలు తమ భవితవ్యాన్ని తమ చేతుల్లోకి తీసుకోవాలి. దశాబ్దాలుగా పాలక వర్గాలు వారిని మోసగించాయి. ఇదే తరహా ప్రజాందోళనలు మధ్యప్రాచ్యంలోనూ బ్రద్దలవుతున్నాయి. ప్రజాగ్రహం వృధా పోదు. కార్మికులు, యువజనులు-సామ్రాజ్యవాదానికి, ఇరాన్ పాలక వర్గాలకు వ్యతిరేకంగా సమీకృతులై పోరాటం సాగించాలి.

**Read !**
**Subscribe!!**


**Organ of**
**Central Committee of CPI (ML)**

**Read !**
**Subscribe!!**


**Hindi Organ of**
**Central Committee of CPI (ML)**

# ఇరాన్‌లో ప్రభుత్వాన్ని కుదిపేసిన ప్రజల నిరసనాందోళనలు




**ప్రజానిరసనలు,** ఆందోళనలతో ఇరాన్ దద్దరిల్లింది. ఈ ఆందోళనలు ఇరాన్‌లోని దాదాపు అన్ని నగరాలు, పట్టణాలకు వ్యాపించాయి. 2017 డిసెంబర్ 8న మొదలైన ఈ ఆందోళనలు ఓ వారం రోజులపాటు కొనసాగాయి. ఇరాన్ ప్రభుత్వం ఈ ఆందోళనలపై ఉక్కుపాదం మోపింది. ఈ ఘర్షణల్లో కొందరు పోలీసులతో సహా దాదాపు 21 మంది మరణించారు. ఈ ఆందోళనల్లో పాల్గొన్న షుమారు 450 మందిని అదుపులోకి తీసుకున్నట్లుగా అధికారులు అంగీకరించారు.

ఈ ప్రజానిరసనాందోళనలు అకస్మాత్తు ఘటనలు కావు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఇరాన్ ప్రజానీకంలో పెరుగుతున్న అశాంతి, ఆగ్రహాలలో ఈ ఆందోళనలూ ఒక భాగమే. దేశ రాజధాని టెహరాన్‌కు నైరుతి దిక్కుగా 300 కి.మీ. దూరంలోనున్న అరక్ అనే ఓ పారిశ్రామిక నగరంలో, 2002లో ప్రైవేటీకరించబడిన రెండు పరిశ్రమలకు చెందిన కార్మికులు 2017 సెప్టెంబర్ చివరలో 2 రోజులపాటు పోలీసులతో ఘర్షణపడ్డారు. ప్రైవేటుపరం చేసిన ఆ రెండు పరిశ్రమల యాజమాన్యాలు కూడా కార్మికుల వేతన బకాయిలను, వైద్యబీమా ప్రీమియమ్‌లను తిరిగి చెల్లించకపోవటంతో ఈ రెండు పరిశ్రమల కార్మికులు ఆందోళనకు పూనుకున్నారు. వారి నిరసనను భగ్నంచేసి, కార్మికులందరిని అక్కడి నుండి తరిమివేయటానికి పోలీసులు ప్రయత్నించినపుడు వారు పోలీసులతో ఘర్షణ పడ్డారు. వందలాది మంది చమురు కార్మికులు, వాహన డ్రైవర్లు–అక్టోబర్ చివరలో ఆలస్యంగా వేతనాలు చెల్లించటాన్ని నిరసించారు. టోబ్రిజ్ ట్రాక్టరు పరిశ్రమ కార్మికులు, ఈ పరిశ్రమ మూసివేతకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. టెహరాన్‌లోని టైర్ల ఫ్యాక్టరీ కార్మికులు తమకు బోనస్ చెల్లించాలని డిమాండ్‌చేస్తూ నిరసనాందోళన సాగించారు.

ప్రస్తుతం సాగుతున్న, విస్తృతంగా వ్యాపించిన ఈ నిరసనాందోళనలు, గతకాలపు ఆందోళనల కొనసాగింపుగా ప్రజలలో పెరుగుతున్న అశాంతి, ఆగ్రహాల వ్యక్తీకరణలే. పెరుగుతున్న నిరుద్యోగం, ఆహార ధరల పెరుగుదల మరియు ప్రభుత్వం చేపట్టిన తీవ్రమైన పొదుపు చర్యలన్నింటితో కార్మికులు, యువజనులు పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టారు. శాంతియుతంగా నిరసన తెలిపే కార్మికుల హక్కును పరిగణలోకి తీసుకుంటూ ఇరాన్ అధ్యక్షుడు హసన్ రహౌని "నిరుద్యోగానికి మించిన పెద్ద సమస్య మాకు మరోటిలేదు" అని పేర్కొన్నాడు.

ప్రజల ఆర్థిక పరిస్థితులు నానాటికీ దిగ జారుతున్న ఫలితమే ప్రజల నిరసనాందోళనలు. అధికార గణాంకాల ప్రకారమే, ఇరాన్‌లో మొత్తం పనిచేయగలిగిన వారిలో 32 లక్షలమంది అనగా 12.7 శాతం నిరుద్యోగులుగా వున్నారు. అయితే యువకులలో ఈ నిరుద్యోగం వాస్తవికంగా 40 శాతం దాకా వుంది. దేశంలోని 50శాతం ప్రజానీకం పేదరికంలో నివశిస్తున్నారని 'ఇరానియన్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్' (ఐఆర్‌జిసి) నివేదిక తెలియజేసింది. 'వరల్డ్ వెల్త్ ఇన్‌కమ్ డేటాబేస్' యొక్క 2013 సం॥ గణాంకాల ప్రకారం, ఇరాన్‌లో అత్యంత ధనికులైన పై శ్రేణీలోనున్న ఒక శాతం, దాదాపు దేశ జనాభాలో అట్టడుగునున్న 50 శాతం జనాభా ఆదాయంతో సమానమైన రాబడి కలిగి దేశ ఆదాయంలోని 16.8 శాతంపై గుత్తాధిపత్యం కలిగివున్నారు. అలాగే పైశ్రేణిలోనున్న 10 శాతం మంది దేశ ఆదాయంలో 48.5 శాతం పొందుతున్నారు.

దీనికి తోడుగా, 2010 నుండి ప్రభుత్వం పెట్రోలు, వంటగ్యాస్, మౌలిక ఆహారం, అత్యవసర సేవలపై ప్రజలకిచ్చే సబ్సిడీలను, నగదు చెల్లింపుల రూపంలోకి మార్చింది. ప్రస్తుత సంవత్సరంలో అత్యవసర సరుకులపై కూడా సబ్సిడీలను నగదు రూపంలోకి మార్చింది. పెట్రోలు ధర 50శాతం వరకూ పెరిగిపోయింది. ఈ పరిస్థితికి వ్యతిరేకంగా ప్రజాగ్రహం భారీ ప్రజాందోళనలుగా వ్యక్తమైంది.

ఇరాన్ అధ్యక్షుడు రహౌని భారీ ప్రజా ఆందోళనలకు నిరుద్యోగమే కారణంగా వుందని బహిరంగంగానే అంగీకరించినా, అయతుల్లా ఖొమైనీ వంటి కులీన పాలకవర్గం నుండి, ఐఆర్‌జిసి ఉపకమాండర్ జనరల్ రసౌల్ సనాయి, మాజీ దేశాధ్యక్షుడు మహమ్మద్ ఖతామి వరకు, ఇరాన్‌యొక్క 'వ్యూహాత్మక ప్రత్యర్థులైన' అమెరికా, ఇజ్రాయెల్, సౌదీఅరేబియాలే సామూహిక హింసకు మద్దతిస్తూ, ఆందోళనలను ప్రేరేపిస్తున్నాయని ఆరోపిస్తున్నారు. వివిధ సందర్భాలలో ఈ 'ప్రత్యర్థి దేశాలు' ఇరాన్‌లో ప్రభుత్వ మార్పుకు పిలుపునిచ్చి, 'ఇరాన్‌లో యుద్ధాన్ని' కోరుకున్నాయి. ప్రజాందోళనల నేపథ్యంలో ఇరాన్ పాలకవర్గంలోని ముఠాలన్నీ ఒక చోటికి వచ్చినట్లుగా కన్పడుతోంది.

గతంలో అమెరికా సామ్రాజ్యవాదం, పశ్చిమాసియాలోని వారి మిత్రపక్షాలు కలిసి ఇరాన్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొట్టటానికి ప్రయత్నించాయి. 2009లో అమెరికా మరియు ఫ్రాన్స్ సామ్రాజ్యవాదులు, పశ్చిమదేశాల ప్రచారమాధ్యమాల సహకారంతో, ఇరాన్ పాలకవర్గంలోని ఒక విభాగం, అమెరికా సామ్రాజ్యవాదానికి సన్నిహితమైంది. నాటి దేశాధ్యక్షుడైన మహమౌద్ అఫ్‌మెంజాద్‌ను మరో పర్యాయం ఎన్నుకోవటాన్ని వ్యతిరేకిస్తూ నిరసనలను ప్రేరేపించి ప్రజలను తప్పుదోవ పట్టించింది.

ప్రస్తుత ప్రజాందోళనలు 2009 నాటి ఆందోళనతో మౌలికంగా భిన్నమైనవనేది అంతే నిజం. 2009 నాటి ఆందోళనలు ప్రధానంగా రాజధాని నగరమైన టెహరాన్‌లో కేంద్రీకృతమై, నగరంలో ఉన్నత మధ్యతరగతి వర్గంయొక్క మద్దతును మాత్రమే చూరగొన్నాయి. కాగా, ప్రస్తుత ఆందోళనలు ఇరాన్ వ్యాపితంగా 15 నగరాలు, పట్టణాలకు వ్యాపించటంతోపాటు, కార్మికులు, యువజనులు, పేద ప్రజానీకం ఈ ఆందోళనల్లో పెద్దసంఖ్యలో పాల్గొంటున్నారు. ప్రస్తుత ప్రజాందోళనల్లో పొదుపు చర్యలను, ధరల పెరుగుదలను, నిరుద్యోగాన్ని వ్యతిరేకిస్తుండగా, 2009 నాటి ఆందోళనల్లో సామాజిక ఖర్చుక్రింద ప్రజలపై ప్రభుత్వం 'అమితంగా వ్యయం చేస్తున్నదని' విమర్శించారు.

అమెరికా సామ్రాజ్యవాదం నిరంతరం విధిస్తూ వచ్చిన ఆర్థిక ఆంక్షలు, సైనిక వత్తిళ్ళు, చమురు ధరల పతనం, అధ్యక్షుడు రహౌనీ అమలుచేసిన ఘోరమైన పొదుపు చర్యలే, ఇరాన్‌లో నెలకొన్న ఆర్థిక సంక్షోభానికి కారణాలుగా వున్నాయి. **(తరువాయి 8వ పేజీలో)**

# యుద్ధం కారణంగా విధ్వంసానికి గురైన యెమన్




**యెమన్** దేశంలో కలరా వ్యాధి సోకినవారి సంఖ్య పదిలక్షలకు చేరుకొందని అంతర్జాతీయ రెడ్‌క్రాస్ కమిటి (ఐసిఆర్‌సి) ప్రకటించింది. 2017 ఏప్రిల్ నుండి ఈ వ్యాధికి గురై 2200 మంది (దీనిలో 3వ వంతు పసిపిల్లలే) మరణించారు. యెమన్ దేశ జనాభాలో 25 శాతానికి పూర్తిగా ఆహారమే లభించటంలేదని, మరో 36 శాతం ప్రజలు ఆహారకొరత నెదుర్కొంటున్నారని ఐక్యరాజ్యసమితికి చెందిన ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఓ) పేర్కొంది.

2017 చివరినాటికి యెమన్‌లో 50 వేల మంది పసిపిల్లలు మరణించనున్నారని 'సేవ్ ద చిల్డ్రన్' అనే ఓ ప్రభుత్వేతర సంస్థ (ఎన్‌జీవో) ప్రకటించగా, ప్రతి పదినిముషాలకీ ఒక యెమన్ పిల్లవాడు చనిపోతున్నాడని ఐక్యరాజ్యసమితి తెలిపింది.

మధ్యప్రాచ్యంలోని అత్యంత పేద దేశమైన యెమన్‌లో విధ్వంసం సృష్టించిన వెయ్యిరోజుల యుద్ధం ఫలితంగానే ఈ మానవత్వ సంక్షోభం సంభవించింది. 2014 మార్చిలో సౌదీ అరేబియా ఈ యుద్ధాన్ని ప్రారంభించింది. యెమన్ అధ్యక్ష స్థానం నుండి తొలగించబడి, సౌదీ అరేబియా పారిపోయి అక్కడ తలదాచుకున్న రబ్బు తన కీలుబొమ్మ మన్‌సౌర్ హాదీని తిరిగి అధికారంలోకి తేవడానికి సౌదీ అరేబియా ఈ యుద్ధం సాగించింది.

అమెరికా ఆయుధ పరిశ్రమ సౌదీ అరేబియాకు సరఫరా చేసిన క్షిపణులు. క్లస్టర్ బాంబులు, ఇతర ఆయుధాలను యెమన్‌పై ప్రయోగించి ఆ దేశంలోని పాఠశాలలను, ఆసుపత్రులను, నివాసగృహాలను, పరిశ్రమలను, కాలనీలను విధ్వంసం చేసి శిధిలాలుగా మిగిల్చింది. వాయు, నావికా, భూమార్గాలను సౌదీ అరేబియా, అమెరికా దేశాలు నిరోధించడం ద్వారా, బాంబుల విధ్వంసం తర్వాత బతికి బట్టకట్టగలిగినవారికి సైతం చమురు ఇతర వస్తువులను లభించకుండా నిలువరించాయి. ఐసిఆర్‌సి ప్రకారం యెమన్ దేశంలోని 60 శాతం మంది ప్రజానీకానికి కనీస ఆహారం, రక్షిత మంచినీరు, కనీస వైద్యసౌకర్యం అందే పరిస్థితి లేదు. యెమన్‌లోని 50 శాతం వైద్య సేవా సౌకర్యాలన్నీ ధ్వంసం చేయబడ్డాయి. యుద్ధం యెమన్ దేశాన్ని వ్యాధుల్లోకి, దుర్భిక్షంలోకి నెట్టివేసింది.

2002 నుండి అమెరికా సామ్రాజ్యవాదం రహస్యంగా పైలెట్ రహిత విమానాలతో యెమన్‌పై దాడులు సాగిస్తూ వస్తోంది. యెమన్‌లో భూతలంలో పలు దాడులకు పాల్పడినట్లుగా పెంటగాన్ ఇపుడు అంగీకరిస్తోంది. అరేబియా ద్వీపకల్పంలో అల్‌ఖైదాను, యెమన్‌లో 'ఇస్లామిక్ స్టేట్' (ఐసిస్)ను అది సాకుగా ఉపయోగిస్తోంది.

యెమన్ ప్రయోగించిన ఇరాన్ క్షిపణి రియాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో విధ్వంసాన్ని సృష్టించిందంటూ, ఐక్యరాజ్య సమితిలో అమెరికా రాయబారి నిక్కిహేలీ వాషింగ్‌టన్ డి.సి.లోని తమ సైనిక స్థావరం ఎదుట దృశ్యరూపంలో ప్రదర్శించాడు. దీనిలో ఎవరూ మరణించలేదు.

ఇది ఓ కల్పిత కథ. హేలీ తన కథనంలో ప్రదర్శించిన క్షిపణి శిధిలాలలో అమెరికాకు చెందిన విడి భాగాలను కలిగివున్నట్లుగా ఐక్యరాజ్యసమితికి చెందిన ఓ నివేదిక వెల్లడి చేసింది. అంటే, అమెరికా క్షిపణి మార్కెట్‌కు అనుగుణమైనవారెవరో ఆ క్షిపణిని ఒక దగ్గరకు కూర్చుచేసి వుంటారని అర్థమౌతోంది. అమెరికా విధించిన దిగ్బంధం కారణంగా యెమన్‌కు చమురు, ఆహారం, ఔషధాలు సరఫరా చేసే నౌకలను సైతం అమెరికా నావికా బలగాలు తిప్పి పంపుతుండగా, ఇరాన్ యెమన్‌కు ఆయుధాలను ఏవిధంగా సరఫరా చేయగలిగిందనే ప్రశ్నకు నిక్కిహేలీ సమాధానం చెప్పలేదు.

రియాద్ విమానాశ్రయంపై జరిగిన క్షిపణి దాడిని అమెరికా ప్రభుత్వం ఖండించి, ఎలాంటి కనీస ఆధారం లేకుండా ఇరాన్‌ను దీనికి బాధ్యురాలిగా ఆరోపిస్తోంది. వాస్తవానికి అమెరికానే యెమన్ ప్రజల ఊచకోతను ప్రేరేపించి, మద్దతుగా నిలిచింది.

## కామ్రేడు కానుసన్యాల్ మరణం!

విప్లవ సౌందర్య విద్యుదావేశం
అకస్మాత్తుగా తెగి జిగేల్మనడం!
ఒక లోతు విస్ఫోటనం ఒక ఎత్తున ఎగిరి వికసించి
సత్యాల్నీ సౌరభాల్నీ పంచడం!
శత్రువు గుండెల్లోకి దిగి పేలడం!
అనుభవాలు పోగై రేగి ఆచరణలను
అయిన వారికి సమర్పించుకోవడం!
చలనంలోని జడత్వ భ్రమని దొరకబుచ్చుకొని
జీవితం రెండు కొనలతో ముడేసి తిప్పడం!
అనుకున్నట్టు జరగడాన్ని పురోగమించనివ్వడం-
అర్థమైన శరీర ధర్మాన్ని నిర్దయగా నడవనివ్వడం-
స్వరూపం స్వంతం కాకుండా పంచుకుపోవడం!
జీవితం రుచిని రసాలంకృతం చెయ్యడం-
సౌష్టవాన్ని సాయుధంచేసి
విప్లవ మార్గ నిర్దేశకత్వానికందించడం-
సత్యం రుజువు కావడంకోసం
అందరి నిశ్చయాలలో కొలువుదీరడం!
కామ్రేడు కానూసన్యాల్ మరణం.

**- ఛాయరాజ్**

# అసోమ్‌లో పౌరసత్వాన్ని మతతత్వీకరిస్తున్న పాలకుల విధానాలను వ్యతిరేకించాలి

**దశాబ్దాల** క్రితమే అసోమ్‌కు వలసవచ్చిన ఒక విభాగం ప్రజలకు 'విదేశీయులు' అనే ముద్ర తగిలించి, ఆ విభాగం ప్రజలను వేధింపులకు గురిచేయటం పాలకవర్గ పార్టీల చేతుల్లో అనువైన సాధనంగా వుంటోంది.

1951లో అసోమ్‌లో తొలిసారిగా పౌరులను జాతీయ రిజిస్టర్‌లో నమోదు చేశారు. 1955లో పౌరసత్వ చట్టం చేశారు. అయితే పౌరసత్వపు జాబితాను చాలాకాలంపాటు తాజాపరచలేదు. వివిధ కాలాలలో పశ్చిమబెంగాల్‌నుండి రైతాంగ ప్రజానీకం, టీతోటల కార్మికులు తగిన సంఖ్యలో అసోమ్‌కు వలసవచ్చారు. వారిలో అనేకమంది అసోమ్‌ను తమ శాశ్వత నివాసస్థానంగా చేసుకున్నారు. 1971 నాటి యుద్ధం సందర్భంగా, ప్రస్తుత బంగ్లాదేశ్ సరిహద్దు గ్రామాలనుండి అనేకమంది ప్రజలు అసోమ్‌కు వలసవచ్చారు. వారికోసం భారత ప్రభుత్వం అసోమ్ తలుపులను తెరచింది కూడా.

1979లో 'ఆల్ అస్సామ్ స్టూడెంట్స్ యూనియన్' (ఏఏఎస్‌యు-ఆసు), అస్సాం గణ సంగ్రామ పరిషత్(ఏజిఎస్‌పి) స్థానికుల గుర్తింపు సమస్యను లేవనెత్తి, అసోమ్ నుండి విదేశీయులను పంపివేయాలని డిమాండ్ చేశాయి. పశ్చిమబెంగాల్‌నుండి వచ్చిన ప్రజలను సైతం విదేశీయులుగా పరిగణించే పోకడలు అప్పుడు వ్యక్తమయ్యాయి. ఈ ఉద్యమం హింసాత్మక రూపం తీసుకొని, ఆరు సం॥ల కాలంపాటు సాగింది. చివరకు, రాజీవ్‌గాంధీ నాయకత్వంలోని కేంద్రప్రభుత్వం మరియు 'ఆసు', ఏజిఎస్‌పిల నడుమ 1985 ఆగస్టు 15న అస్సామ్ శాంతి ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఈ ఒప్పందం ప్రకారం 1971 మార్చి 24 అర్ధరాత్రి తర్వాత అస్సాముకు వలస వచ్చిన వారంతా 'విదేశీయులు'గా పరిగణింపబడతారు. రాష్ట్రప్రభుత్వం ఈ కాలపరిధి దాటి అస్సామ్‌లోకి ప్రవేశించిన చట్టవిరుద్ధ వలసదారులను 'కనిపెట్టి వారిని బహిష్కరించాలి'. ఏమైనా, రాష్ట్రంలో వరుసగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు తమ కర్తవ్యపాలనను విస్మరించాయి.

2005లో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు మరియు 'ఆసు'లు మరొక ఒప్పందం చేసుకున్నాయి. పౌరుల జాతీయ రిజిస్టర్‌ను సాధ్యమైనంత త్వరగా తాజాపరచాలని ఈ ఒప్పందం ఆదేశించింది. అయితే ఈ పనిని సగంలోనే అసంపూర్తిగా నిలిపివేశారు. ఒక ప్రభుత్వేతర సంస్థ సుప్రీమ్ కోర్టులో దాఖలుచేసిన ఓ పిటిషన్‌తో, అర్థాంతరంగా ఆపివేసిన ఈ పనిని సత్వరమే పూర్తిచేయాలని సుప్రీంకోర్టు రాష్ట్రప్రభుత్వాన్ని ఆదేశించింది.

పౌరుల జాతీయ రిజిస్టర్‌ను తాజాపరిచే పని ఇంకా అసంపూర్తిగా వుండగానే, కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం, ఈ సమస్యను ఓ ప్రమాదకరమైన మలుపు తిప్పేందుకు ముందుకొచ్చింది. 1955 చట్టాన్ని సవరిస్తూ 'పౌరసత్వం (సవరణ) బిల్లు'ను బిజెపి ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. ప్రతిపక్షాలు ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించాయి. 2016 ఆగస్టులో బిజెపి ప్రభుత్వం ఈ బిల్లును 'పార్లమెంట్ జాయింట్ సెలక్ట్ కమిటీ'కి పంపవలసివచ్చింది.

2017 డిసెంబర్ 31 అర్థరాత్రి సమయంలో తాజాపరిచిన జాతీయ పౌరుల రిజిస్టరుయొక్క మొదటి ముసాయిదాను ప్రచురించారు. రాష్ట్రంలోని 3 కోట్ల 29 లక్షలమందిలో ఒక కోటీ 39 లక్షలమంది పేర్లను పరీక్షించవలసినవిగా, ఈ జాబితా తెలియజేస్తోంది. పరీక్షకు గురిచేయబడాల్సిన పేర్లుగలవారు, జాబితాలో పేర్లు కనబడనివారు తమ పరిస్థితి గురించి తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తుది జాబితా బయటకొచ్చిన తరువాత కూడా సరిచేసుకోవడానికి అవకాశముంటుంది గనుక కంగారు పడవలసిన అవసరంలేదని రాష్ట్రప్రభుత్వం భరోసానిస్తోంది.

బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'పౌరసత్వం (సవరణ) బిల్లు-2016' ముస్లిములను మినహాయించి, అసోంలో మిగిలిన అల్ప సంఖ్యాక మతస్థులకు పౌరసత్వం కల్పిస్తోంది. బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్, పాకిస్తాన్‌ల నుండి వలసవచ్చిన హిందు, సిఖ్ఖు, బౌద్ధ, జైన, పార్సీ మరియు క్రిస్టియన్ మతస్థులను పౌరసత్వానికి అర్హులుగా ఈ బిల్లు పేర్కొంటోంది. మత ప్రాతిపదికన ప్రజలను వివక్షకు గురిచేసి, పౌరసత్వమిచ్చే ప్రక్రియనంతటినీ మతతత్వీకరించే చర్య ఇది. హిందూ దేశమనే సిద్ధాంతాన్ని వెనుకదోవగుండా చొప్పించే సంఘ్‌పరివార్ చర్య కూడా!

ఈ విధంగా అసోమ్‌లో పౌరసత్వమివ్వటం అనే అంశాన్ని సమస్యాత్మకంగాను, తుదిలేని కసరత్తుగానూ మార్చి వేశారు. ఈ కాలమంతటా, పాలకవర్గాలు, ప్రభుత్వాలు చొరబాటుదారులుగా పరిగణిస్తున్న కారణంగా అనేకమంది వేధింపులకు, అసమానత్వానికి గురిచేయబడటంతో పాటు వారి హక్కులను నిరాకరించి, భూముల నుండి వారిని గెంటివేస్తున్నారు. అలాగే వలస ప్రజలయొక్క ఈ అభద్రతా స్థితిని ఉపయోగించుకుని ఎన్నికలలో ఓట్ల లబ్ధిని కూడా పొందుతున్నాయి.

పౌరసత్వానికి అర్హతలనుండి ముస్లిము వలసదారులను మినహాయించిన బిజెపియొక్క ఈ చర్య, వారిని మరింత విషాదకర స్థితిలోకి నెట్టివేస్తోంది. ప్రజాస్వామిక శక్తులు అన్ని రూపాల్లో ఈ విధానాన్ని వ్యతిరేకించి, పౌరసత్వం కోసం అసోం ముస్లిమ్ ప్రజల న్యాయమైన హక్కుకోసం నిలవాలి.

*విప్లవానికి బావుకత కానీ చావుకానీ అవసరం లేదు. దానికి కావలసింది నిరంతర పోరాటం. కష్టాలు భరించటం, త్యాగాలతో కూడిన జీవితం. ముందుగా వ్యక్తిగత మోహాలను కాలరాసేయండి. వ్యక్తిగత సుఖసంతోషాల స్వప్నాల్ని తుడిచేయండి. అప్పుడు ప్రారంభించండి పనిచేయడం. ఒక్కొక్క అంగుళం చొప్పున సాగండి ముందుకు. అందుకు ధైర్యం, వేసిన అడుగు స్థిరంగా ఉండటం, గొప్ప దృఢ సంకల్పం అవసరం. ఏ కష్టాలూ, అడ్డంకులూ మిమ్మల్ని నిరుత్సాహపరచలేవు. ఏ వైఫల్యాలూ, విద్రోహాలూ మిమ్మల్ని అధైర్యపరచలేవు..... మీలోని విప్లవ చేవను నాశనం చేయలేవు. కష్టాలూ, త్యాగాల అగ్నిపరీక్షలో మీరు తప్పక విజయం సాధిస్తారు.*

**– భగత్‌సింగ్**

# భారత బడా బూర్జువావర్గ విస్తరణవాద కాంక్షలు - ఆర్థిక మూలాలు

**కామ్రేడ్** తరిమెల నాగిరెడ్డి తన రచన "తాకట్టులో భారతదేశం"లో భారత బూర్జువా వర్గానికున్న విస్తరణవాద ధోరణి వివరించారు. వలసాధిపత్యం నుండి బయటపడిన ఆసియా, ఆఫ్రికా దేశాలలో వలస రాజ్యం వెళ్లిపోయి నందున ఏర్పడిన ఖాళీలోకి భారత బడాబూర్జువా వర్గం తన పెట్టుబడితో ఎలా ప్రవేశించిందో తెలిపారు. అక్కడి నూతన పాలకులు పాత వలసాధిపతులతో సంబంధాల పట్ల కలిగియున్న అయిష్టత వారికవకాశమైందని చెప్పారు. ఈ దేశాలలోకి ప్రవేశించేందుకు విదేశీద్రవ్య పెట్టుబడికి భారతదేశం ఒక దూకుడుబల్లగానూ, భారత పారిశ్రామికవేత్తలు ఒక ముసుగుగానూ ఉపయోగపడ్డారని తెలిపారు. ఆసియా, ఆఫ్రికా దేశాలపై దోపిడీలో వాటా పొందే విధంగా భారత బూర్జువాలు విదేశీ ద్రవ్యపెట్టుబడికి సహాయక పాత్ర నిర్వహిస్తున్నారని విశ్లేషించారు.

భారత బడా బూర్జువావర్గపు ప్రతినిధిగా భారత ప్రభుత్వం పొరుగు దేశాలపట్ల బ్రిటీషు వలస పాలకులు అనుసరించిన విధానాలను వారసత్వంగా స్వీకరించిన తీరును వివరించారు. విముక్తి పేరిట బంగ్లాదేశ్ ను ఏర్పరచటంలో భారత ప్రభుత్వ సైనిక జోక్య పాత్రను వివరించటంతో పాటుగా, బంగ్లాదేశ్ ఏర్పడిన వెంటనే అక్కడ పెట్టుబడుల మదుపుకు ఉవ్విళ్లూరిన భారత బూర్జువాల ఆశలను పేర్కొన్నారు. పొరుగుదేశాలపై పెద్దన్నగా పెత్తనం చేస్తున్న దానితీరునూ, నేపాల్ ఆంతరంగిక, విదేశీవిధానాలను నిర్దేశించేందుకు చేసిన అన్నిరకాల ప్రయత్నాలనూ, సిక్కింను రక్షిత రాజ్యంగా వుంచుకోవటాన్ని విమర్శించారు. భారత బూర్జువావర్గపు విస్తరణవాద కాంక్షలకు భారత ప్రభుత్వం అద్దం పట్టిన తీరును నెహ్రూ మాటలలోనే పేర్కొని భారత బడా బూర్జువా వర్గం ఎంత దురాశాపూరితంగా ఆసియా, ఆఫ్రికా దేశాలపై కేంద్రీకరిస్తూ వస్తున్నదో స్పష్టం చేశారు.

ఈ రచన తర్వాతి పరిణామాలు కా॥టి.ఎన్. నిర్ధారణ సరైనదేనని నిరూపించాయి. సైన్యాన్ని మొహరించి బలవంతంగా సిక్కిం రాజుతో విలీనంపై సంతకం చేయించి సిక్కింను భారత ప్రభుత్వం కలిపివేసుకుంది. సిక్కిం రాజును వివాహమాడిన విదేశీ యువతి, సిక్కిం విలీనం తర్వాత రాజుకు విడాకులిచ్చి, వ్రాసిన ఆత్మకథలో ఈ విలీనం సిక్కింకు ఎంత అవమానకరంగా సాగిందో వివరించారు.

అమెరికా సామ్రాజ్యవాదం, రష్యా సోషల్ సామ్రాజ్యవాదాల మధ్య దక్షిణాసియాపై పట్టు కోసం సాగిన పోటీలో, రష్యా కనుకూలంగా, శ్రీలంకలో అణచివేతకు గురౌతున్న తమిళుల సమస్యను దాని ఆంతరంగిక సమస్యగా పరిగణించకుండా రెచ్చగొట్టడమూ, తమిళ మిలిటెంట్లకు నీలగిరి కొండల్లో శిక్షణ నివ్వటమూ, ఆయుధాలందించటమూ భారత బడా బూర్జువా వర్గపు విస్తరణవాద కాంక్షలకు అనుగుణంగానే సాగింది. దీని విపత్కర పరిణామాలూ, భారత సైన్యం శ్రీలంకలో అడుగు పెట్టడమూ అందరికీ తెలిసినవే.

ఈ విస్తరణవాద కాంక్షలకు మూలమైన బడా బూర్జువావర్గం విదేశాల్లో మదుపుచేస్తున్న పెట్టుబడిని పరిశీలిద్దాం.

## విదేశాల్లో "భారత" పెట్టుబడి మదుపు

భారత పెట్టుబడిదారులు ఇతర దేశాలలో మదుపు చేయటం బ్రిటీషు వలసపాలన కాలం నాటినుండీ వున్నది. తూర్పు ఆఫ్రికా దేశాలలో వీరు వ్యాపారరంగంలో పెట్టుబడులు పెట్టారు. పారిశ్రామిక పెట్టుబడి మదుపు ఇథియోపియాలో బిర్లా టెక్స్‌టైల్ మిల్లుతో ప్రారంభమైంది. 1980ల చివరి నాటికి దాదాపు 250 పరిశ్రమలను భారత పెట్టుబడిదారులు విదేశాలలో పెట్టారు. వీటిలో ఎక్కువభాగం వెనుకబడిన దేశాలలోనే వున్నాయి. ఇవి చిన్న, మధ్య తరహా పరిశ్రమలు గానే వున్నాయి. ఈ విదేశాలలో ఎక్కువభాగం బ్రిటీషు వలస పాలనకు చెందినవి కావటం గమనార్హం.

ప్రపంచీకరణ తర్వాత భారత పెట్టుబడి దారులు విదేశాల్లో మదుపు చేయటం మరింత వేగాన్ని పుంజుకుంది. విదేశీ మారక ద్రవ్య వినియోగంపైనా, పెట్టుబడుల మదుపుపైనా వున్న ఆంక్షలను ప్రభుత్వం సడలిస్తూ రావటం దీనికి కారణం.

1991లో 220 ప్రాజెక్టులకు అనుమతులు రాగా 2007 నాటికి వాటి సంఖ్య 1595కు పెరిగింది. వీటి పెట్టుబడులు 2.5 కోట్ల డాలర్ల నుండి 1400 కోట్ల డాలర్లకు పెరిగాయి. దీనితో భారత బహుళ జాతి కంపెనీలు ఏర్పడ్డాయన్న ప్రచారం సాగుతున్నది. ఈ అంశాన్ని మరింత లోతుగా పరిశీలిద్దాం.

నూతన ఆర్థిక విధానాలు చేపట్టిన సందర్భంలో భారత ప్రభుత్వం అప్పటి వరకూ అనుసరించిన రక్షిత విధానాల ఫలితంగా భారత బూర్జువావర్గం బలపడిందనీ, ఇప్పుడు దానికి ప్రభుత్వ రక్షణ అవసరంలేదనీ, దానిని అంతర్జాతీయ పోటీకి గురిచేస్తే అది అంతర్జాతీయ స్థాయికి పెరుగుతుందనీ, ఆరీత్యా భారత ఆర్థిక వ్యవస్థను ప్రపంచ ద్రవ్య పెట్టుబడి ప్రవేశానికి తెరుస్తున్నామనీ భారత ప్రభుత్వం సమర్థించుకుంది.

**పట్టిక - 1**

**విదేశీ పెట్టుబడులు - భారత స్థాయి**

| దేశాలు | 2004-05 తరలిన పెట్టుబడి | | 2006-07 తరలిన పెట్టుబడి | |
|---|---|---|---|---|
| | మొత్తం(బి.డా) | శాతం | మొత్తం (బి.డా) | శాతం |
| ప్రపంచం | 900.5 | | 1659.8 | |
| అభివృద్ధి చెందిన దేశాలు | 767.4 | 85.2 | 1389.7 | 83.7 |
| అభివృద్ధి చెందుతున్న దేశాలు | 118.8 | | 232.9 | |
| ద.ఆఫ్రికా | 1.1 | 0.1 | 5.2 | 0.3 |
| మెక్సికో | 5.5 | 0.6 | 7.0 | 0.4 |
| బ్రెజిల్ | 6.2 | 0.7 | 17.6 | 1.1 |
| చైనా | 8.9 | 1.0 | 21.8 | 1.3 |
| భారత్ | 2.6 | 0.3 | 18.2 | 0.8 |

ఆధారం : అంక్టాడ్ – వరల్డ్ ఇన్‌వెస్ట్‌మెంట్ రిపోర్టు 2010

జరిగింది మాత్రం దీనికి భిన్నంగానే వుంది. విదేశీ పెట్టుబడి భారత పరిశ్రమలను క్రమంగా తన ఆధీనంలోకి తెచ్చుకుంటున్నారు. బడా బూర్జువా వర్గపు పరిశ్రమలు కూడా దీని పరమయ్యాయి. ఉదా: టాటా ఆయిల్ కంపెనీ యూనీ లీవర్ పరమయ్యింది.

ఈ నేపథ్యంలోనే భారత పెట్టుబడి విదేశాలలో మదుపు చేయటాన్ని చూద్దాం. ప్రపంచమంతటా విదేశాలకు తరలుతున్న పెట్టుబడులలో భారత్ నుండి వెళుతున్న పెట్టుబడి 0.8 శాతం మాత్రమే. అంటే ప్రతి వంద రూపాయల్లో 80 పైసలు మాత్రమే **(పట్టిక-1)**. లెక్కలోకి రాని స్థాయినుండి 2000 తర్వాత 2006 నాటికి 0.8 శాతానికి పెరగటాన్ని చూపి భారత బడా బూర్జువావర్గం బహుళజాతి కంపెనీల స్థాయికి చేరాయనటం అతిశయోక్తే కాక అవాస్తవమౌతుంది. ప్రపంచ స్థాయి తరలింపులను 0.8 శాతం ఏ విధంగానూ ప్రభావితం చెయ్యలేదు. అతి చిన్న బహుళజాతి కంపెనీ పెట్టుబడి మదుపు ముందు భారత విదేశీ పెట్టుబడి మరుగుజ్జుగానే వుంటుంది.

భారత పెట్టుబడులు ఏఏ దేశాలకు వెళుతున్నాయన్న అంశాన్ని గమనిస్తే **(పట్టిక-2)**, 1990 వరకూ 86.3 శాతం పెట్టుబడి వెనుకబడిన దేశాలకు వెళ్లింది. మిగిలిన 18.7 శాతం మాత్రమే పశ్చిమ యూరపు, అమెరికా, కెనడాలకు వెళ్లింది. వలసపాలన నుండి బయటపడుతున్న దేశాల ప్రజల్లో వలసాధిపత్య దేశాలపట్ల వున్న వ్యతిరేకత కారణంగా సామ్రాజ్యవాద పెట్టుబడిని వెంటనే అనుమతించలేని స్థితిలో ఆయా ప్రభుత్వాలున్నాయి. కా॥ టి.ఎన్. చెప్పినట్లు యీ ఖాళీలోకి భారత పెట్టుబడిదారులు ప్రవేశించారు.

వలసపాలన నుండి బయటపడుతున్న ఈ దేశాలతో పోల్చి చూస్తే, భారత్ పారిశ్రామికంగా పై స్థాయిలో వుంది. జవహర్‌లాల్ నెహ్రూ సోషలిస్టు వాగాడంబరమూ, అలీనోద్యమ నాయకుడిగా పేరుపొందటమూ, ఈ దేశాల పాలకులు తమ అభివృద్ధికి దోహదపడుతుందని ఆశించటం భారత పెట్టుబడులకు తగిన వాతావరణాన్ని కల్పించింది. మరోవైపునుండి చూస్తే, తర్వాతి దశలో సామ్రాజ్యవాదుల పెట్టుబడి ప్రవేశానికి ప్రజల్లో వున్న వ్యతిరేకతను తగ్గించేందుకు ఉపయోగపడింది.

భారత పెట్టుబడి ప్రవేశించిన రంగాలను చూస్తే ఇది మరింత స్పష్టమౌతుంది. మొదటి దశలో (1980ల వరకూ) భారత పెట్టుబడిదారులు వెనుకబడిన దేశాలలో కొత్త పరిశ్రమల స్థాపననే సాగించారు. తర్వాతి స్థానం వాణిజ్యానిది. భారత దేశంలో తాము కలిగివున్న ఉత్పాదక పరిశ్రమలనే ఇక్కడ నెలకొల్పారు. ఉదా: ఇథియోపియాలో బిర్లా గ్రూపు టెక్స్‌టైల్ మిల్లు; కెన్యాలో ఇంజనీరింగు కంపెనీ.

భారత పెట్టుబడులకు ఆనాడున్న మరో లక్షణం దాదాపుగా అవన్నీ మిలాఖత్ సంస్థలుగానే ఏర్పడ్డాయి. భారత పెట్టుబడి మైనారిటీ వాటాగానే వుంది. అందులోనూ ద్రవ్యనిధులు తక్కువ. యంత్రాల సరఫరాతో వాటాలు పొందాయి. (ప్రేమచంద్ర అతుకొరల)

భారత పెట్టుబడి ద్వారా సామ్రాజ్యవాదులు యంత్రాల అమ్మకం సాగించారు. భారత్‌కు మైనారిటీ వాటావున్న ఆనాటి మిలాఖత్ సంస్థల్లో చాలావాటినుండి భారత పెట్టుబడిదారులు తర్వాత తప్పుకున్నారు. చాలా విస్తృత పరిశోధన సాగితే తప్ప అలా ఎందుకు జరిగిందో ఒక అంచనాకు రాలేము.

2000 సంవత్సరం తర్వాత భారత పెట్టుబడి విదేశాలలో మదుపు తీరు తెన్నులను చూద్దాం.

ఇంతకుముందు కొత్త పరిశ్రమల ఏర్పాటు ప్రధానాంశంగా వుండగా, 2000 తర్వాత విదేశాలకు వెళ్లిన భారత పెట్టుబడి నెలకొనివున్న పరిశ్రమల్లోకి తరలటం ప్రధానాంశంగా వుంది. ఇలా వెళుతున్న పెట్టుబడి అక్కడి పరిశ్రమతో మిలాఖత్, కలయిక (మెర్జర్), స్వాధీనం (అక్విజిషన్), కొన్ని సందర్భాలలో మిలాఖత్ కంపెనీని ఒక క్రమంలో స్వాధీనం చేసుకోవటం అన్న రూపాలు అనుసరిస్తున్నది.

ఇలా వెళ్లిన పెట్టుబడి గతంలో లాగే ఉత్పాదకరంగంలోకే ఎక్కువ వెళ్లింది (42.7 శాతం). దీనిలో ఫార్మా, ఆటో రంగాలదే ప్రధాన భాగం. తర్వాతిస్థానం ద్రవ్యేతర సేవలది. దీనిలో ఐటి, ఐటిఇఎస్‌లదే సింహభాగం. **(పట్టిక-3)**

ఇలా వెళ్లిన పెట్టుబడిలో చిన్న పరిశ్రమల్లోకి వెళ్లినది సంఖ్యరీత్యా 60 శాతముండగా, పెట్టుబడిరీత్యా 3 శాతంలోపుగానే వున్నాయి. పెద్దవి సంఖ్యలో 40 శాతంగానూ, పెట్టుబడిలో 97 శాతంగానూ వున్నాయి **(పట్టిక-4)**

భారత్ నుండి విదేశాలలోకి పెట్టుబడుల మదుపు కొనసాగుతున్నప్పటికీ, వీటిలో అధిక భాగం 2001లో జరిగాయి. టాటాస్టీలు, టాటా మోటార్సు, బిర్లాకు చెందిన హిండాల్కో, ఎస్సార్‌స్టీలు, పుర్ణేందు ఛటర్జీ పెట్రో కెమికల్ సంస్థల పెట్టుబడి ఒక్కొక్కటి రూ 20 వేల కోట్లు. వీటి తర్వాత అతి పెద్ద కొనుగోళ్లు భారత కంప్యూటర్ సైన్సు కార్పోరేషన్ చేసిన కొవాన్సిస్ కొనుగోలు (రూ 5370 కోట్లు ) ఇన్ఫ్రా క్రాసింగ్‌ను విప్రో కొనుగోలు ( రూ 2430 కోట్లు).

గతంలో వెనుకబడిన దేశాల్లోకి భారత పెట్టుబడులు వెళ్లగా, ఇప్పుడు ఉత్తర అమెరికా పశ్చిమ యూరపులోకి వెళుతున్నాయి. ప్రస్తుతం భారత పెట్టుబడులు 85 దేశాలలోకి వెళుతుండగా, అమెరికాకు చెందిన 215 కంపెనీలలోకి 40 శాతమూ, బ్రిటన్‌కు చెందిన 59 కంపెనీలలోకి 11 శాతమూ వెళ్లాయి. జర్మనీలో 20 కంపెనీలకు 4 శాతమూ, సింగపూరులోని 20 కంపెనీలకు 4 శాతమూ, ఆస్ట్రేలియా లోని 16 కంపెనీలకు 3 శాతమూ వెళ్లాయి. మొత్తంలో 60 శాతం ఈ ఆరు దేశాలలోకే వెళ్లింది. (ప్రధాన్, నయ్యర్ 2007).

పెద్దస్థాయి పెట్టుబడులు లోహాలూ, ఉత్పాదక రంగాలైన ఫార్మా, ఆటో రంగాల్లోకి వెళ్లాయి(ఈ రంగాల్లో ఇంత పెద్ద స్థాయి పెట్టుబడి మదుపు మళ్లీ జరగలేదు). సంఖ్య

**పట్టిక - 2**

**భారత్ నుండి వివిధ దేశాలకు వెళ్లిన పెట్టుబడి** (శాతాలలో)

| | 1990వరకూ | 1991-1995 | 1996-2002 | 2002-2006 |
|---|---|---|---|---|
| **అభివృద్ధి చెందుతున్న దేశాలు** | **86.3** | **63.8** | **63.3** | **46.2** |
| ఆగ్నేయ, తూర్పు ఆసియా | 36.3 | 26.0 | 11.0 | 12.8 |
| దక్షిణాసియా | 9.4 | 9.4 | 8.1 | 2.6 |
| ఆఫ్రికా | 17.0 | 8.6 | 11.5 | 13.5 |
| పశ్చిమాసియా | 9.7 | 13.0 | 6.4 | 4.4 |
| మధ్య ఆఫ్రికా | 10.4 | 1.9 | 0.6 | 1.2 |
| మధ్య, తూర్పుయూరపు | 3.0 | 5.1 | 27.3 | 9.3 |
| లాటిన్ అమెరికా | 0.3 | 1.1 | 4.0 | 3.9 |
| **అభివృద్ధి చెందిన దేశాలు** | **13.9** | **35.0** | **36.7** | **53.8** |
| పశ్చిమ యూరపు | 7.8 | 20.4 | 12.3 | 35.2 |
| ఉత్తర అమెరికా | 6.1 | 15.1 | 24.2 | 14.1 |
| మొత్తం | 100 | 100 | 100 | 100 |
| **మొత్తం మి.డాలర్లలో** | **222** | **734** | **6403** | **11,587** |

కూర్పు : రిజర్వుబ్యాంక్ బులెటిన్‌ల నుండి

రీత్యా చూస్తే ఎక్కువ భాగం ఒప్పందాలు (52 శాతం) సేవారంగంలోకి వెళ్లాయి. వీటిలో 191 ఒప్పందాలు (37 శాతం) ఐటి రంగంలోకి వెళ్లాయి. వీటిలో అమెరికాలోని ఐటి కంపెనీలను కొనటమే అధిక భాగంగా వుంది.

భారత దేశంలోని కంపెనీలను స్వాధీనం చేసుకోవటంలో (సామ్రాజ్యవాద) దేశాలున్న స్థానాల వారీగానే, భారత పెట్టుబడులు కూడా అదే వరుసలో (ఆ సామ్రాజ్యవాద) దేశాలలోకి వెళ్లటం ఒక లక్షణంగా వుందనీ, ఈ ధోరణి రాబోయే సంవత్సరాలలో కొనసాగుతుందనీ ప్రొ. బీనా సరస్వతి వ్యాఖ్యానించారు.

భారత దళారీ బూర్జువావర్గం సామ్రాజ్యవాద పెట్టుబడితో పెనవేసుకుపోతున్న తీరునే ఇది తెలుపుతున్నదనీ మనం భావించవచ్చు.

పై పరిణామాలను బట్టి విదేశాలకు వెళుతున్న భారత పెట్టుబడి స్వభావాన్ని తెలుసుకుందాం.

ఒకే భారత కంపెనీ అనేకసార్లు విదేశాల్లో పెట్టుబడి పెట్టింది. టాటా గ్రూపు 22 విదేశీ కంపెనీలను స్వాధీనం చేసుకుంది. రాన్‌బాక్సి 11, విప్రో 9, రిలయన్సు 7 కంపెనీలను స్వాధీనం చేసుకోగా, హెచ్‌సిఎల్, జుబిలియంట్, ఆర్గానోసిస్, ఐబిఎన్‌లు రెండు కంటే ఎక్కువ కంపెనీలను స్వాధీనం చేసుకున్నాయి.

భారత ఔషధ కంపెనీలు స్వాధీనం చేసుకున్న కంపెనీలలో 90 శాతం, ఐటి రంగంలో 65 శాతం అడ్డంగా కలయిక (హరిజాంటల్) రకానికి చెందినవిగా వున్నాయి (ఒకే సరుకునుత్పత్తి చేస్తున్న రెండు కంపెనీలు కలిసిపోవటాన్ని అడ్డంగా కలయిక అంటారు). భారత కంపెనీలు స్వాధీనం చేసుకున్న మొత్తం విదేశీ కంపెనీల్లో 73 శాతం ఈ రకానికి చెందినవే.

ఇలా అడ్డంగా కలయికల్లో ఎక్కువభాగం బ్రాండ్‌నేమ్‌ల కోసమే జరిగాయి. 563 కేసులను పరిశీలించగా వాటిలో అధికం పాక్షిక ఒప్పందాలుగా వున్నాయి. అంటే మొత్తం కంపెనీని కొనరు. దానికున్న ప్లాంటులలో ఒక దానినో, యితర ఆస్తులనో కొంటారు. ప్లాంటు కొన్నందు వల్ల భారత కంపెనీకి అక్కడ ఉత్పత్తి చేయటానికి వీలవుతుంది. ఇతర ఆస్తుల కొనుగోలు 35 కేసులలో 15 బ్రాండు నేమ్‌ల కోసం జరిగాయి.

బహుళజాతి కంపెనీలకు ఔషధాలపై వున్న పేటెంటు హక్కు ముగిసిన తర్వాత వాటిని భారత కంపెనీలు ఉత్పత్తి చేస్తున్నాయి. వాటిని విదేశాల్లో అమ్ముతున్నాయి. అక్కడ ఈ మందులను అమ్మిన బ్రాండ్‌నేమ్‌లు, ఇతర ఆస్తులను భారత కంపెనీలు కొంటున్నాయి. అక్కడి వైద్యులూ, రోగులూ ఆ బ్రాండ్‌నేమ్‌లకు బాగా అలవాటుపడి వుండటం కారణం. భారత ఔషధ కంపెనీ మాట్రిక్స్‌ను అమెరికా మైలాన్ కంపెనీ కొని, దాని పేరును మైలాన్‌గా మార్చింది. అయినా గతంలో మాట్రిక్స్ అమ్మిన మందుల న్నింటిపైనా ఇప్పటికీ "ఒక మాట్రిక్స్ ఉత్పత్తి" అని ముద్రిస్తున్నదంటే, వ్యాపారాభివృద్ధికి అవి సృష్టించిన ఈ బ్రాండ్‌నేమ్‌లకే అవి ఎంతగా బానిసలయ్యాయో తెలుపుతుంది. ఈ బ్రాండ్ నేమ్‌ల కొనుగోలు ఐటి రంగంలోనూ, రసాయనాల రంగంలోనూ కూడా సాగుతున్నది.

ఏదెలావున్నా యీ పాక్షిక ఒప్పందాలను సరైన అర్థంలో పారిశ్రామిక పెట్టుబడిగా చూడలేము. వాణిజ్య పెట్టుబడిలో భాగంగానే చూడాలి. ప్రత్యేకించి ఫార్మారంగంలో ఈ పెట్టుబడులు భారత కంపెనీలను బలీయం చేయబోవు. వీటి పెరుగుదలను అరికట్టేందుకు బహుళజాతి కంపెనీలు అనేక పద్ధతులను అనుసరిస్తున్నాయి. చౌకధరల మందులతో అమెరికా మార్కెట్టును ముంచెత్తుతున్నాయంటూ యాంటీ డంపింగ్ (కుమ్మరింపు నిరోధ) చట్టంతో న్యాయస్థానంలో వ్యాజ్యాలు వేసాయి. మందుల తయారీలో ఉత్తమ ఉత్పత్తి పద్ధతులు పాటించ లేదంటూ భారత ఔషధ కంపెనీల అమ్మకాలపై ఆంక్షలు విధింపచేసాయి. దీనితో కలిగించిన యిబ్బందులనాసరా చేసుకొని భారత ఔషధ కంపెనీలపై పలు రూపాలలో పట్టును పొందాయి.

వాటిని బంధిత ఉత్పత్తిదారుగానూ, లేదా అనుబంధ కంపెనీగానూ రూపొందిస్తున్నాయి. ఈ రంగంలో భారత్‌కు సాంకేతిక నైపుణ్యమున్న మానవ శక్తి ఏర్పడినా, మేధోపర హక్కులతో వాటిని అదుపు చేస్తున్నాయి.

ఇంతేకాక భారత ఫార్మా కంపెనీలు జనరిక్ మందుల ఉత్పత్తికి అవసరమైన మధ్యంతర రసాయనాలలో 80 శాతం వరకూ విదేశాలనుండి దిగుమతులపైనే ఆధారపడు తున్నాయి. సామ్రాజ్యవాదదేశాల నుండి వచ్చే ఆర్డర్లపైనే ఆధారపడిన ఐటిరంగం స్థితికూడా పరాధీనతే. ఇవి అమెరికాలో కొనుగోలు చేసిన కంపెనీలో శుద్ధ ఐటి కంపెనీలు తక్కువ. అంటే ఈ సమాచార సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు రాదు. దానిని వినియోగించే ఐటిఇఎస్, బిపిఓ కంపెనీలే ఎక్కువ. అసలే ఇది సేవారంగం. కనుక పారిశ్రామిక పెట్టుబడి కాబోదు. ఐటి పరిజ్ఞానం కోసం నిరంతరం ఎదురుచూసే స్థితిలోనే వుంటుంది.

ఇక ఈ భారత విదేశీ పెట్టుబడులు ఎంత వరకూ భారతీయమైనవి అన్న ప్రశ్న వుండనే వుంది. రాన్‌బాక్సీ భారత్‌లో భారత పౌరుడితో (రౌనక్‌సింగ్) స్థాపించబడిన కంపెనీ. ఇది 11 సార్లు విదేశాల్లో పెట్టుబడి పెట్టింది. తర్వాత దీనిని జపానుకు చెందిన దైచీ కంపెనీ స్వాధీనం చేసుకుంది. అమెరికా ఔషధ నియంత్రణ సంస్థ (ఎఫ్‌డిఏ) ఉత్తమ ఉత్పత్తి పద్ధతులు పాటించ లేదంటూ రాన్‌బాక్సీపై ఆంక్షలు పెట్టింది. దీనితో దైచీ మరో అమెరికా కంపెనీతో ఒప్పందం చేసుకుని వాటాలిచ్చింది. అలాగే మాట్రిక్స్‌ను స్థాపించింది తెలుగువాడే (నిమ్మగడ్డ ప్రసాద్). ఇది బెల్జియంకు చెందిన డాక్ ఫార్మాను 235 మిలియను డాలర్లకు 2005లో కొనుగోలు చేసింది. ఆ తర్వాత మాట్రిక్స్‌ను అమెరికా కంపెనీ మైలాన్ కొనివేసింది. విదేశాలలో పెట్టుబడి మదుపు చేసిన భారత కంపెనీలను విదేశీ కంపెనీ కొనివేసినందున వాటి విదేశీ పెట్టుబడికూడా విదేశీ కంపెనీపరమైన దానికివి వుదాహరణలు.

కాగా విదేశాల్లో పెట్టుబడి పెట్టిన భారత కంపెనీలే మిలాఖత్ కంపెనీలుగా వున్నాయి.

**పట్టిక - 3**

**భారత్ నుండి విదేశాలకు వెళ్లిన పెట్టుబడి రంగాల వారిగా 1991-2008**

| రంగం | శాతం |
|---|---|
| ఉత్పాదక రంగం | 42.7 |
| ద్రవ్యసేవలు | 0.7 |
| ద్రవ్యేతర సేవలు | 30.3 |
| వాణిజ్యం | 5.1 |
| ఇతరం | 21.3 |
| మొత్తం | 100 |
| **మి.డా.లో** | **52,999** |

ఆధారం : రిజర్వుబ్యాంకు వార్షిక నివేదికలు

కూర్పు : ప్రేమ చంద్ర అతుకోరల

**పట్టిక - 4**

**కలయిక - స్వాధీనాల కొరకు విదేశాలకు వెళ్లిన భారత పెట్టుబడి (1994 నుండి 2007)**

| ఒప్పందాలు | సంఖ్య | శాతం | $\ Te(కో.రూ.ల్లో) | శాతం |
|---|---|---|---|---|
| చిన్నవి | 176 | 60.5 | 5647 | 2.8 |
| పెద్దవి | 115 | 39.5 | 1,94,609 | 97.2 |
| **మొత్తం** | **291** | **100.0** | **2,00,257** | **100.0** |

కూర్పు : ప్రొ॥ బీనా సరస్వతి

నోట్ : మొత్తం ఒప్పందాల సంఖ్య 528. వాటిలో 55 శాతం ఒప్పందాల సమాచారమిది. మొత్తం విలువలో వీటిది 97 శాతం

పెద్ద స్థాయిలో పెట్టుబడిపెట్టి అమెరికాలో నోవాలిస్ కంపెనీని స్వాధీనం చేసుకున్న బిర్లా గ్రూపు హిండాల్కోలో అదుపు చేయగల పెట్టుబడి బహుళజాతి కంపెనీ కైజర్ కుంది. భారతీ ఏయిర్‌టెల్ 18 ఆఫ్రికా, ఆసియా దేశాలలో టెలీఫోనురంగంలో పెట్టుబడులు పెట్టిన కంపెనీ. సునీల్ మిట్టల్‌కు చెందిన ఈ కంపెనీలో విదేశీ కంపెనీలు ఐబిఎం, ఎరిక్‌సన్‌లకు వాటాలున్నాయి. వాటాలపై ఆదాయమేకాక, ప్రతి కాల్‌పైనా వినియోగదారుడినుండి వచ్చే ఆదాయంనుండి కొంత శాతం తమకు చెల్లించాలన్న నిబంధనతో ఈ కంపెనీలు ఎయిర్‌టెల్‌కు సాంకేతికసేవ లందిస్తున్నాయి. అలాగే బెల్జియం, జర్మనీలలో పెట్టుబడి పెట్టిన సుజలాన్ కంపెనీలో విదేశీ పెట్టుబడులున్నాయి. ఇవి భారత్‌నుండి వెళ్లిన పెట్టుబడిగా కన్పించినప్పటికీ, దీనిని భారత పెట్టుబడిగా పరగణించలేము. విదేశీ ద్రవ్య పెట్టుబడిలో భాగమే.

విదేశీ అదుపుకు ప్రమాణంగా 10 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిని సూత్రంగా ఐఎంఎఫ్ సూచించింది. దీనిని భారత ప్రభుత్వం 2002 నుండి అమలుచేస్తున్నది.

ఒక కంపెనీపై విదేశీ అదుపును తెలుసుకోవటంలో 10 శాతం సూత్రానికి కొన్ని పరిమితులున్నాయి. 10 శాతం కన్నా తక్కువ పెట్టుబడి వున్నా విదేశీ పెట్టుబడి అదుపును కలిగి వుంటుంది. అంతకన్నా ఎక్కువున్నా అదుపు చేయకపోవచ్చు. అదుపు కలిగి వుండటమా లేదా అన్నది విదేశీ పెట్టుబడిదారుకున్న లక్ష్యంపై ఆధారపడి వుంటుంది.

ఏదిఏమైనా 10 శాతం సూత్రం ప్రకారం చూస్తే, విదేశాలకు పెట్టుబడి పంపిన అనేక భారత కంపెనీలు విదేశీ పెట్టుబడి అదుపులో వున్నవిగానే తెలుతుంది. అదుపు కలిగివున్న విదేశీ పెట్టుబడి ప్రయోజనాల కనువుగానే భారత మిలాఖత్ కంపెనీలు విదేశీ పెట్టుబడుల మదుపు వుంటుందనటం నిస్సందేహం.

కా॥ టి.ఎన్. చెప్పినట్లు **"ఇప్పటికే విదేశీ పెట్టుబడి దోపిడీకి నిలయంగా మారిన భారతదేశం ఇతర పరాధీన దేశాలలోకి విదేశీ పెట్టుబడి నేరుగా ప్రవేశించటానికి ఒక స్థావరంగా వినియోగించుకోబడుతున్నది".**

కా॥ టి.ఎన్. పేర్కొన్నట్లు సామ్రాజ్యవాద పెట్టుబడి తరపున విదేశాలలో పెట్టుబడిపెట్టడం (వెనుకబడిన దేశాల ఉత్పాదక రంగంలో) ఒకటికాగా, ఇది కొనసాగిస్తూనే, విదేశీ పెట్టుబడి అవసరాలకు మరింత సమర్థంగా సేవచేయటానికి (ఐటి రంగం) ఉత్తర అమెరికా, పశ్చిమ యూరపులో పెట్టుబడి పెట్టడం రెండవ రకంగా వుంది. అవకాశాన్ని వినియోగించుకుందామని వెళ్లి చేతులు కాల్చుకున్న సందర్భాలూ వున్నాయి.

విదేశాల్లో మదుపు చేస్తున్న "భారతీయ" పెట్టుబడి అన్నదానికున్న పరిమితులను అర్థం చేసుకోవటానికి పెద్ద స్థాయిలో మదుపు చేసిన కొన్ని కంపెనీలను చూద్దాం.

## టాటా మోటార్స్:

దాదాపు మూతపడే స్థితికి చేరిన బ్రిటన్‌లో వున్న అమెరికా ఫోర్డు కంపెనీకి చెందిన జాగ్వార్ లాండ్‌రోవర్‌ను ఇది స్వాధీనం చేసుకుంది. దీనికోసం 230 కోట్ల డాలర్లు వెచ్చించింది. దీనితో లగ్జరీ కార్ల రంగంలో అనేకానేక డిజైన్లు, సాంకేతిక పేటెంటు హక్కులు పొందింది. వీటితో బ్రెజిల్, భారత్, దక్షిణాఫ్రికా, చైనాలలో లగ్జరీ కార్ల అమ్మకాలకు పూనుకుంది. విడిభాగాలు, డిజైన్ల తయారీకి కొన్ని బ్రిటన్, చైనా కంపెనీలతో మిలాఖత్ సంస్థలు పెట్టింది.

**సామ్రాజ్యవాద పెట్టుబడితో పెన వేసుకున్న భారత దళారీ బూర్జువావర్గపు విస్తరణవాద కాంక్షలకు ఈ ఆర్థిక విస్తరణే మూలంగా వుంది. పరాయి పాలకుడు ఏర్పరచిన ప్రభుత్వ యంత్రాంగాన్నీ, పోలీసు, ద్రవ్య వ్యవస్థనూ, న్యాయవ్యవస్థనూ అధికార మార్పిడితో యథాతథంగా స్వీకరించిన భారత పాలకవర్గాలు బ్రిటీషు వలసపాలకుల విస్తరణపూరిత విదేశాంగ విధానాన్ని కూడా వారసత్వంగా పుణికి పుచ్చుకుంది. పొరుగు దేశాలతో సంబంధాలను ఈ విస్తరణవాద కాంక్షలే నిర్దేశిస్తున్నాయి.**

యూరపులో అమ్మకాలు సాగిస్తున్నా దీని దృష్టి అంతా ఆసియా మార్కెట్టుపైనే వుంది. భారత్‌లో ఈ కార్ల అమ్మకాన్ని ప్రారంభించింది. నాలుగు లక్షల కార్ల ఉత్పాదక సామర్థ్యంతో ఆటో రంగంలోని నాలుగు పెద్ద కంపెనీలకూ ఇది పోటీదారు కాలేదన్నది స్పష్టం.

## టాటా స్టీల్స్:

బ్రిటన్‌లో మూతపడ్డ కోరస్ స్టీల్స్‌ను ఇది కొనుగోలు చేయటం పెద్ద సంచలన వార్తయింది. దీనితో ప్రపంచ స్టీలు ఉత్పత్తి దారులలో 59వ స్థానంనుండి 15వ స్థానానికి ఎగబ్రాకింది. 2008 ఆర్థిక మాంద్యం, రష్యా, చైనాల నుండి స్టీలు దిగుమతులతో నడపటం భారమై నష్టాల బారిన పడింది. నష్టాలను పూడ్చుకునేందుకు ఒక విభాగాన్ని అమ్మజూసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. దీనిని మొత్తంగా వదిలించుకునే ప్రయత్నాలలో యిప్పుడుంది.

## ఓ.ఎన్.జి.సి.:

ప్రభుత్వరంగ సంస్థ. భారత కార్పోరేట్లలో అతి పెద్ద సంస్థ. విదేశాలలో పెద్ద యెత్తున పెట్టుబడులు పెట్టింది. దీనికోసం ఓఎన్‌జిసి విదేశ్ లిమిటెడ్ (ఓవిఎల్) అనుబంధ కంపెనీని పెట్టింది. కరీబియన్ దీవులు, ఆఫ్రికా, తూర్పు ఆసియా దేశాలలో చమురు అన్వేషణా, శుద్ధి కార్యకలాపాలలో వుంది. రష్యాలోని సఖాలిన్ దీవులలో చమురు వెలికితీతలో పెట్టుబడులు పెడుతున్నట్లు వార్తలు వచ్చాయి గానీ, తర్వాత రష్యా ప్రభుత్వం అనుమతినివ్వ లేదు. ఒక్క నైజీరియాలో తప్ప మిగిలిన చోట్ల చమురు అన్వేషణా దశ కార్యకలాపాలలో వుంది.

ఇక్కడ గమనించవలసిన ముఖ్యాంశం ఒకటివుంది. భారత్‌లో లభ్యమయ్యే చమురు గల్ఫ్ చమురుతో పోలిస్తే బరువు తక్కువ. రవాణాచార్జీలు తగ్గుతాయి. శుద్ధి తర్వాత పెట్రోలు శాతం ఎక్కువ; ఉప ఉత్పత్తుల శాతం తక్కువ వుంటుంది. దీనితో విదేశీ చమురు కంపెనీల కన్ను దీనిపై పడింది.

భారత్‌లో చమురు నిక్షేపాల అన్వేషణా, వెలికితీత, శుద్ధికి తగిన సాంకేతిక పరిజ్ఞానమూ, సామర్థ్యమూ, ద్రవ్య నిధులు భారత ప్రభుత్వరంగ చమురుసంస్థలకుంది. ఇప్పటివరకూ జరిగిన అన్వేషణతో (ఓఎన్‌జిసి, ఇస్రోలు) చమురు నిక్షేపాలకు అవకాశాలుగల ప్రాంతాలను గుర్తించి వున్నారు. వీటిని కొనసాగించి దేశ అవసరాలకు చమురు వెలికితీత పని ప్రభుత్వరంగ సంస్థలు చేపడతాయని ఆశిస్తారు.

కానీ చమురు అన్వేషణా, వెలికితీతలకు నిధులు కొరతగా వున్నాయంటూ విదేశీ చమురు కంపెనీలకు అనుమతి నిచ్చింది. ఓఎన్‌జిసి వద్ద నున్న నిధులను విదేశాలకు తరలించింది. కేజిబేసిన్‌లో రిలయన్స్ గ్యాసు ఉదంతంతో ఈ విధానంతో దేశానికి జరిగిన నష్టమంతా వెలుగులోకి వచ్చింది.

ఓఎన్‌జిసి వద్దనున్న సమాచారాన్ని ఉన్నతాధికారికి లంచమిచ్చి తస్కరించి, దాని సాయంతో అవకాశాలెక్కువున్న బ్లాకులకే టెండర్లు వేసి, వాటినే పొందటం; తప్పుడు లెక్కలతో ఎక్కువ ఖర్చులు చూపి సహజవాయువుకు ఎక్కువ ధర కోరటం, అంతర్జాతీయ మార్కెట్టు ధర కంటే రెట్టింపు ధరను పొందటం; వీటన్నింటికీ వక్ర మార్గంలో అనుమతులు సంపాదించిన రిలయన్సు తర్వాత విదేశీ కంపెనీ బ్రిటీషుగ్యాసు వాటాను పెంచటం; ఇవన్నీ బయటపడటంతో గ్యాసు వెలికితీత ఆపి, ప్రభుత్వ వాటా గ్యాసు యివ్వకుండా, ఆధారిత పరిశ్రమలను ఎండగట్టి ప్రభుత్వాన్ని బ్లాక్‌మెయిల్ చేసిన నాటకం- ఇదంతా గమనిస్తే, భారత బడా బూర్జువా

వర్గమూ, భారత ప్రభుత్వమూ కలిసి భారత సహజవనరులను విదేశీ ద్రవ్యపెట్టుబడికి కారు చౌకగా అప్పగించి, ఆ భారమంతా భారత ప్రజలపై మోపిన తీరు అర్థమౌతుంది.

మన సామర్థ్యాన్నీ, ఆర్థిక వనరులనూ బయటెక్కడో ఫలితం వస్తుందన్న గ్యారంటీ లేని చోట వ్యయం చేయించి, మన చమురు వనరుల వినియోగానికి నిధులు లేవంటూ, విదేశీ పెట్టుబడికి ఎర్రతివాచీ పరిచిన భారత ప్రభుత్వం తానే సామ్రాజ్యవాద పెట్టుబడికి దళారీగా వ్యవహరించింది. విదేశీ పెట్టుబడికి భారత పాలకవర్గాల లొంగుబాటుకది తార్కాణం.

**"విదేశీ గుత్త పెట్టుబడి, విదేశీ పారిశ్రామికవేత్తలు ఎలా ఆడిస్తే అలా ఆటలాడే తోలుబొమ్మ పాత్రను భారత దళారీ బూర్జువా వర్గం చక్కగా నిర్వహించగలుగుతుంది" (టి.ఎన్).**

ఇక్కడొక ప్రశ్న తలెత్తవచ్చు. సామ్రాజ్యవాద పెట్టుబడితో పెనవేసుకున్న బడా బూర్జువా వర్గాన్ని వదలిపెడితే, మిగిలిన భారత పెట్టుబడి దారుల పరిస్థితి ఏమిటి? వీరు పెరగలేరా? సామ్రాజ్యవాద పెట్టుబడితో సంబంధం లేకుండా విదేశాలలోకి విస్తరించలేరా?

పెట్టుబడి సంబంధాలు పెరిగి, విస్తరించేందుకు దేశంలో అవకాశాలున్నాయి. అవి ఎవరికి అందాలని నిర్దేశిస్తున్నది మాత్రం భారత ప్రభుత్వంద్వారా దానిని నడిపిస్తున్న బడా బూర్జువావర్గమూ సామ్రాజ్యవాదులు అయి నప్పటికీ చిన్న, మధ్య తరహా పరిశ్రమలు నెలకొంటున్నాయి. ఇవి మరింత పెరగకుండా వాటిని అసమాన పోటీకి గురిచేసి బడా బూర్జువా వర్గమూ, సామ్రాజ్యవాదమూ రంగం నుండి తప్పిస్తున్నాయి. లేదా తమ అర్థ బలంతో వాటిని తమ అదుపులోకి తెచ్చుకుంటున్నాయి. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు నష్టపోయి మూత లేదా బడా బూర్జువాల చేతుల్లోకి వెళ్లటమూ దేశంలోపల రోజూ జరుగుతున్నదే. ఐటి రంగం లోనూ, ఫార్మా రంగంలోనూ సిమెంటు రంగం లోనూ ఇలా పెరిగిన కంపెనీలను విదేశీ పెట్టుబడి స్వాధీనం చేసుకున్నది; చేసుకుంటున్నది. ఇదే పరిస్థితి విదేశాలకు వెళ్లే భారత చిన్న, మధ్య తరహా పరిశ్రమలకూ వర్తిస్తుంది. ఐటి రంగం లోనూ, ఫార్మారంగంలోనూ ఈ కంపెనీలను విదేశీ పెట్టుబడి స్వాధీనం చేసుకుంది; అదుపులో పెట్టుకుంది. కనుకనే భారతదేశంలో స్వతంత్ర పెట్టుబడిదారీ విధాన అభివృద్ధికి సామ్రాజ్యవాదం ప్రధాన అడ్డంకిగా వుంది. మరొక అడ్డంకి కొనసాగుతున్న ఫ్యూడలు సంబంధాలు.

కనుక సామ్రాజ్యవాద పెట్టుబడితో పెన వేసుకున్న భారత దళారీ బూర్జువావర్గపు విస్తరణవాద కాంక్షలకు ఈ ఆర్థిక విస్తరణే మూలంగా వుంది. పరాయి పాలకుడు ఏర్పరచిన ప్రభుత్వ యంత్రాంగాన్నీ, పోలీసు, ద్రవ్య వ్యవస్థనూ, న్యాయవ్యవస్థనూ అధికార మార్పిడితో యథాతథంగా స్వీకరించిన భారత పాలకవర్గాలు బ్రిటీషు వలసపాలకుల విస్తరణపూరిత విదేశాంగ విధానాన్ని కూడా వారసత్వంగా పుణికిపుచ్చుకుంది. పొరుగు దేశాలతో సంబంధాలను ఈ విస్తరణవాద కాంక్షలే నిర్దేశిస్తున్నాయి.

బంగ్లాదేశ్‌లో ప్రమాదకర పరిణామాలకు ఇవెలా దారితీసాయో కా॥ టి.ఎన్. వివరించారు. దక్షిణాసియా దేశాల ప్రాంతీయ సహకార సంస్థ (సార్క్)లో ఆధిపత్యం కోసం భారత ప్రభుత్వం చేసిన ప్రతిపాదనను దక్షిణాసియా దేశాలు అనుమానంగా చూడటానికి భారత విస్తరణవాద కాంక్షలే కారణం.

నేపాల్ అంతరంగిక వ్యవహారాలలో భారత పాలకులు నిరంతరం జోక్యం చేసుకుంటున్నారు.

> ***మన సామర్థ్యాన్నీ, ఆర్థిక వనరులనూ బయటెక్కడో ఫలితం వస్తుందన్న గ్యారంటీ లేనిచోట వ్యయం చేయించి, మన చమురు వనరుల వినియోగానికి నిధులు లేవంటూ, విదేశీ పెట్టుబడికి ఎర్రతివాచీ పరిచిన భారత ప్రభుత్వం తానే సామ్రాజ్యవాద పెట్టుబడికి దళారీగా వ్యవహరించింది. విదేశీ పెట్టుబడికి భారత పాలకవర్గాల లొంగుబాటుకది తార్కాణం.***

ప్రజలు వ్యతిరేకిస్తున్న రాచరిక పాలనను సమర్థించారు. ప్రజాపోరాటాల ఫలితంగా రాచరిక పాలన ముగిసి, ఎన్నికల ద్వారా ప్రభుత్వం ఏర్పడిన సందర్భంలో, తన కనుకూల ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు నేపాలీ కాంగ్రెసు ద్వారా అన్ని రకాల ప్రయత్నాలు చేసింది. ఎన్నికయిన పార్లమెంటు రాజ్యాంగ చట్టాన్ని రూపొందించుకొనటంలో అనేక ఒడిదుడుకులకు లోనయిన సమయంలో నేపాల్‌కు సరుకుల సరఫరాను నెలలపాటు ఆపివేసి, నిత్యావసర సరుకుల కొరతను సృష్టించింది. భారత ప్రభుత్వ జోక్యాన్ని నేపాల్ ప్రజలు ఈనాటికీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

## ప్రమాదకర పరిణామాలు

నూతన ఆర్థిక విధానాల తర్వాత భారత బడా బూర్జువావర్గం సామ్రాజ్యవాద పెట్టుబడితో పెనవేసుకోవటం మరింతగా పెరగటంతో పాటుగా దాని విస్తరణవాద కాంక్షలు కూడా సామ్రాజ్యవాదుల ఆధిపత్య వ్యూహంతో పెన వేసుకుపోయాయి. అమెరికా సామ్రాజ్యవాదంతో వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం దీని కుదాహరణ.

ప్రపంచ వాణిజ్యం 70 శాతం రవాణా సాగే మలక్కా జలసంధి రక్షణ సామ్రాజ్యవాదానికీ కీలకమైనది. ఇక్కడి ఆర్థిక ప్రయోజనాల రక్షణకు అది తన నావికా సైన్యాన్ని డిగోగార్షియాలోనూ, ఫిలిప్పైన్స్‌లోనూ మోహరించింది. హిందూ మహా సముద్రంలో ఈ వాణిజ్య ప్రయోజనాల కాపలాలో భారత నౌకా సైన్యానికి భాగమిచ్చింది అమెరికా సామ్రాజ్యవాదం. వ్యూహాత్మక భాగస్వామ్యపు ఒప్పందం కొనసాగింపుగా సాగిన అంగీకార పత్రంలో అమెరికా సైన్యం భారత్‌లోని సైనిక స్థావరాలనూ, రేవులను వినియోగించుకునే ఒప్పందం జరిగింది. దీనిలో భాగంగా అమెరికా, ఫ్రాన్సు, జపాన్‌లలో నావికా సైన్య విన్యాసాలు సాగుతున్నాయి.

హిందూ మహాసముద్రంలో భారత నౌకా దళం తిరుగులేని శక్తిగా రూపొందింది; భారత్ ఒక ప్రపంచ శక్తిగా రూపొందింది; ఈ ప్రాంతంలో శాంతి పరిరక్షణకు భారతదేశం బాధ్యత వహిస్తుంది. – భారతపాలకులనుండి తరచుగా వినిపిస్తున్న ప్రకటనల అర్థం స్పష్టంగానే వుంది.

సామ్రాజ్యవాదుల కనుసన్నలలో, వారి సేవలో తన విస్తరణవాద కాంక్షలను నెరవేర్చు కోవాలని భారత పాలక వర్గాలువ్విళ్లూరు తున్నాయి. ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్‌లపై దురాక్రమణను ఖండించకపోగా, అక్కడ జరుగుతున్న పునర్ని ర్మాణమనే దానిలో నిర్మాణ కాంట్రాక్టులకోసం సామ్రాజ్యవాదులను దేబిరిస్తున్నది. హిందూకుష్ పర్వత సానువుల్లోని బంగారు, రాగి గనులను అమెరికా కొల్లగొడుతుంటే, దానిలో వాటాకోసం ఇతర సామ్రాజ్యవాదులు పెనుగులాడుతుంటే, అక్కడి చమురు ఉత్పత్తి కేంద్రాల రక్షణకు కిరాయి సిబ్బందిగా భారత పౌరులను సరఫరా చేస్తున్నది. బయటికి మాత్రం ఆఫ్ఘనిస్తాన్‌లో శాంతి ప్రక్రియలో భారత్ సముచిత పాత్ర నిర్వహించటం కొనసాగుతున్నదని బీరాలు పలుకుతుంది.

భారత పాలక వర్గాల విస్తరణవాద కాంక్షల వికృత రూపమిది.

**రిఫరెన్సులు:**


1. అంక్టాడ్– వరల్డ్ ఇన్‌వెస్ట్‌మెంట్ రిపోర్టు 2010.
2. రిజర్వుబ్యాంకు– బుల్లెటన్స్, వార్షిక నివేదికలు.
3. ప్రేమచంద్ర అతుకొరల– ఔట్‌వర్డ్ ఎఫ్ డి ఐ ఇన్ ఇండియా; ఆసియన్ డెవలెప్ మెంట్ రివ్యూ సం 26, సం-2, 2009, ఆసియా డెవలెప్‌మెంట్ బ్యాంక్ ప్రచురణ.
4. ప్రొ. బీనా సరస్వతి– క్రాస్ బోర్డర్ మెర్జర్స్ అండ్ అక్విజిషన్స్ ఇన్ ఇండియా–ఏన్ ఎనాలిసిస్, థీసిస్ ఫర్ పి హెచ్ డి, జెఎన్‌టియు, ఢిల్లీ.

# ఉత్తరప్రదేశ్ కస్‌గంజ్‌లో మతతత్వవాదుల దాడులు

**2018** జనవరి 26 నుండి వరుసగా రెండురోజులపాటు, ఉత్తరప్రదేశ్ రాష్ట్రం - కొత్వాల్ ప్రాంతంలోని కస్‌గంజ్ మత కలహాలతో దద్దరిల్లింది. మతసామరస్యానికి, శాంతికి పేరెన్నికగన్న ఆ పట్టణం, అకస్మాత్తుగా ఈ ఘర్షణలలోకి నెట్టబడింది. విహెచ్‌పికి చెందిన వ్యక్తిగా చెప్పబడే చందన్‌గుప్తా ఈ కలహాలలో మరణించాడు.

ఈ సంఘటనకు సంబంధించి స్థానిక ప్రజలు వివరించిన ప్రకారం వాస్తవాలు ఇలా వున్నాయి :

ఆరోజు గణతంత్ర దినోత్సవం. ఓ ప్రాథమిక పాఠశాల ప్రక్కనే వున్న వీర్ అబ్దుల్ హమీద్ చౌక్ వద్ద ప్రతి సం॥రం లాగే, ఈసారి కూడా కస్‌గంజ్ ప్రజలు జెండా ఆవిష్కరణ వేడుకను నిర్వహించారు. ఈ సం॥ ఆ వేడుక చాలా ఆర్భాటంగా జరిపారు. ఈ వేడుకలు జరుగుతూండగా, మోటారు సైకిళ్ళపై చేతుల్లో త్రివర్ణ, కాషాయవర్ణ పతాకాలను పట్టుకొని, నినాదాలు చేస్తూ వందమందిపైగా యువకులు అక్కడికి వచ్చారు. వారు జెండా ఆవిష్కరణ వేడుకలు జరుగుతున్న ఇరుకైన సందులగుండా తమకు దోవ వదలాలని కోరారు. ఈ వేడుక నిర్వాహకులు మోటారుసైకిళ్ళపై వచ్చిన యువకులతో, 'ఇది ప్రధాన రహదారి కాద'ని, పైగా వేడుకలు జరుగుతూ వున్నాయని చెపుతూ మరో మార్గం గుండా వెళ్ళవలసిందిగా విజ్ఞప్తి చేశారు. కానీ వారు ఈ విజ్ఞప్తిని లెక్కచేయకుండా ముస్లిమ్‌లకు వ్యతిరేకంగా గాయపరిచే దూషణలు చేస్తూ, వారిని పాకిస్తాన్ వెళ్ళిపొమ్మని నినాదాలు చేశారు. ఇది ఉద్రిక్తతలను రగిలించి ఇరుమతాలకు చెందిన ప్రజల మధ్య ఘర్షణకు దోవతీసింది. దాడులకు పాల్పడినవారు పలు వాహనాలను ధ్వంసం చేశారు. స్థానికంగా వున్న మసీదును తగులబెట్టటానికి ప్రయత్నించారు. ఆ ప్రాంతంలోని ఓ ప్రముఖ ముస్లిమ్ వ్యాపారస్తుని రెండు అంతస్తుల భవనంపై దాడిచేసి, ఆ ఇంటిని లూటీ చేశారు.

జనవరి 28వ తేదీ ఉదయం చందన్‌గుప్తా అంత్యక్రియలు పూర్తయ్యాయి. దీని తర్వాత నిముషాల వ్యవధిలోనే ఒక గుంపు వచ్చిపడి షాపులను, బస్సులను తగులబెట్టింది. చేష్టలుడిగిన పోలీసుల వైఖరితో శాంతికాముక ప్రజానీకం నిస్సహాయంగా వుండిపోయారు. ఆగ్రా ఇన్‌స్పెక్టర్ జనరల్ డి.కె. ఠాకూర్ చెప్పిన వివరాల ప్రకారం ముస్లిములకు చెందిన 99 శాతం షాపులు తగులబెట్టబడ్డాయి.

పోలీసులు కర్ఫ్యూ విధించారు. ఇంటర్‌నెట్ సేవలను తాత్కాలికంగా నిలిపివేశారు. పిఏసి, ఆర్‌ఏఎఫ్ బలగాలను దింపి పట్టణంలో కవాతు నిర్వహింపజేశారు. జనవరి 30 నాటికి పోలీసులు 112 మందిని అదుపులోకి తీసుకొని వివిధ నేర విభాగాల క్రింద వారిపై కేసు నమోదు చేశారు. వ్యాపారులు, రాజకీయ పార్టీల నాయకులు ఇరు మతాలకు చెందిన పెద్దలు, సభ్యులు శాంతి సమావేశాలు నిర్వహించి, శాంతి, మత సామరస్యాలను పునరుద్ధరించేందుకు ప్రతిన దీసుకున్న తర్వాత సాధారణ పరిస్థితి నెలకొంది.

అయితే, ఈ మత కలహాలకు కారణమైన అసలు నేరస్తులను అరెస్టుచేసి, తగినవిధంగా శిక్షించగల్గుతారా అనేది ప్రశ్న. ఇది - ఉత్తర ప్రదేశ్‌లోనూ, కేంద్రంలోనూ బిజెపి అధికారంలో వుండటం వలన మాత్రమేగాక, సంఘ్ పరివార్‌కు చెందిన ప్రముఖ నాయకులు కొందరు చేస్తున్న నిర్దిష్ట వ్యాఖ్యానాలు కూడా ఓ ప్రమాదకర ధోరణికి దోవతీస్తున్నాయి.

బిజెపి సీనియర్ నాయకుడైన గిరిరాజ్‌సింగ్ ఇలా వ్యాఖ్యానించాడు : "మరణించిన వ్యక్తి చందన్ గుప్తా కాకుండా మహమ్మద్ ఇస్మాయిల్ అయి వుంటే, ప్రచార మాధ్యమాలలో చర్చలు భిన్నంగా జరిగి వుండేవి. మన ఆలోచనా ధోరణిని మార్చుకోవలసి వుంది." భారతదేశంలో హిందూ మతతత్వ శక్తులు పథకం ప్రకారం సాగించిన దౌర్జన్యపూరిత దాడులలో అమాయక ముస్లిములు, ఇతర అల్పసంఖ్యాకులు, దళితులు, హేతువాదులు, ప్రగతిశీల శక్తులు బాధితులుగా వున్నారనే విషయం ఈ నాయకునికి తెలుసు. కస్‌గంజ్‌లో చందన్‌గుప్తా మరణాన్ని ఎవరూ ఆహ్వానించరు; అందుకు ఎవరూ సంతోషించరు. అయితే, హిందూ మతతత్వశక్తులు రగిలించిన మత ఉన్మాదానికి అతను ఒక బాధితుడనేది చేదు వాస్తవం.

విహెచ్‌పి నాయకులు మరియు ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంలో ఆహార శుద్ధి ఉపమంత్రి శ్రీమతి నిరంజన్ జ్యోతి ఈవిధంగా మాట్లాడారు : "కొందరు పాకిస్తాన్ అనుకూలురు, జాతీయ జెండాను అంగీకరించటంలేదు. వారు పాకిస్తాన్ జెండాను మాత్రమే గౌరవిస్తారు; పాకిస్థాన్ వర్ధిల్లాలని నినదిస్తారు." బిజెపి పార్లమెంటు సభ్యులు వినయ్ కథియార్ ఇలా వ్యాఖ్యానించారు : "పాకిస్తాన్‌కు మద్దతుగా నిలిచే కొందరు చొరబాటుదారులున్నారు. త్రివర్ణ పతాకాన్ని నిరాకరించటంలో వారు ఎంతదాకైనా వెళ్తారు. వారితో కఠినంగా వ్యవహరించాలి". 2014 నాటి రామజన్మభూమి ప్రచారంలో ముస్లిములకు వ్యతిరేకగా తన ద్వేషపూరిత ఉపన్యాసాల ద్వారా వెలుగులోకి వచ్చిన నిరంజన్ జ్యోతి ఇలా మాట్లాడింది : "ఢిల్లీ ప్రజలు తమకు రాముని అనుయాయుల పాలన కావాలో, అక్రమ సంతాన పాలన కావాలో నిర్ణయించుకోవాలి". ఈ ప్రకటనకు తర్వాత ఆమె క్షమాపణ చెప్పారు.

విహెచ్‌పి, ఏబివిపి మూకలు సాగించిన మతోన్మాదపూరిత చర్యలకు బిజెపి ఉన్నత స్థాయి నాయకుల నుండి ఈ తరహా సంపూర్ణ సమర్ధన చేకూరుతుండగా, మత కలహాలపై ఎలాంటి దర్యాప్తు జరుగుతుందో, ఏవిధమైన న్యాయం జరుగుతుందో ఎవరైనా అర్థం చేసుకో గలరు. హిందూ మతతత్వశక్తుల బలగాలు కేవలం వారి నాయకత్వ భావజాలాన్ని, రాజకీయాలను, ప్రతిబింబిస్తున్నారనేది వాస్తవం. కనుక హిందూ మతతత్వశక్తుల భావజాలానికి, రాజకీయాలకు, చర్యలకు వ్యతిరేకంగా కూలంకషంగా, చివరికంటా పోరాడాల్సిన కర్తవ్యం ప్రజాతంత్ర శక్తుల ముందున్నది.

*భూమిమీద, ఫ్యాక్టరీల మీద స్వంత స్వామ్యాన్ని రద్దు చేయడం. ఇది, ఇది మాత్రమే స్త్రీ యొక్క సంపూర్ణ యదార్థ విమోచనకు, అల్పిష్టి వ్యష్టి గృహ నిర్వహణ నుండి భారీ స్థాయి సామాజికీకృత గృహ సేవలకు జరిగే పరివర్తన ద్వారా "గృహ బానిసత్వం నుండి స్త్రీ విముక్తికి దారి ఏర్పరుస్తుంది.*

**– లెనిన్** (1921లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా)

# కోరేగావ్ — దళితుల సుదీర్ఘ పోరాటం

**2017** డిసెంబర్ చివరలో, 2018 జనవరి 1న మహారాష్ట్రలోని పూణే జిల్లా-భీమా-కోరేగావ్ గ్రామంలోను, పరిసర ప్రాంతాలలో హిందూమతతత్వ శక్తులకు దళిత ప్రజానీకానికి మధ్య హింసాత్మక సంఘర్షణలు జరిగాయి. ఈ పరిణామాల క్రమం క్లుప్తంగా ఈ విధంగా వుంది:

1818 జనవరి 1న పీష్వా బాజీరావు-2ను ఓడించిన యుద్ధానికి గుర్తుగా, ఈ యుద్ధంలో మరణించిన బ్రిటిష్ సైన్యం (వీరిలో 500 మంది మహర్లున్నారు) స్మృతిలో బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ 200 సం॥ల క్రితం 1818లో భీమా-కోరేగావ్ గ్రామంలో ఓ, 'రణస్థంభాన్ని' నిర్మించింది. పీష్వా ఆధిపత్యాన్ని అంతమొందించిన ఈ యుద్ధానికి స్మారకంగా వున్న 'రణస్థంభాన్ని' 1917 జనవరి ఒకటో తేదీన డా॥బి.ఆర్. అంబేద్కర్ సందర్శించి, రణస్థంభాన్ని దళితజాతి గర్వించదగిన స్మృతి చిహ్నంగా ప్రకటించాడు. ఆనాటి నుండి ప్రతి సం॥రమూ జనవరి ఒకటో తేదీనాడు దేశంలోని వివిధ ప్రాంతాలనుండి దళితులు హాజరై ఇక్కడ సమ్మేళనం జరుపుకోవటం ఆనవాయితీగా మారింది. 1818 నాటి యుద్ధం జరిగి రెండువందల సం॥లు నిండుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని రణస్థంభం వద్ద భారీ సమ్మేళనానికి నిర్వాహకులు ఈ ఏడాది విస్తృత సన్నాహాలు చేశారు.

2017 డిసెంబర్ 27న భీమా-కోరేగావ్‌కు దగ్గరలోని వధు బ్రదక్ గ్రామంలో గోవింద్ మహర్ సమాధివద్ద కొందరు ఒక శిలాఫలకాన్ని ప్రతిష్టించారు. 1689లో మొఘలుల చేతుల్లో చంపబడిన శంభాజీ వారసుడైన శివాజీ కుమారుని యొక్క అంతిమ సంస్కారాలను గోవింద్ మహర్ నిర్వహించాడని విశ్వసిస్తున్నట్లుగా ఆ ఫలకంలో పేర్కొన్నారు. శంభాజీ వారసుని అంతిమ సంస్కారాలను 'మహర్లు' కాకుండా 'మరాఠా'లే నిర్వహించారని నమ్ముతున్న కొంత మంది మరాఠాలు దీనిని జీర్ణించుకోలేక పోయారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఇరుపక్షాల వారూ తమతమ ఫిర్యాదులను అందజేశారు. అయితే, మరాఠాలకు - దళితులకు నడుమ విభేధాలను పెంచే అవకాశంకోసం ఎదురు చూస్తున్న హిందూమతతత్వశక్తులు, మరాఠాలకు -దళితులకు నడుమ ఉద్రిక్తతలను, కలహాలను రగిలించటానికి ఈ సంఘటనను ఒక నిప్పురవ్వ లాగా ఉపయోగించుకున్నాయి.

2017 డిసెంబర్ 31న, పూనేలోని 'శనివారవాడ ఫోర్టు'వద్ద దళితులు 'ఎల్గార్ పరిషత్ (సమరశంఖం)ను నిర్వహించారు. 1818లో పీష్వాబాజీరావు-2ను యుద్ధంలో ఓడించిన బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ సైన్యం ఈ కోటలోనే బసచేయడం ఈ ప్రాంత విశిష్టత. జిగ్నేష్ మేవాని, రాధికావేముల, భీమ్ ఆర్మీకి చెందిన విజయ్‌రతన్ మరియు కబీర్ కళామంచ్‌కు చెందిన కళాకారులతో సహా అనేకమంది ప్రముఖ దళిత నాయకులు ఈ ఎల్గార్ పరిషత్‌కు హాజరయ్యారు. దళిత శక్తులన్నీ ఐక్యంగా వున్నాయని, తమపై జరిగే దాడులు, అత్యాచారాలను ఇంకెంత మాత్రమూ సహించబోమనే గట్టి సందేశాన్ని ఇవ్వటానికి ఇది సరైన స్థలంగా భావించిన దళిత నాయకులు సమ్మేళనానికి ఈ ప్రదేశాన్ని ఎంచుకున్నారు. ఉపన్యాసాలను, తమ విమర్శలను హిందూమతతత్వశక్తులపై, వారి ప్రభుత్వాలపై ఎక్కుపెట్టారు.

2018 జనవరి 1న రాళ్ళు, గాజుసీసాలు, ఇనుపరాడ్లు, కర్రలు చేబూనిన, కాషాయ జెండాలతోనున్న వెయ్యిమంది గుంపు భీమా-కోరేగావ్‌కు దళితులను చేరవేస్తున్న బస్సులపై దాడిచేశారు. వారు గోవిందమహర్ సమాధిని ధ్వంసం చేశారు. పది వాహనాలను తగుల బెట్టారు. నాలుగు గంటలపైగా హింస కొనసాగింది. ఈ దాడులలో 28 సం॥ల వ్యక్తి మరణించాడు. అక్కడేవున్న పాలనాధికారులు, పోలీసులు మౌన ప్రేక్షకుల్లా చూస్తుండిపోయారు.

దళితులపై దాడులు ఇక్కడికే పరిమితమైన స్వభావంకలవి కావు; హిందూ మతతత్వశక్తుల భారీ కుట్రలో ఇవి ఒక భాగం మాత్రమే. దళిత ప్రజానీకంపై దాడులు చేసి, మతతత్వ మంటలు రేపటంలో సిద్ధహస్తులైన, హిందూమతతత్వ శక్తులుగా పేరెన్నికగన్న సింగ్లి జిల్లాకు చెందిన శివప్రతిష్టాన్ హిందూస్థాన్‌కు చెందిన మనోహర్ శంభాజీ భిడే, బిజెపికి చెందిన మిలంద్ ఎక్బోటే, పూనేకి చెందిన సంస్థాన్ హిందూ అగడి మొదలైన వారంతా ఈ దాడులకు నాయకత్వం వహించారు. "భీమా - కోరేగావ్ హింస హిందూ మతతత్వ సంస్థలు సాగించిన చర్యలే. మహర్లకు(దళితులకు), మరాఠాలకు, నడుమ ఉద్రిక్తతలను రగిలించే పథకంతో సాగించినవే"నని 'మరాఠీ శంభాజీ బ్రిగేడ్'కు చెందిన సతీష్‌షిండే పేర్కొన్నారు.

భీమా - కోరేగావ్ ప్రాంతంలో గొడవలు, హింస నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వంయొక్క పట్టనితనం, నిర్లక్ష్యవైఖరులను నిరసిస్తూ డా॥బి.ఆర్. అంబేద్కర్ మనవడు మరియు 'భారిపా బహుజన్ మహాసంఘ్ పార్టీ' నాయకుడు ప్రకాష్ అంబేద్కర్, 'మరాఠా శంభాజీ బ్రిగేడ్'తో సహ వివిధ మరాఠా సంస్థలు 2018 జనవరి 3వ తేదీన బంద్‌కు పిలుపునిచ్చారు. దళితుల - మరాఠాల నడుమ తగవులను పెంచేందుకు హిందూమతతత్వశక్తుల కుట్ర ఫలితంగా ఈ హింస, అల్లర్లు జరగగా సంయుక్తంగా బంద్ పిలుపు నిచ్చినవారు దళితుల, మరాఠాల నడుమ ఐక్యతకోసం కృషిచేయాలని, హిందూ మతతత్వశక్తులకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాన్ని ఎక్కుపెట్టాలని దిశానిర్దేశంచేయటం గుర్తించదగినది. బంద్ పిలుపుకు మహారాష్ట్ర ప్రజానీకం చాలా సానుకూలంగా స్పందించారు. ముంబైలోని అనేక ప్రాంతాలలో జనజీవనం స్తంభించింది. పాఠశాలలన్నింటికీ ముందుగానే శలవు ప్రకటించారు. ప్రదర్శనకారులు నగరాన్ని, ప్రధాన రహదారులను, కీలక మార్గాలన్నింటినీ దిగ్బంధించారు. వేలాది షాపులు, హోటళ్ళు మూతబడ్డాయి. ఆటోలు, ట్యాక్సీలు, మెట్రో సర్వీసులు ఇతర వాహన రవాణా సదుపాయా లన్నీ నిలిచిపోయాయి. ఆందోళనకారులు బృహన్ ముంబాయ్ ఎలక్ట్రిక సప్లై అండ్ ట్రాన్స్‌పోర్టు (బెస్ట్) సేవలను నిలిపివేశారు. పూనే, థానే, కొల్హాపూర్, నాగపూర్ వంటి పలు నగరాలలో కూడా బంద్ జరిగింది.

గత మూడున్నర సం॥లలో దళితులపై దాడులు, అత్యాచారాలు తీవ్రమయ్యాయి. కేంద్రంలోనూ, అత్యధిక రాష్ట్రాలలోనూ బిజెపి అధికారంలోకి రావటంతో, దళితులపై, మైనారిటీలపై మరింత దూకుడుగా, మొరటుగా హంతక దాడులు సాగించేందుకు తమకు మరింత ప్రోత్సాహం లభించినట్లుగా కులతత్వ వాద, హిందూమతతత్వశక్తులు భావిస్తున్నాయి. వారు గో సంరక్షకుల పేరుతో, భారతీయ సంస్కృతి, మంచి ఆహార అలవాట్లు, వేషధారణ నియమాలు, హిందూమతం తదితర అనేక ముసుగులు, సాకులతో ఈ దాడులన్నింటినీ సమర్ధించుకుంటున్నారు. గుజరాత్‌లో జరిగిన దాడులవంటి అసంఖ్యాక దాడులను మనం గుజరాత్, యుపి, ఎంపి, కర్నాటక, రాజస్థాన్, హర్యానా, మొదలైన అనేక చోట్ల చూశాం. ప్రభుత్వాలన్నీ ఈ సందర్భాలన్నింట్లో మౌన ప్రేక్షకులుగా వుండటమేగాక, దాడులకు పాల్పడిన వారిపై కంటే బాధితులపైనే అధికంగా చర్యలు తీసుకుంటున్నాయి.

దేశంలో దళితులపై జరుగుతున్న దాడులకు, అత్యాచారాలకు వ్యతిరేకంగా నిరసనలు,

**(తరువాయి 20వ పేజీలో)**

(2వ పేజీ తరువాయి)

ఇక, మూడున్నర నెలల క్రితమే ఎన్నికల 'శంఖారావం' పూరించి 'నవరత్నాల'తో పాదయాత్ర చేపట్టిన వైయస్సార్‌సీపీ అధినేత జగన్, రాష్ట్రానికి ప్రత్యేకహోదా పట్ల తామొక్కరమే చిత్తశుద్ధిగా వున్నామని, ప్యాకేజీ అంటూ, తిరిగి హోదా అంటూ తెలుగుదేశం దొంగాటకమాడుతోందని తీవ్ర విమర్శలు చేస్తున్నాడు. బడ్జెట్ సమావేశాల చివరిరోజు ఏప్రిల్ 6న తమ పార్టీకి చెందిన పార్లమెంటు సభ్యులందరూ ప్రత్యేకహోదా డిమాండ్‌పై రాజీనామా చేస్తారని ప్రకటించి, తనతో కలిసి రావాలని తెలుగుదేశం పార్టీకి సవాల్ విసురుతున్నాడు. బిజెపి-తెలుగుదేశంల నడుమ కొనసాగుతున్న వైరుధ్యాలనుపయోగించుకొని రాష్ట్రప్రభుత్వంపై ఎక్కుపెడుతూ, కేంద్రంతో సున్నితంగా వ్యవహరిస్తూ బిజెపికి దగ్గరై రానున్న అసెంబ్లీ ఎన్నికలలో రాష్ట్రంలో అధికారంలోకి రావటమే లక్ష్యంగా జగన్ నాయకత్వంలోని వైయస్సార్‌సీపీ వ్యవహరిస్తోంది.

రాష్ట్రంలో శాసనసభసభ్యుల పరంగా శూన్యమైన కాంగ్రెస్‌పార్టీ, ఇదే అదనుగా తిరిగి రంగంలోకి వచ్చి ప్రత్యేకహోదా డిమాండ్ సాధన కోసం ఆందోళనా కార్యక్రమాలకు పిలుపునిచ్చింది. విభజనచట్టంలో ప్రత్యేకహోదాను చేర్చకుండా, పార్లమెంటులో ప్రధాని హామీకే దానిని పరిమితం చేసిన కాంగ్రెస్‌పార్టీ, రాహుల్‌గాంధీ నేతృత్వంలో రానున్న ఎన్నికలలో కేంద్రంలో తాము అధికారంలోకి వస్తే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా కల్పిస్తామంటూ మరోమారు వంచనకు పాల్పడుతోంది.

ఏమైనా, 2019 రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్ని దృష్టిలో వుంచుకొని మరోమారు 'ప్రత్యేకహోదా' చుట్టూ ప్రజల ఆలోచనలు మళ్ళించేందుకు పాలక పార్టీలన్నీ ప్రయత్నిస్తున్నాయి.

వాస్తవానికి, ప్రత్యేకహోదా వున్నా, లేకున్నా బడా పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వ రాయితీలలో కొదవ ఏముంది? ప్రభుత్వమే భూములు సేకరించి అడిగిందే తడవుగా, వందల వేల ఎకరాల భూములు వారికి అప్పనంగా కట్టబెట్టడం మన కళ్ళెదుట జరుగుతున్నదే కదా?! పరిశ్రమల స్థాపనకోసం దరఖాస్తు చేసిన 21 రోజులలోపు అన్ని ప్రభుత్వ అనుమతులు కల్పిస్తామని, లేకుంటే అనుమతి లభించినట్లుగా భావించాలని ప్రభుత్వం వారికి ఎన్నో అవకాశాలు కల్పించడంలేదా?! ప్రత్యేక ఆర్థికమండళ్ళు, ప్రత్యేక ఎగుమతి మండళ్ళలో భూములు పొందిన బడా, బహుళజాతి పారిశ్రామికవేత్తలకు దశాబ్దాల తరబడి ఎన్నో పన్నుల మినహాయింపులేగాక, కార్మికులకున్న కనీసపాటి హక్కులను కూడా అమలుచేయాల్సిన అవసరం లేదంటూ వారి దోపిడీకి చట్టబద్ధ అవకాశాలు కల్పించటంలేదా?! కార్మికుల శ్రమశక్తిని కారుచౌకగా కొల్లగొట్టే 'హైర్ అండ్ ఫైర్' (ఇష్టమొచ్చినపుడు నియమించి, తొలగించే) విధానాలను ఇప్పటికే పారిశ్రామికవేత్తలు అనుసరిస్తున్నా, ప్రభుత్వాలన్నీ వానికే అంగీకారం తెలుపుతున్నాయి కదా?! ఇంతేగాక, విజయమాల్యా, నీరవ్‌మోడీల వంటి ఎందరో ఘనాపాటీలు బ్యాంకులలో దాచుకున్న ప్రజాధనాన్ని లక్షల కోట్లు దోచుకొనీ, పారుబాకీల పేరుతో ఎగవేస్తూ, దర్జాగా దేశం వదలిపోతున్నారు కదా?! బడా పారిశ్రామికవేత్తలు, విదేశీ పారిశ్రామిక యాజమాన్యాలకంటే అత్యధిక రాయితీలు, మినహాయింపులు సమాజంలో పొందుతున్న వారెవరు? 'రాజుగారి వంటిమీద బట్టలు లేకపోవటం కన్పిస్తున్నా ఆయన ధరించిన వస్త్రాలు బ్రహ్మాండంగా వున్నాయని చుట్టూ చేరినవారు కీర్తించటంలాగానే ప్రత్యేకహోదాపై పార్టీలన్నింటి తీరు వుందని 'జనశక్తి' 5-9-15 సంచికలో వ్యాఖ్యానించింది.

అందువలన ప్రత్యేకహోదాతో, పరిశ్రమలకు అనేక రాయితీలు వచ్చి పెద్దఎత్తున పరిశ్రమలు స్థాపించబడి, ఉద్యోగావకాశాలు పెరిగి, రాష్ట్ర ప్రజలందరి జీవితాలు అభివృద్ధి పథంలో పయనిస్తాయని ఎవరుచెప్పినా అది ప్రజలను మోసగించటమే. దశాబ్దాలుగా 'ప్రత్యేకహోదా' సౌకర్యాన్ని పొందుతున్న రాష్ట్రాలన్నింటిలో ప్రజల జీవితాలను పరిశీలించినా మనకు ఇదే స్పష్టమౌతుంది.

ప్రజలకు సాగుభూమి పంపిణీ, నీటి పారుదల సౌకర్యాలు కల్పించటం, ఉద్యోగ ఉపాధికల్పన, విద్య-వైద్య సౌకర్యాలు, రక్షిత మంచినీరు, తలదాచుకోను గూడు వంటి ప్రజల మౌలిక సమస్యల పరిష్కారానికి పాలకవర్గ పార్టీలేవీ పూనుకోవు. భూస్వామ్య - సామ్రాజ్యవాద దోపిడీ ప్రయోజనాలు నెరవేర్చే ఈ పార్టీలు ఏవి అధికారంలోకి వచ్చినా ఈ సమస్యలను పరిష్కరించవు. దేశ, ప్రజల సంపదను, శ్రమశక్తిని దోపిడీ చేసుకొని పిడికెడుమంది సంపన్నులు తమ సంపదలను మరింతగా పోగేసుకొనేందుకు తోడ్పడే ఈ ప్రభుత్వాలపై ప్రజాగ్రహం కట్టలు తెంచుకోకుండా చూడటంలో పాలక పార్టీలన్నిటి మధ్య ఏకీభావ ముంటుంది. ప్రజలను తమ మౌలిక సమస్యలపై ఉద్యమాలలో సంఘటితపడనీయకుండా ఎప్పటికప్పుడు ఏదో ఒక సమస్యను సృష్టించి, భావోద్వేగపూరితం చేసి, ప్రజలను దానిచుట్టూ మళ్ళించటం దోపిడీ పాలకులకు వెన్నతో పెట్టిన విద్య. దోపిడీ పాలకుల ఈ కపట స్వభావాన్ని ప్రజలు గ్రహించాలి. ప్రజలు ఈ భ్రమలలో కూరుకుపోకుండా భావజాల ప్రచారంతోపాటు, వారి మౌలిక సమస్యలపై నిరంతరాయ కార్యాచరణలో ఉంచటమే విప్లవ, ప్రజాతంత్రశక్తుల ముందున్న కర్తవ్యం.

## జనశక్తి యాజమాన్య వివరాలు

(ఫారం 4 రూల్ 8 ప్రకారం)

| | | |
|---|---|---|
| 1. ప్రచురణ స్థలం | : | విజయవాడ, 520 010 |
| 2. ప్రచురణ కాలం | : | పక్షానికొకసారి (పక్ష పత్రిక) |
| 3. ముద్రాపకుని పేరు | : | పి.జస్వంతరావు |
| జాతీయత, చిరునామా | : | భారతీయుడు<br>32-13-26/1, బోయపాటి మాధవరావు రోడ్,<br>మొగల్రాజపురం, విజయవాడ-520 010 |
| 4. ప్రచురణ కర్త పేరు, జాతీయత, చిరునామా | : | పై విధంగానే |
| 5. సంపాదకుని పేరు | : | పి.జస్వంతరావు |
| 6. భాగస్వాములు | : | - |

పైన పేర్కొన్న విషయములన్నియు యదార్థములు

5.3.2018 సం|| పి.జస్వంతరావు

# బలవంతపు తొలగింపును వ్యతిరేకిస్తూ, మౌలిక భూ సంస్కరణల కోసం అసోం ప్రజల పోరాటం

**2016** మేలో అసోంలో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటినుండి నిర్బంధం, మతతత్వ విభజనలనే రెండు ఆయుధాలను ఉపయోగిస్తూ సాధారణ ప్రజల హక్కులను అణచివేస్తూ, అసోంలోని విశాల భూఖండాలను, విలువైన సహజ వనరులను విదేశీ బహుళజాతి కంపెనీలు, దేశంలోని బడా కార్పొరేటు కంపెనీలు హస్తగతం చేసుకునేందుకు, భూములపై వారే అదుపు కలిగి వుండేందుకు వీలు కల్పిస్తోంది. గత సంవత్సర కాలంగా రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు దీనికి అద్దం పడుతున్నాయి.

రాష్ట్రంలో 'ఎయిమ్స్' నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని బదలాయించటాన్ని వ్యతిరేకిస్తూ రాహాలో ప్రజలు నిరసనలు తెలియజేస్తున్నారు. 2016 జులై 15న, రాహాలో జరిగిన ఒక ఆందోళనపై పోలీసులు జరిపిన కాల్పులలో మింటూ దుయేరి అనే ఓ 25 ఏళ్ళ యువకుడు మరణించాడు. కజిరంగా జాతీయ ఉద్యాన వనానికి దగ్గరలోనున్న బందేర్‌దూబి గ్రామంలో ప్రజలు, తమ నుండి స్వాధీనం చేసుకున్న భూములకు తగిన పరిహారాన్ని, ప్రజలందరి పునఃస్థాపనను డిమాండ్ చేస్తున్నారు. 2016 సెప్టెంబర్ 19న వీరి ఆందోళనపై కాల్పులు జరిపిన పోలీసులు అంజుమా ఖాటూన్, ఫక్రుద్దీన్‌లనే ఇద్దరిని కాల్చి చంపారు. 'క్రిషక్ ముక్తి సంగ్రామ్ సమితి', 'ఆల్ అస్సామ్ మైనారిటీ స్టూడెంట్స్ యూనియన్'ల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన జరుగుతుండగా పోలీసులు ఈ కాల్పులు జరిపారు.

బందేర్ దూబీలో విస్థాపనకు గురైన 198 కుటుంబాలలో దాదాపు 40 కుటుంబాల ప్రజలు, తప్పనిసరి పరిస్థితుల్లో తమ బంధువుల ఇళ్ళలో తలదాచుకోవలసి వచ్చింది. మిగిలిన కుటుంబాల ప్రజలు 'బాగ్‌మరి' గ్రామంలో చలికి వణుకుతూ, ఎండకు ఎండుతూ చెట్లనీడనే తలదాచుకున్నారు. ఈ ప్రజలంతా ప్రధానంగా ముస్లిములు; వీరంతా ఒక అర్ధశతాబ్దిపైగా కాలం క్రితం పూర్వపు తూర్పు బెంగాల్ రాష్ట్రం నుండి వచ్చి బందేర్ దూబి గ్రామంలో స్థిరపడ్డారు. వీరిలో నుండి ప్రభుత్వం ఏడు హిందూ కుటుంబాలను రక్షిత స్థానానికి తరలించింది కానీ, ఇతర కుటుంబాల గురించి పట్టించుకోలేదు. మతతత్వ పూరిత వివక్షకు ఇది ఒక స్పష్టమైన ఉదాహరణ.

తొలగింపు ప్రక్రియ తర్వాత 'దేశం, భూమి, ఇల్లు' అంశాలపై ప్రభుత్వం ఎప్పటికీ రాజీ పడబోదని అసోం ప్రభుత్వంలో మంత్రి అయిన హిమంత బిశ్వశర్మ తమ ప్రభుత్వ అధికారిక ఫేస్‌బుక్ పేజీలో పేర్కొన్నాడు. బిజెపి ప్రభుత్వం అసోం ప్రజలను – అస్సామీయులు, చొరబాటు దారులుగా విభజించి, ముస్లిమ్ మతస్థులను అనిశ్చితమైన, అభద్రతతోకూడిన, విషాదకరమైన పరాధీన స్థితికి నెట్టి, అణచివేతకు సులభ లక్ష్యాలుగా మలుస్తోంది.

ఒక సం॥రం క్రితం, అసోంలోని బిజెపి ప్రభుత్వం 'చట్ట విరుద్ధ ఆక్రమణదారులు'గా పేర్కొంటూ ప్రభుత్వ భూముల నుండి ప్రజలను తొలగించే ప్రక్రియను ప్రారంభించింది. కజిరంగాతో ప్రారంభమై, అతిత్వరగా ఇది రాష్ట్ర వ్యాపితంగా విస్తరించింది. దాదాపు సం॥రం తర్వాత, 2017 నవంబర్ 24న సైపాజ్‌హార్‌లో ప్రభుత్వం తన తొలగింపు చర్యను చేపట్టింది. ఇక్కడ, కురువ గ్రామానికి చెందిన ఆనందదాస్ అనే యువకుడు అర్థంకాని విధంగా నవంబర్ 21న అపహరణకు గురై నవంబర్ 23న హత్యకు గురయ్యాడు. అయితే, గంధియ పత్తర్ గ్రామస్థులను చట్టవిరుద్ధ వలసదారులుగా ఆరోపిస్తూ, ఆనందదాస్ హత్యకు వారే బాధ్యులంటూ ఆయుధాలతో కూడిన ఒక గుంపు వినాశనం సృష్టించింది. వారు కొన్ని ఇళ్ళను లూటీ చేశారు; కొన్ని ఇళ్ళను తగులబెట్టారు. నాటకీయంగా 2017 నవంబర్ 24న తక్షణం జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకునే పేరిట కదిలి, దాదాపు 60 కుటుంబాలను వారి భూముల నుండి బలవంతంగా తొలగించింది.

సిఫొర్ఝర్‌తో బలవంతపు తొలగింపుల ప్రక్రియ ఆగలేదు. 2017 నవంబర్ 27న గౌహతి చుట్టూ తానున్న ఆమ్‌ఛాంగ్ రిజర్వు అటవీ భూములను చుట్టబెట్టారు. చట్టవిరుద్ధ చొరబాటుదార్లుగా పేర్కొంటూ 700 కుటుంబాలను అటవీ భూముల నుండి తొలగించారు. హైకోర్టు ఆదేశం పేరుతో సిఫొర్ఝర్‌తో తొలగింపులు చేబట్టగా, భజరంగ్‌దళ్ కార్యకర్తల డిమాండ్ మేరకు ఆమ్‌ఛంగ్ తొలగింపులు నిర్వహించారు. ఆమ్‌ఛంగ్ తొలగింపులు అసోమ్ సమాజంలోని వివిధ సెక్షన్ల వ్యతిరేకతను చూరగొన్నాయి. ఈ తొలగించబడినవారంతా అధికంగా మిషింగ్ మరియు బోడో తెగలకు చెందినవారేగాక, వీరు మజౌలీ, లక్ష్మీపూర్ ధేమాజీలలో నదీ కోత కారణంగా ఒక పర్యాయం భూములు కోల్పోయినవారే. తొలగించిన వారందరినీ పునరావాసం, కనీసపాటి నీడ లేకుండా వదిలివేశారు.

చట్టవిరుద్ధ చొరబాటుదారులుగా సిపాఝర్ గ్రామస్తులను చిత్రించి, తాము చేపట్టిన చర్య సమర్థనీయమైనదిగా పాలకులు పేర్కొంటున్నారు. అయితే, దాదాపు వారంతా ఆసోమ్‌లో చట్టబద్ధమైన పౌరులుగా, ఓటర్ గుర్తింపు కార్డులను కూడా కలిగివున్నారు. బార్‌పేటలోని జోనియా వంటి ప్రాంతాల నుండి పేదరికం, నదీకోతల నుండి తప్పుకునేందుకు వీరి ముందు తరాల వారు ఇక్కడకు తరలివచ్చారు. తర్వాతి కాలంలో ఈ ప్రజలను మోసంచేసి కురువాలోని స్థానికులు ప్రభుత్వ భూములను వీరికి విక్రయించారు. ప్రస్తుత పాలకపార్టీ 2016 ఎన్నికలలో వారి ఓట్లను వేయించుకుంది. ఈ ప్రజలు భూములపై తమ హక్కు గురించి ప్రశ్నించేసరికి, అదే ప్రజలను ఈ పాలకులే చట్టవిరుద్ధ చొరబాటు దారులని పేర్కొంటూ చట్టవిరుద్ధంగా బలవంతంగా వారి భూములనుండి తొలగించారు.

ఆమ్‌ఛాంగ్ తొలగింపుల సమస్యకొస్తే, తరాల నుండి ఆదివాసీ ప్రజలు ప్రకృతితో కలసి మెలసి జీవిస్తూ, తమ మనుగడ సాగిస్తున్నారు. అయితే, అడవిని విధ్వంసం చేస్తున్నవారిగా, వారిపై ఆరోపణలు చేస్తున్నారు. పర్యావరణాన్ని నాశనం చేస్తున్నారనే ఆరోపణతో ప్రభుత్వం ఈ ఆదివాసులను భూముల నుండి తొలగించింది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 2017 మే ఉత్తర్వుల ప్రకారం, ప్రజలను తొలగించిన కొన్ని గ్రామాలు రెవిన్యూ గ్రామాలుగా వున్నాయి. సున్నిత పర్యావరణ గ్రామాలుగా వాటిని గుర్తించారు. కానీ ఆ గ్రామాలు రిజర్వు ఫారెస్టులో భాగంగా వున్నాయి. ప్రభుత్వమే ఆమోదించిన ప్రకారం, 2004లో రిజర్వు ఫారెస్టుగా ప్రభుత్వం ప్రకటించటానికి చాలా ముందుగానే ఆమ్‌ఛాంగ్‌లోని కొన్ని ప్రాంతాలలో ఆక్రమణలు చోటు చేసుకున్నాయి. అయితే, చట్టాలను కాలదన్ని నిర్మించిన వాణిజ్య సముదాయాలు, సిమెంటు పరిశ్రమలు, సైనికుల ఫైరింగ్ రేంజి మొదలైన వాటిని రిజర్వ్ ఫారెస్టులోనే కొనసాగించేందుకు ప్రభుత్వం అనుమతించింది.

విదేశీ పరిశ్రమలకు, భారత బడా కార్పొరేటు సంస్థలకు భూములను కట్టబెట్టే తమ విధానంలో భాగంగానే ప్రభుత్వం పెద్దఎత్తున ప్రజలను విస్థాపనకు గురిచేస్తోంది. గౌహతీ లోనూ, చుట్టుప్రక్కల ప్రాంతాల నుండి ప్రజలను తొలగిస్తోంది. ఎదుగుతోన్న వ్యూహాత్మక భౌగోళిక

పారిశ్రామిక మరియు రవాణా సౌకర్యాల కేంద్రంగా దీని ద్వారా పొరుగు రాష్ట్రాలకు వస్తువులను, సేవలను అందించే ద్వారంగా పాలకులు గౌహతిని పరిగణిస్తున్నారు. ఇదంతా ప్రభుత్వం యొక్క విస్తృత ప్రైవేటీకరణ విధానంలో ఒక భాగం మాత్రమే. ఈ విధానాన్ని సుగమం చేసేందుకే ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. బహుళజాతి కంపెనీలకు, భారత బడా కార్పొరేటు సంస్థలకు భారీ భూఖండాలను కట్ట బెట్టేందుకు మార్గాన్ని సులభతరం చేయటంలో ఇది మొదటి అడుగు మాత్రమే. భూసేకరణకు ప్రతిఘటన ఎదరౌతూ ప్రక్రియ కష్టతరమైందిగా కొనసాగుతోంది. కనుక, ఒక ప్రాంతపు ప్రజానీకంపై అక్రమ చొరబాటుదారులని, చట్టవిరుద్ధ ఆక్రమణదారులని ముద్రవేసి, మతతత్వశక్తులను ఎగదోసి, ప్రజలకు వ్యతిరేకంగా ఉద్రిక్తతలను రెచ్చగొట్టటం, అసోంలో ప్రజలను విభజించి పాలించే బిజెపి పాలకుల క్రీడలో ఒక భాగం మాత్రమే. ప్రజలలో ఒక విభాగపు ప్రజలను మరో విభాగంపైకి ఉసిగొల్పి, వారి పోరాటాన్ని బలహీనపర్చి, క్రూర నిర్బంధాన్ని ప్రయోగించి మరింత తేలికగా తొలగింపు ప్రక్రియను పూర్తి చేయడమేగాక, విస్థాపనకు గురైన ప్రజలకు సరైన పరిహారం, పునరావాసం కల్పించాల్సిన తమ బాధ్యత నుండి కూడా తప్పుకుంటున్నారు.

పర్యావరణ వనరుల పరిరక్షణ గురించి అసోమ్ పాలకులు చాలా ఎక్కువగా మాట్లాడు తున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో బహిరంగ గనుల తవ్వకానికి ఆమోదించి, పట్కాయి కొండలను వారు దాదాపు విధ్వంసం చేశారు. రభా హసోంగ్ స్వయంప్రతి మండళ్ళను మరియు బిటిఏడి పరిధిలోని ఛిరాంగ్ ప్రాంతాల నుండి పెద్దఎత్తున పారిశ్రామిక కలప అవసరాల కోసం, కలప సేకరణను వారు అనుమతించారు. పెద్ద మొత్తంలో గిరిజన ప్రాంతాలలోని భూ ఖండాలను పతంజలి, దాబర్ మొదలైన సంస్థలకు అప్పగించారు. పిడికెడుమందిగావున్న బడా వ్యాపారవర్గాలకు ప్రయోజనం చేకూర్చేందుకు, అభివృద్ధిపేరుతో కోట్లాదిమంది పేదలను ఆకలికి, పేదరికానికి గురిచేస్తూ, వారిని దోచుకుంటు న్నారనేది స్పష్టం. ఒకవైపున బహుళజాతి కంపెనీలు, బడా వ్యాపారవర్గాలు అనంతంగా, భారీగా ప్రజల జీవనోపాధిని, జీవనాధారాలను కొల్లగొడ్తూ భారీగా భూములు కైవసం చేసుకోవటానికి ప్రభుత్వాలు అనుమతిచ్చాయి. మరోవైపున ప్రతి సం॥రం నదీ ప్రవాహపు కోతలకు గురై ముంపు కారణంగా పెద్దసంఖ్యలో ప్రజానీకం రాష్ట్రానికి చెందిన ఒక పెద్ద భూభాగంలో భూములు, నివాసం కోల్పోతున్నారు. ప్రజల భూముల దురాక్రమణకు పాల్పడుతూ, ప్రజలను వారి భూముల నుండి గెంటివేసి, వారి జీవనోపాధిని కొల్లగొట్టి సామ్రాజ్యవాదులకు బడా వ్యాపారవర్గాలకు కట్టబెడుతున్నారు. కనుక దీనికి వ్యతిరేకంగా, విప్లవాత్మక భూ సంస్కరణల కోసం, ప్రజాస్వామిక, జాతీయ, ప్రజానుకూల అభివృద్ధి విధానం కోసం పోరాడటం – ప్రజల ముందున్న తక్షణ, అత్యావశ్యక కర్తవ్యం.

---

**(18వ పేజీ తరువాయి)**

ప్రతిఘటన పెరుగుతూండటాన్ని కూడా మనం చూడగలం. తరాలనుండి తమ తాత, ముత్తాతల లాగా అణగిమణిగి పడివుండే తుచ్ఛమైన, అవమానకరమైన, అణచివేతతో కూడిన ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిస్థితులను ఆమోదించి, తదనుగుణంగా జీవించటానికి దళితులు– ముఖ్యంగా యువజనులు నిరాకరిస్తున్నారు. ఇది ఖచ్చితంగా ఆహ్వానించాల్సిన విషయం. వారంతా ఓ నూతన, మెరుగైన జీవితాన్ని కలగంటూ, దానికోసం వెదుకులాడుతున్నారు. ప్రత్యేకించి, పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, వివిధ వృత్తుల పనిప్రదేశాలలో, జీవితంలోని అన్ని రంగాలలో సాధారణ దళిత యువజన ప్రజానీకం–ఆర్థిక, రాజకీయ అసమానతలు, వివక్ష మరియు అణచివేతలకు కారణాల గురించి, వాటిని అంతంచేసే మార్గాల గురించి చర్చలు సాగిస్తున్నారు. దోపిడీ పాలకవర్గాల దన్నుతోనున్న అగ్రకులతత్వ, హిందుమతతత్వ శక్తులకు వ్యతిరేకంగా వారు బయటకు వస్తున్నారు. తమందరి మధ్య పరస్పర సహకారం, సంఘీభావం అభివృద్ధిచేసుకోవలసిన అవసరాన్ని వారు లేవనెత్తుతున్నారు. ఒక్కో విభాగం సాగించిన పోరాటం, సాధించిన విజయాలనుండి వారు స్ఫూర్తిని పొందుతున్నారు. వివిధ విభాగాల పీడిత ప్రజల ఐక్యపోరాటాలు, వారి మధ్య ఐక్యత ఎలాంటి అద్భుతాలను సాధించగలదో వారు గమనిస్తున్నారు. ఇవన్నీ ఆహ్వానించదగిన పరిణామాలే.

దోపిడీకి గురవుతున్న పీడిత ప్రజలకు వ్యతిరేకంగా భారత పాలకవర్గాలు క్రూరమైన, నాజూకైన విధానాలను ఉపయోగిస్తున్నాయి. పాలకులకు కులవ్యవస్థ మరియు అగ్రకుల తత్వాలనేవి ఆర్థిక, సామాజిక అసమానత్వాన్ని సమాజంలో సుస్థిరపర్చే అనువైన సాధనాలు మాత్రమే కాదు; పీడిత ప్రజలను రెండు పరస్పర శత్రుసమూహాలుగా విభజించి, ఒక సమూహంపై మరొక సమూహాన్ని ఎగదోయటానికి మరొక సాధనం కూడా. మహారాష్ట్రలోని భీమా–కోరేగావ్‌లో హిందూమతతత్వశక్తుల ప్రయత్నాలన్నీ – దళితులపై దాడులకు పథకాల్ని రూపొందించి, నాయకత్వం వహించి, సాధారణ దళిత–మరాఠా ప్రజల నడుమ గొడవలను, ఉద్రిక్తతలను రాజేయటమే, ఈ నీచమైన క్రీడ వెనుకనున్న ఉద్దేశ్యం. మనదేశంలోని దోపిడీ పాలకవర్గ పార్టీలపట్ల–వాటి రంగులు, జెండాలు, టోపీలు ఏవైనా, 'కఠినమైన' లేదా 'నాజూకైన' హిందూ మతతత్వమైనా లేదా 'లౌకికవాదమై'నా 'ప్రజాస్వామిక'మైనా లేదా 'ప్రగతిశీలతత్వమై'నా, మరేదైనా–ఈ పార్టీలన్నీ సూత్రరీత్యా వాటి దోపిడీవర్గ ప్రయోజనాలు అనగా–భూస్వామ్య, దళారీ బూర్జువా, సామ్రాజ్యవాదుల ప్రయోజనాల కనుగుణంగానే వ్యవహరిస్తాయని మనదేశంలోని పీడిత ప్రజలంతా ఎరుకతో, స్పష్టంగా వుండాలి. వారు ధరించే టోపీలన్నీ ఈ దోపిడీవర్గ ప్రయోజనాలను పరిరక్షించి, వాటికి సేవచేసే సాధనాలేనని గ్రహించాలి. భారత పాలకవర్గాల ప్రయోజనాలకు, విధానాలకు, ఎత్తుగడలకు వ్యతిరేకంగా తుదికంటా, ప్రభావశీలంగా, విజయం సాధించేవిధంగా ఎలా పోరాటం చేయాలనేది దళిత ప్రజానీకంతో సహా పీడిత ప్రజలలోని ప్రతి విభాగమూ పట్టించుకుని తీరవల్సిన అంశంగా ముందున్నది.

సమాజంలోని వివిధ విభాగాల ప్రజానీకం కొన్నిసార్లు విడిగానూ, మరికొన్నిసార్లు తమ ఐక్యపోరాటాల ద్వారా తమ సమస్యలకు పరిష్కారాన్నో లేదా కొంత తాత్కాలిక ఉపశమనా లనో పొందగలుగుతున్నారు. మహారాష్ట్రలో మరాఠాల, గుజరాత్‌లో పటేదార్ల ప్రయత్నాలు దీనిలో భాగమే. మహారాష్ట్రలో దళితులు తమపై సాగుతున్న అత్యాచారాలకు, కొనసాగుతున్న సామాజిక అసమానత్వానికి, వివక్షకు, అణచి వేతలతోపాటు క్రూరమైన అన్ని రూపాలలోనున్న కులవ్యవస్థను అంతమొందించటానికి పోరాటం చేయాలి. వాస్తవానికి ఇది అణచివేతను వ్యతిరేకించే వారందరి పోరాటం. ప్రస్తుత భూస్వామ్య, సామ్రాజ్యవాద ఆధిపత్య ఆర్థిక, సామాజిక, రాజకీయ వ్యవస్థ–అన్ని రూపాలలోని అణచి వేతలను అంతమొందించే పోరాట మార్గంలో ప్రధాన అవరోధమనే ప్రాథమిక సత్యాన్ని అర్థం చేసుకోవటం అత్యావశ్యకం. కనుక ప్రత్యేక అణచివేత రూపాలపై దళితులు పోరాటం సాగిస్తూనే, అదే సందర్భంలో, తప్పనిసరిగా, ప్రస్తుత దోపిడీ, అణచివేతలతో కూడిన సామాజిక వ్యవస్థను అంతమొందించి మనదేశంలో నూతన ప్రజాస్వామిక వ్యవస్థను స్థాపించే లక్ష్యంకోసం జరిగే పోరాటంలో భాగస్వాములు కావాలి. ఇది మాత్రమే–సామాజిక అసమానత్వానికి, వివక్షకు, అణచివేతలకు వ్యతిరేకంగా జరిగే పోరాటాన్ని అర్థవంతంగానూ, ప్రభావశీలంగానూ చేయ గలుగుతుంది. ఈ ధోరణి పెరుగుతూవుండటం ఆహ్వాన సూచికగా వుంది.

# ఊంఛాహార్ ప్రేలుళ్ళు కార్మికుల ఘోరమైన పనిపరిస్థితులు

**ఉత్తరప్రదేశ్** రాష్ట్రం, రాయబరేలీలో నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్(ఎన్‌టిపిసి) ఆధ్వర్యంలోని ఊంఛాహార్ థర్మల్ విద్యుత్తు కేంద్రంలో 2017 నవంబర్ 1న జరిగిన ఘోర "ప్రమాదంలో" 43 మంది కార్మికులు దుర్మరణం చెందగా, మరో వందమంది కార్మికులు గాయపడ్డారు. పాలక రాజకీయ నాయకులు ఈ ఘటనపట్ల తీవ్ర దిగ్భ్రాంతిని, తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్రప్రభుత్వం నష్టపరిహారాన్ని ప్రకటించింది. ఒక విచారణ కమిటీని నియమించారు. ఈ విధంగా ఈ ఘటన వార్త తాలూకువున్న విలువ క్రమంగా మసకబారి పోయింది. కార్మికుల పని ప్రదేశాల్లోని 'ప్రమాదాల' ప్రతి సందర్భంలోనూ జరుగుతున్నదిదే.

థర్మల్ విద్యుత్తు కేంద్రంలోని 6వ యూనిట్‌లో వత్తిడి అధికంగా వుండే బాయిలర్‌లో ప్రేలుడు కారణంగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. బాయిలర్‌ను పూర్తిగా మూసివేయకపోవటం వలన, అది సరిగా పనిచేయలేదు. దీనివలన పోగుపడిన బూడిదను శుభ్రం చేయవలసిందిగా కార్మికులను ఆదేశించారు. బాయిలర్‌లో పీడన అధికమవటం వలన అది ప్రేలిపోయింది. ఘటన జరిగిన సందర్భంలో బాయిలర్‌లోనూ, పరిసరాల్లోనూ దాదాపు 300 మంది కార్మికు లున్నారు. భద్రతా చర్యలన్నీ చేపట్టివుంటే, చాలా తేలికగా నివారింపదగిన ప్రమాదం ఇది. కార్మికుల ప్రాణాలపట్ల, భద్రతపట్ల యాజమాన్యాల ఘోరమైన నిర్లక్ష్యాన్ని ఈ ఘటన వెల్లడిచేస్తోంది.

ఎన్‌టిపిసి ఒక ప్రభుత్వరంగ సంస్థ అయినప్పటికీ, కార్మికులకవసరమైన భద్రతా ప్రమాణాలన్నీ పాటించి తీరుతుందని లేదు. దేశవ్యాపితంగా ఎన్‌టిపిసి 48 థర్మల్ విద్యుత్ కేంద్రాలను నడుపుతోంది. ఖచ్చితమైన భద్రతా విధానాలను ఆ సంస్థ తప్పనిసరిగా కలిగి వుండాలి. వాస్తవానికి అలా కలిగివుంది కూడా. కానీ, ఆ ప్రమాణాలన్నింటినీ ఉత్పత్తి పెంపుదల కోసం ఉద్దేశపూర్వకంగా ప్రక్కనబెట్టారు.

ఈ ప్రమాదంలో మరణించిన లేదా గాయపడిన వారిలో అత్యధికులు, ఓ కాంట్రాక్టరుద్వారా ఎన్‌టిపిసి పనిలో పెట్టుకున్న కాంట్రాక్టు వలస కార్మికులే. ప్రభుత్వరంగ సంస్థలతో సహా అనేక పరిశ్రమలు తమ కార్మికులకు రక్షణను, భద్రతా ప్రమాణాలను కల్పించే బాధ్యతనుండి తప్పుకోవటానికి దీనికి ఒక కపటోపాయంగా ఉపయోగిస్తున్నాయి. కార్మికులందరికీ కాంట్రాక్టరు ద్వారా ఉద్యోగం కల్పించబడింది కావున, ఆ కార్మికులు పనిచేస్తున్న పరిశ్రమకు, ఆ కార్మికులకు సంబంధించిన ఎలాంటి బాధ్యతా లేదని వారు వాదన చేస్తున్నారు. కాంట్రాక్టు కార్మికులకు ప్రధాన ఉద్యోగ కల్పనాదారునిగా ప్రభుత్వమే బాధ్యత వహించాలన్న సుప్రీంకోర్టు ఆదేశాన్ని ప్రక్కనబెట్టి, విస్తారంగా కొనసాగుతున్న ఆచరణ ఈ విధంగానే వుంది. కార్మిక చట్టాలుగా చెప్పబడేవి కానీ, సుప్రీంకోర్టు ఆదేశాలు కానీ నిర్భయంగా ఉల్లంఘించబడుతున్నాయి. నేరం చేసినందుకు శిక్షించవలసిన, చట్టాన్ని పరిరక్షించేవిగా చెబుతున్న ప్రభుత్వమూ లేదా సంబంధిత సంస్థలు చర్యలు తీసుకుంటాయనే భయం లేకుండా పోయింది.

కార్మికుల భద్రతపట్ల చట్టభీతిలేని ఘోరమైన నిర్లక్ష్యాన్ని వీరు ఎందుకు ప్రదర్శిస్తున్నారు? నూతన ఆర్థిక విధానాల అమలు తర్వాత కార్మిక చట్టాలన్నింటినీ ధ్వంసంచేసి, దాని స్థానంలో యజమానులు తమచిత్తమొచ్చిన విధంగా కార్మికులను పనిలో పెట్టుకొనే, తొలగించే విధానాన్ని ముందుకు తేవాలని అన్ని వైపులనుండి కేకలు పెడుతున్నారు. అధికారంలోకి వచ్చే ప్రభుత్వాలన్నీ కూడా ఎడతెగకుండా కార్మిక సంస్కరణలను గురించి మాట్లాడుతున్నాయి. కానీ, ఇదంతా కార్మిక చట్టాలను ఎత్తివేయటం మినహా మరోటి కాదు.

ప్రస్తుతం అధికారంలోవున్న బిజెపి ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికులను ప్రమాదకర పనులలో ఉపయోగించే వీలుగా 'కాంట్రాక్టు కార్మిక (సవరణ, రద్దు) చట్టం–1970'కి సవరణలను ప్రతిపాదించింది. అలాగే బిజెపి ప్రభుత్వం 'ఫ్యాక్టరీల చట్టం – 1938'కి సవరణలు ప్రతిపాదించింది. ప్రతి సంవత్సరం ఫ్యాక్టరీని తనిఖీ చేయవలసిన పర్యాయాల సంఖ్యను కుదిస్తోంది. చట్టంలో సవరణ చేర్చక మునుపే, బిజెపి ప్రభుత్వం 'శ్రమ్ సువిధ' ఫోర్టల్‌ను ఆవిష్కరించింది. కార్మిక చట్టాల అంగీకారానికి 'స్వీయ ధృవపత్రం ఇస్తే చాలునని దీనిలో పేర్కొన్నారు. ప్రధాన ఉద్యోగ కల్పనాదారుని 'స్వీయ ధృవపత్రాన్ని' అనుమతించే విధంగా బాయిలర్ రెగ్యులేషన్స్–1950 చట్టానికి సవరణలు చేశారు.

పని ప్రదేశంలో ప్రమాదాలు పెరుగుతూ పోతున్న నేపథ్యంలో ఈ సవరణలు జరుగుతున్నాయి. 'సులభతర వ్యాపార' బలిపీఠంపై కార్మికుల ప్రాణాలు, హక్కులు పెట్టబడి వున్నాయి. ఊంఛాహార్ ప్రేలుడు–ప్రతి సంవత్సరం దేశవ్యాపితంగా జరుగుతున్న 'పారిశ్రామిక ప్రమాదాల'లో ఒకటి మాత్రమే. వేలాదిమంది కార్మికులు ఈ ప్రమాదాలలో తమ ప్రాణాలు కోల్పోతున్నారు. కార్మికవర్గం, తన వర్గ పోరాటాల ద్వారా మాత్రమే తాము బలవంతంగా నెట్టబడుతోన్న ఈ ప్రమాదకర పరిస్థితులను మార్చుకోగలుగుతారు.

---

*సమిష్టి లైంగిక సంబంధాలు వ్యష్టి లైంగిక ప్రేమగా అభివృద్ధి చెంది, తద్వారా పరిశుద్ధం కావడం ఎంత అర్థవంతమైందీ ఎంగెల్స్ తన 'కుటుంబం పుట్టుక'లో తెలియజేశాడు. స్త్రీ పురుషుల మధ్య సంబంధాలు కేవలం ఆర్థిక విషయాలకు, శరీర శాస్త్ర పరిశీలనార్థం ఉద్దేశ్యపూర్వకంగా విడదీయబడిన శారీరక వాంఛకు మధ్య గల పరస్పర ప్రభావపు వ్యక్తీకరణ కాదు. ఈ సంబంధాలలోని మార్పులు మొత్తం భావజాలంతో దానికి గల సంబంధం నుండి విడదీసి సమాజపు ఆర్థిక ప్రాతిపదికతో సూటిగా లంకించడానికి ప్రయత్నించడం హేతువాదమౌతుంది., మార్క్సిజం కాదు. నిజమే, దప్పిక తీర్చుకోవాలి, మామూలు మనిషి మామూలుగా మురుగు కాల్వలో పడుకుంటాడా, మురికి గుంటలోని నీరు తాగుతాడా? లేక, అనేకమంది నోళ్ళతో జిడ్డుపట్టిన గ్లాసుతోనైనా తాగుతాడా? కానీ, సామాజిక పార్శ్వం అన్నిటికంటే ముఖ్యమైనది. నీళ్ళు తాగడం ముఖ్యంగా వ్యష్టి విషయం. కానీ ప్రేమకు ఇద్దరు మనుషులు కావాలి, మూడవ మనిషి, కొత్తజీవి, పుట్టే అవకాశం ఉంది. ఈ విషయానికొక సామాజిక స్వభావం వుంది. ఇది సమాజంపట్ల ఒక బాధ్యత అవుతుంది.*

**– లెనిన్** (క్లారాజెట్కిన్‌తో ఇంటర్వ్యూ నుండి)

# 'వెదురు వృక్షజాతికి చెందినది కాదు'

**అటవీయేతర,** ప్రైవేటు భూములలో పెంచే వెదురును నరికి, తరలించటంనుండి మినహాయించాలని అటవీ చట్టాలను మారుస్తూ 2017 నవంబర్ 23న కేంద్రప్రభుత్వం ఓ ఆర్డినెన్సు జారీచేసింది. సవరణ బిల్లు రూపంలో నాలుగు వారాలలో ఈ ఆర్డినెన్స్‌ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. డిసెంబర్ 18న లోక్‌సభ ఈ బిల్లును ఆమోదించగా, డిసెంబర్ 19న రాజ్యసభ ఈ బిల్లుకు ఆమోదం తెలిపింది.

ఈ సవరణ ప్రకారం ఇక నుండి "వెదురు, చెట్టుకాదు". అయితే, విషయం అది కాదు. వెదురు గడ్డిజాతికి చెందినదని, వృక్షజాతి కాదనే విషయం అందరూ అంగీకరిస్తారు. భారత అటవీ చట్టం క్రింద 'వృక్షాల జాబితా'లో, బ్రిటిష్ వలస పాలకులు వెదురును కూడా చేర్చారు. ఆవిధంగా వెదురును నరికి, అమ్మే పూర్తి అధికారం అటవీశాఖ పరిధిలోకి వచ్చింది. ఆదివాసీలకు, అడవులలో నివాసముండే ఇతరులకు, వినియోగదారులకు ప్రయోజనం చేకూర్చే పేరిట వెదురును వృక్షజాతి నుండి తొలగించాలనే దానిలో రాజకీయ పార్టీలన్నిటి నడుమ ఏకాభిప్రాయం వుంది.

పార్లమెంట్ సమావేశాలు జరుగుతుండగా ప్రభుత్వం ఆర్డినెన్స్ చేయాల్సిన అవసరం ఏమొచ్చింది? నాలుగు వారాల వ్యవధిలోనే చట్ట సవరణకు పార్లమెంటు ఆమోదం పొందటానికి ఎందుకింత తొందరను ప్రదర్శించిందనేది ప్రశ్న. విపక్ష పార్టీలు పార్లమెంటులో ఈ ప్రశ్నను అడుగగా, అటవీ పర్యావరణ శాఖామంత్రి హర్షవర్ధన్ జవాబు చెప్పకుండా తప్పుకున్నాడు. అడవులను లూటీ చేసుకోవటానికి, ప్రైవేటు పారిశ్రామికవేత్తలకు మాత్రమే ఈ చర్య ప్రయోజనకారి అని విపక్ష పార్టీలు ప్రభుత్వాన్ని విమర్శించాయి.

94 శాతం వెదురు అటవీ భూములలో పెరుగుతుండగా, కేవలం ఆరు శాతం మాత్రమే, అటవీయేతర, ప్రైవేటు భూములలో పెరుగుతోంది. 24 శాతం వెదురు, పరంజాల నిర్మాణానికి వినియోగిస్తుండగా, తరువాత అధిక స్థాయిలో 20 శాతం వెదురును కాగిత పరిశ్రమలో వినియోగిస్తున్నారు. అటవీయేతర భూమిలో పెరిగిన వెదురును వృక్షజాబితా నుండి తొలగించటంతో, బీడు భూములు, నదీతీరాలు, రోడ్డుప్రక్కన, రైల్వేట్రాక్ పొడవునా వెదురు సాగును ప్రోత్సహించే పథకాలున్నాయని, తద్వారా కలప, పల్ప్‌వంటి అనుబంధ ఉత్పత్తుల దిగుమతి తగ్గిపోతుందని నీతి ఆయోగ్ ఆర్థికవేత్త రమేష్‌చాంద్ పేర్కొన్నాడు.

ఛత్తీస్‌గఢ్‌లో, వెదురును వృక్షజాబితానుండి తొలగించి వెదురు నరకటాన్ని, అమ్మటాన్ని గ్రామ పంచాయితీ బాధ్యతకు అప్పగించారు. వార్తా కథనాల ప్రకారం, గ్రామపంచాయితీలు ప్రతి సం॥మూ అనేక కోట్ల రూపాయల ఆదాయాన్ని ఆర్జించి, దానిని అభివృద్ధి కోసం వెచ్చిస్తున్నాయని తెలుస్తోంది. ఒక శతాబ్దంపైగా కాలంనుండి అటవీశాఖ ఈ డబ్బును లూటీచేస్తోందని అర్థమౌతోంది. ఈ చట్టంద్వారా ఈ లూటీ కొనసాగించబడుతోంది.

అటవీ హక్కుల చట్టం ఈపాటికే వెదురును అల్పమైన అటవీ వుత్పత్తిగా పేర్కొంటోంది. వెదురును నరికి, అమ్ముకునే హక్కును ఈ చట్టం ఆదివాసులకు కల్పిస్తోంది. అయినప్పటికీ అటవీ చట్టం సవరించలేదనే కృత్రిమ సాకుతో అటవీశాఖ, ఈ హక్కును వినియోగించుకోనీయకుండా ఆదివాసులను అడ్డుకుంటోంది. ప్రస్తుతం చేసిన ఈ సవరణచట్టం, అటవీ భూములలో పెరిగిన వెదురును మినహాయించటంద్వారా ఈ చట్ట విరుద్ధమైన దానినే స్థిరీకరిస్తోంది. వాస్తవంగా ఆదివాసులకు చెందవలసిన వెదురు ద్వారా వచ్చే ఆదాయాన్ని అటవీశాఖ లూటీ చేయటాన్నే ఈ సవరణ చట్టం కొనసాగిస్తుంది.

యుపిఏ ప్రభుత్వం నేషనల్ బ్యాంబూమిషన్ (ఎన్‌బిఎమ్)ను ప్రారంభించింది. 'నేషనల్ అగ్రో ఫారెస్ట్ అండ్ బ్యాంబూమిషన్'గా ఎన్‌డిఏ ప్రభుత్వం దాని పేరు మార్చింది. వివిధ మంత్రిత్వశాఖల నడుమ సమన్వయ వ్యవస్థగా పనిచేయటమే రెండింటి యొక్క ఒకే లక్ష్యం. ఏమైనా ఈ 'మిషన్' కింద సాంవత్సరిక కేటాయింపులు తగ్గిపోతూండగా, కేటాయించిన నిధులలో అధికభాగం ఖర్చు చేయకుండా మిగిలిపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో అటవీయేతర భూములలో వెదురును ప్రోత్సహించటమనేది నిరుపయోగమైనది. ఈ విధంగా 'సవరణ చట్టం' అడవులలో వెదురును చట్టవిరుద్ధంగా నరికి వేయటాన్ని ప్రోత్సహిస్తుంది; ఎందుకంటే ప్రైవేటుగా పెంచిన వెదురును, అటవీ వెదురును ఏవిధంగా వేరుచేయలేము గనుక!.

ఆదివాసులు ప్రకృతి విధానాలను బాగా తెలిసివుంటారు. వెదురు పొదలుగా పెరుగుతుంది. ఆదివాసులు ముదురు వెదురును నరికి, లేతగా వున్న వెదురును పెరగటానికి వీలుగా వదిలివేస్తారు. దీనితో వెదురు పొదలు ఎప్పుడూ పెరుగుతూనే నిండుగా వుంటాయి. విచక్షణారహితంగా వెదురు పొదలను వ్యాపార ప్రయోజనాలకనుగుణంగా నరికివేయటం జరుగుతుండటంతో, వెదురు కనుమరుగయ్యేదిగా మిగిలిపోతుంది. పేపరు మిల్లు యాజమాన్యాలు తూర్పుగోదావరి జిల్లాలో సాగించిన విచక్షణారహిత నరికివేతతో ఇదే సంభవించింది.

అటవీ చట్టానికి ఇంత వేగంగా ప్రభుత్వం సవరణచేయటం, ప్రైవేటు పారిశ్రామికాధిపతులకు ప్రయోజనం చేకూర్చటానికి, అటవీ వెదురు అమ్మకంద్వారా ఆదాయాన్ని గ్యారంటీ చేయటానికే. ఇది ఆదివాసీ అనుకూల, పేదల అనుకూల చట్టం ఎంతమాత్రం కాదు.

## విశ్వ వైతాళికుడు

స్తంభించింది అకస్మాత్తుగా
జగత్తంతా ఒక్కక్షణం
జారింది లోకం చెక్కిళ్ళపై
గోరువెచ్చని అశ్రుకణం

నిలబడింది నిమేషకాలం
నిర్నిమేషంగా ఓల్గానది
కరిగి నీరై గట్లు తెంచుకుని
పారలిపోయింది జనతాహృది

తలవంచింది దీనంగా
మౌనంగా అరుణపతాకం

సమర్పించింది శ్రద్ధాంజలి
సమస్త ప్రజానీకం
కలాన్ని చుట్టుకొని ముందుకు
కదలలేకున్నది కవిత

జాలిగా నిట్టూర్చింది
శాంతి వొడిలో మానవత
పదేపదే కదలనే
కదలదా పెదవుల జంట
పదేపదే మ్రోగనే
మ్రోగదా గుడిలో గంట
కదలక కదలక కదిలిందో
ప్రపంచమంతా నిశ్శబ్దం

మ్రోగక మ్రోగక మ్రోగిందో
ముందుకు సాగుతుంది శతాబ్దం

ఆయన వెలిగించిన ఆశాజ్యోతి
అడ్డగిస్తుంది అశాంతిని
ఆయన ఆలపించిన క్రాంతిగీతి
ప్రసరిస్తుంది ప్రశాంతిని

రైతుకు పట్టంకట్టిన
రష్యా భాగ్యవిధాత అతడు
కూలికి కిరీటం పెట్టిన
స్టాలిన్ మహానేత యతడు

– జంధ్యాల పాపయ్యశాస్త్రి

Janasakti (Communist Revolutionaries' Fortnightly) RNI No.8315/63 VJ-077/2016-18
No.of pages : 24 Date of publication : 3rd & 18th of Every Month Posting date : 5th & 20th of Every Month

# సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్రనాయకుడు కా॥యద్దనపూడి సోనీకి విప్లవ జోహార్లు



**సిపిఐ(ఎం-ఎల్)** రాష్ట్రనాయకుడు, కార్మిక, రైతు, కూలీ, ప్రజా ఉద్యమనేత, రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర సహాయకార్యదర్శి, కా॥యద్దనపూడి సోనీ(60 సం॥లు) గుండె సంబంధిత వ్యాధికి చికిత్సపొందుతూ 19-2-18 రాత్రి 7.30కు విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో మరణించారు. కామ్రేడ్ సోనీ మృతిపట్ల సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్రకమిటీ తీవ్ర దిగ్భ్రాంతిని, తీవ్ర విచారాన్ని వ్యక్తం చేస్తోంది. కామ్రేడ్ సోనీకి విప్లవ జోహార్లర్పిస్తోంది.

1958 సం॥లో ఆస్తిక భావాలున్న సాంప్రదాయ కుటుంబంలో జన్మించిన కా॥యద్దనపూడి సోనీ(సోమేశ్వర జానకీరాం) బందరులో డిగ్రీ చదువుతున్న కాలంలోనే నాస్తికభావాలవైపు, తర్వాత నాటి డిఎస్ఓ పరిచయాల్లోకి వచ్చారు. మార్క్సిజాన్ని అవగాహన చేసుకుంటూ 1980 సం॥నాటికి విప్లవమే వృత్తిగా, విప్లవ రాజకీయాచరణకు జీవితాన్ని అంకితం చేయాలని నిర్ణయించుకున్నారు.

బందరు ప్రాంతంలో విప్లవోద్యమ నిర్మాణ బాధ్యతలలో భాగంగా పట్టణంలో విద్యార్థుల, శ్రామిక యూనియన్ల ఏర్పాటుతోపాటు పేదల నివాసకాలనీల ఏర్పాటుకు నాయకత్వం వహించారు. బందరు పరిసర తీరప్రాంత గ్రామాలలో పల్లెకారుల, రైతాంగ - భూమి, హక్కుల సమస్యలపై నిరంతర రాజకీయ, ఉద్యమ, నిర్మాణ కృషిసాగించారు. దీనికి కళారంగాన్ని సృజనాత్మకంగా జోడించి ప్రజలను విస్తృతంగా సమీకరించి, ఆందోళనా క్రమంలో ప్రజలు అనేక విజయాలు సాధించుకునేందుకు నేతృత్వం వహించారు.

కామ్రేడ్ సోనీ మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనావిధానానికి నిబద్ధుడై, పార్టీ నిర్మాణ క్రమశిక్షణకు కట్టుబడి కడదాకా కృషిసాగించారు. పెడధోరణులకు, సిద్ధాంత గందరగోళాలకు వ్యతిరేకంగా ఆంతరంగికంగా జరిగిన సంఘర్షణల్లో సరైన వైఖరులను నిలబెట్టటంలో వ్యక్తిగత సాన్నిహిత్యాలను సైతం లెక్కచేయక కా॥ సోనీ దృఢంగా నిలిచారు. పార్టీ సిద్ధాంతం, ప్రజాయుద్ధపంథా ఆచరణలపై భావజాలపరంగా జరిగే దాడులను సమర్థంగా తిప్పికొట్టారు.

ఉద్యమక్రమంలో కా॥సోనీపై, ఇతర కామ్రేడ్స్‌పై రౌడీగూండాలు భౌతిక దాడులకు పాల్పడినా, దుష్ప్రచారాలు చేసినా వెరవలేదు. పోలీసుల వేధింపులకు, అక్రమకేసులకు జంకలేదు. నిరంతర కార్యాచరణతో ఈ అడ్డంకులనన్నీ ఎదుర్కొంటూ కా॥సోనీ నాయకత్వంలో ప్రజలు ఉద్యమాన్ని కాపాడుకున్నారు.

కృష్ణాజిల్లాలో పార్టీ నిర్మాణ బాధ్యతలతోపాటు, రాష్ట్రస్థాయిలో 1986 సం॥లో ఏర్పడిన రైతుకూలీ పేదలసంఘం రాష్ట్రకార్యవర్గ సభ్యునిగా, విప్లవసంఘాల విలీనం తర్వాత రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్రకోశాధికారిగా, మరణించే సమయానికి సంఘం రాష్ట్రసహాయ కార్యదర్శిగా కా॥సోనీ బాధ్యతలు నిర్వహించారు. రాష్ట్రస్థాయిలోనూ, ఆయా జిల్లాలలోనూ జరిగిన రైతు, కూలీ, ఆదివాసీ, ప్రజాఉద్యమాలకు అండదండగా కా॥సోనీ రాష్ట్రంలోని వివిధ జిల్లాలలో జరిగిన కార్యక్రమాలలో పాల్గొన్నారు.

వివిధ జిల్లాలలోని కార్మిక యూనియన్లు పునస్సంఘటితమై 2008లో రాజమండ్రిలో జరుపుకున్న ఏపిఎఫ్‌టియు రాష్ట్రమహాసభలో కా॥సోనీ రాష్ట్రకార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. తదనంతర కాలంలో విప్లవ కార్మిక సంస్థల ఐక్యతతో ఏర్పడిన ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్రకార్యదర్శిగా 2016 వరకు కా॥సోనీ బాధ్యతలు నిర్వహించారు. తన అనారోగ్యాన్ని సైతం లెక్కచేయక నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నలుమూలలా పర్యటించి కార్మికుల ఆందోళనలకు దన్నుగా నిలిచారు.

సునిశిత పరిశీలన, రాజకీయ చతురత, అన్వయింపు, హాస్యధోరణి, సృజనాత్మకత మెండుగా కల కా॥సోనీ చైతన్యరథం, ధరలు బాబోయ్ ధరలు, పరిపాలనాచక్రం, ప్రతిభా ఓ ప్రతిభా, అణుభూతం వంటి పలు వీధినాటికల రూపకల్పనలో క్రియాశీలక పాత్ర నిర్వహించారు. ప్రజాకళాకారునిగా రాష్ట్రవ్యాపితంగా వందలాది వీధినాటిక ప్రదర్శనలలో పాత్రధారిగా కా॥సోనీ మన్ననలు పొందారు.

**కా॥సోనీ మృతికి సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్రకమిటీ తీవ్ర విచారం వ్యక్తంచేస్తూ, ఆ కామ్రేడ్‌కు జోహార్లర్పిస్తోంది. కామ్రేడ్ సోనీ కుటుంబ సభ్యులకు తన తీవ్ర సంతాపాన్ని తెలియపరుస్తోంది.**

**విజయవాడ**
**20-2-18**

**సిపిఐ(ఎం-ఎల్)**
**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రకమిటీ**



Printed, Published and Owned by P. Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010
and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2
Editor : P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010